www.manatelangana.news
Mana Telangana
మన తెలంగాణ
హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 206 | మంగళవారం | 15 జనవరి, 2019
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00





శుభాకాంక్షలు...

పాఠకులకు, ప్రకటన కర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు

సెలవు...

పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. రేపు 16వ తేదీ సంచిక వెలువడదు. తిరిగి 17న కలుసుకుందాం

-ఎడిటర్

100 చానళ్లకు రూ.153.40

ఫ్రీ లేదా పెయిడ్ ఏవైనా ఎంచుకోవచ్చు: ట్రాయ్



న్యూఢిల్లీ: టెలివిజన్ వీక్షకులు వంద పెయిడ్ లేదా ఫ్రీ చానళ్లను రూ.153.40కే పొందవచ్చని ట్రాయ్ (టెలికం రెగ్యులేటరీ అథారిటీ) తెలిపింది. జిఎస్‌టితో కలుపుకొని ఈ మొత్తాన్ని చెల్లించాలని సూచించింది. కేబుల్ లేదా డిటిహెచ్‌లలో100 చానళ్లను వీక్షించవచ్చన్న ట్రాయ్ జనవరి 31లోగా ఈ వంద చానళ్లను తరువాయి 6లో

వరుసగా ఐదో రోజూ పెరిగిన పెట్రోల్‌ధర 14

- ఢిల్లీలో లీటరు రూ.70పైనే, డీజిల్ రూ.64.18, ముంబయిలో రూ. 75.77, రూ.67.18





మకరజ్యోతి దర్శనం

- దర్శించుకున్న లక్షలాది మంది అయ్యప్ప భక్తులు
- 6వేల మందితో పోలీసు బందోబస్తు
- భక్తులలో గాయని పి. సుశీల

శబరిమల: మకరజ్యోతి దర్శనం సందర్భంగా సోమవారం శబరి గిరులు అయ్యప్ప ఘోషతో మార్మోగాయి. సోమవారం సాయంత్రం ఆరున్నర గంటలకు జ్యోతి రూపంలో దర్శనమిచ్చిన మణికంఠుడిని దర్శించుకుని లక్షలాది అయ్యప్ప భక్తులు పులకించి పోయారు. మకర జ్యోతిని దర్శించుకునేందుకు ఆదివారంనుంచే పెద్ద సంఖ్యలో తరువాయి 6లో


17 నుంచి అసెంబ్లీ



- 20వరకు నాలుగు రోజులు జరుగనున్న శాసనసభ సమావేశాలు
- 16 సాయంత్రం 5 గంటలకు ప్రోటెం స్పీకర్ ప్రమాణం
- 17న 11.30కి సమావేశాలు ప్రారంభం
- 18న స్పీకర్ ఎన్నిక, 19న గవర్నర్ ప్రసంగం, 20న ధన్యవాద తీర్మానం


మన తెలంగాణ/హైదరాబాద్

తెలంగాణ శాసనసభ సమావేశాలు జనవరి 17 నుంచి 20వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరుగనున్నాయి. జనవరి 16న(శుక్రవారం) సాయంత్రం 5 గంటలకు ప్రొటెం స్పీకర్‌గా మజ్లిస్ ఎంఎల్‌ఎ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్ రాజ్‌భవన్‌లో ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తారు. మరుసటి రోజు నుంచి శాసనసభ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. జనవరి 17వ తేదీన ఉదయం 11.30 గంటలకు ప్రొటెం స్పీకర్ అధ్యక్షతన అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయి. నూతనంగా ఎన్నికైన శాసనసభ సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారు. ముందుగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో ప్రమాణ స్వీకారం చేయించి తర్వాత ప్రతిపక్ష నాయకునితో ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం మహిళా శాసనసభ్యులచే, ఆ తర్వాత మిగతా ఎంఎల్‌ఎలతో ప్రమాణస్వీకారం చేయిస్తారు. ఈ కార్యక్రమం సుమారు రెండు గంటల పాటు కొనసాగుతుంది. అదే రోజు స్పీకర్ ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటన, నామినేషన్ కార్యక్రమాలు ఉంటాయి. ఈ తరువాయి 6లో



11

బంగారమే



రూ.33,000 దాటిన బంగారం

సోమవారం నాడు రూ. 225 పెరుగుదల

కర్ణాటకలో కప్పల రాజకీయం 16



ముగ్గుల్లో రైతుబంధు, కెటిఆర్ 7

నిన్న పులి, నేడు చిరుత

- మంచిర్యాల జిల్లా పెంబి అడవిలో పులి హత్య మరవక ముందే చిరుతను చంపేసిన విద్యుత్ తీగ
- రంగంపేట పరిసరాల్లో పందుల కోసం అమర్చిన తీగ తగిలి మరణం



మన తెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి

వన్యప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి చిరుత పులి మృతి చెందింది. ఈ సంఘటన మూడురోజుల క్రితమే జరుగగా సోమవారం వెలుగు చూసింది. పది రోజుల క్రితం పెంబి అటవీ ప్రాంతంలో వేటగాళ్లు పెద్దపులిని హతమార్చి చర్మాన్ని కారులో తరలిస్తుండగా అటవీ శాఖ అధికారులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పులి చర్మాన్ని స్వాధీనం చేసుకోవడమే కాకుండా ఐదుగురు వేటగాళ్లను అరెస్టు చేసిన సంఘటన తరువాయి 6లో



కిడ్నీ రోగుల పుట్టపాక

ఇప్పటికే 11మంది మృతి, 300 మంది వ్యాధిగ్రస్థులు



మన తెలంగాణ/
సంస్థాన్‌నారాయణపురం

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థానారాయణపురం మండలం పుట్టపాక గ్రామం కిడ్నీ వ్యాధుల పుట్టగా మారింది. ఇప్పటికే ఈ వ్యాధితో 11 మంది దుర్మరణం పాలుకాగా, మరో 300 మంది ఈ వ్యాధితో నరకయాతన అనుభవిస్తున్నారు. గ్రామంలో దశాబ్దాలుగా మంచినీటి వసతి తరువాయి 6లో

ఎపిలో బిసిలకు నాయకత్వం వహిస్తా : తలసాని 3



గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు



మనతెలంగాణ/హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల ప్రజలకు గవర్నర్ నరసింహన్ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని గవర్నర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో తెలుగుతనం ఉట్టిపడేలా, సంస్కృతీ, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఈ పండుగను జరుపుకోవాలని ఆయన పేర్కొన్నారు.



హోంమంత్రిని సన్మానించిన టియుఎఫ్

మనతెలంగాణ/హైదరాబాద్ : ది యునైటెడ్ ఫోరం అధ్యక్షుడు (టియుఎఫ్) జి.ఎస్.కుమారస్వామి హోంమంత్రి మహమూద్‌అలీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన శాలువాతో మహమూద్‌అలీని సత్కరించారు. హోం మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జి.ఎస్.కుమారస్వామి మహమూద్‌అలీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'విద్యుత్' నియామకాల గడువు పొడిగింపు

మన తెలంగాణ/హైదరాబాద్: విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్, ఇద్దరు సభ్యుల నియామయానికి దరఖాస్తుల గడువును ప్రభుత్వం జనవరి 25 వరకు పొడిగించింది. 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు తమకు చేరిన దరఖాస్తులనే పరిగణిస్తామని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా తెలిపారు. తొలుత విధించిన గడువు ఈ నెల 10 వరకే ఉంది. మరింత మంది ఔత్సాహికుల సౌలభ్యం కోసం గడువు పొడిగించారు. దరఖాస్తులను ఎంపిక కమిటీకి పంపుతారు. ఇందుకోసం రిటైర్డ్ జడ్జి జస్టిస్ వి.భాస్కరరావు నేతృత్వంలో కమిటీని ప్రభుత్వం ఇదివరకే ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి, సిఇఎ చైర్మన్ సభ్యులుగా ఉంటారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

పంచాయతీ ఎన్నికల్లో 'మద్యం' జోరు



ఓటర్లకు ప్రలోభాలు షురూ • పోలీసులకు చిక్కకుండా పకడ్బందీగా పంపిణీ



మన తెలంగాణ/హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల వేళ గ్రామాల్లో గుట్టు చప్పుడు కాకుండా మద్యం సరఫరా జరుగుతోంది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు పకడ్బందీగా, నమ్మకస్తుల చేత పోటీలో ఉన్న అభ్యర్థులు లిక్కర్, బీరు బాటిళ్లను పంపిణీ చేస్తున్నారు. అక్కడక్కడా మద్యం బాటిళ్ళు పట్టుబడుతున్నాయి. కానీ కంటికి కనిపించకుండా పెట్టెలకొద్దీ సరఫరా అవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్నంత పోలీసు నిఘా పంచాయతీ ఎన్నికల్లో లేకపోవడం అభ్యర్థులకు కలిసొచ్చింది. దాదాపు అన్ని జిల్లాల్లో 100ల లీటర్ల మద్యం పట్టుబడింది. అయితే పోలీసుల కళ్లుగప్పి వేల లీటర్ల మద్యం గ్రామాల్లో ఏరులై పారుతోంది. మొదటి విడతలో 3,701 పంచాయతీలకు సర్పంచ్, 28,976 వార్డులకు ఈ నెల 21వ తేదీన పోలింగ్ ఉంది. వాస్తవానికి మొదటి విడతకు ఆదివారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు గ్రామాల్లో ప్రచారం మొదలుపెట్టారు. ముఖ్యంగా జనరల్ స్థానాల్లో ఓటర్ల సంఖ్యను బట్టి ఎక్కువగా బహు, త్రిముఖ పోటీ ఉంటుందని అంచనా వేస్తున్నారు. పోటీకి అనుగుణంగా అభ్యర్థులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రకరకాల మార్గాలను ఎంచుకుంటున్నారు. ఇందులో ప్రధానమైనవి నగదు, మద్యమే. అయితే నగదును పోలింగ్ తేదీకి ఒకటి, రెండు రోజుల ముందు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇప్పుడే ఇస్తే చివరి నాడు కష్టమౌతుందని, ప్రత్యర్థి ఇచ్చే దానిని బట్టి తాము కూడా ఇవ్వాల్సి ఉంటుందని యదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలంలో పోటీలో ఉన్న ఒక సర్పంచ్ అభ్యర్థి వ్యాఖ్యానించారు. అయితే మద్యం మాత్రం రోజు తప్పి ఓటర్లకు అప్పుడే పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇండ్లల్లోనే బెల్టు షాప్‌లు నిర్వహిస్తుండడం బహిరంగ రహస్యం. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చాలా మంది అభ్యర్థులు ముందుగానే బెల్టు షాపుల నిర్వాహకులతో మాట్లాడుకుని ఓటర్లకు చిట్టీలు పంపిణీ చేసి బెల్టు షాప్‌కు వెళ్లిన చిట్టీ చూపించి లిక్కర్ లేదా బీరు బాటిల్‌లు తీసుకుంటున్నారు. అయితే మద్యానికి అడ్డుకట్ట వేసేందుకు అసెంబ్లీ ఎన్నికలకు చేసినంత పకడ్బందీగా, పటిష్ట ఏర్పాట్లు పంచాయతీ ఎన్నికల్లో చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

పెద్దలకు మందు.. యువతకు బీర్లు

పంచాయతీ ఎన్నికల్లో 30 ఏళ్లు దాటిన ఓటర్లకు లిక్కర్ (మద్యం)ను ఇస్తున్నట్లు తెలిసింది. యువతకు మాత్రం బీరు బాటిళ్లను సరఫరా చేస్తున్నారు. సాయంత్రం 7 తరువాత గ్రూప్‌లుగా ఏర్పడి ఎవరికి వారు ఏర్పాటు చేసుకున్న ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నారు. అయితే గ్రామాల్లో మద్యం అంతగా పట్టుబడకపోవడానికి పోలీసులు కూడా కొన్ని కారణాలు చెబుతున్నారు. పోటీ చేసే అభ్యర్థులు ఊర్లో తనకు అనుకూలమైన ఎక్కువ మంది ఇళ్లల్లో తక్కువ మొత్తంలో బాటిళ్లను పెట్టి సరఫరా చేస్తున్నారన్నారు. ప్రతీ ఇంట్లోకి వెళ్లి సోదాలు చేయడం కష్టమని, అందులో భాగంగానే ఎక్కువ మొత్తంలో సీజ్ చేయలేకపోతున్నామని వారు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా అసెంబ్లీ ఎన్నికలకు పెట్టిన నిబంధనలు పంచాయతీ ఎన్నికలకు ఎక్సైజ్ శాఖ పెట్టకపోవడంతో విచ్చలవిడిగా వైన్‌షాప్‌ల నుంచి విచ్చలవిడిగా కొనుగోలు చేసి స్టోర్ చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు నగదును రూ. 1.17 కోట్లు, రూ.4.82 లక్షల విలువ చేసే ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

సర్పంచ్ నుంచి మంత్రి దాకా..

- విద్యార్థి దశ నుంచే లక్ష్మారెడ్డిలో నాయకత్వ లక్షణాలు
- యువజన నేతగా గుర్తింపు
- సర్పంచ్, విండో, గ్రంథాలయ చైర్మన్ పదవులు



మన తెలంగాణ / మహబూబ్‌నగర్ : ఓ సామాన్య రైతు కుటుంబంలో పుట్టి రాజకీయ చైతన్యాన్ని పుణికి పుచ్చుకుని సర్పంచ్ స్థాయి నుంచి మంత్రి దాకా ఎదిగిన ఆవంచ డాక్టర్ చర్లకోల లక్ష్మారెడ్డి అధికార పార్టీ టిఆర్‌ఎస్‌లో కీలక నేతగా ఎదిగారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఎమ్మెల్యే పదవిని సైతం తృణప్రాయంగా తలచి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పార్టీ పటిష్టం, తెలంగాణ కోసం పాటుపడిన మహావ్యక్తిగా నిలిచారు. యువజన నేతగా గ్రామ స్థాయిలో సర్పంచ్ పదవితో రాజకీయ ఆరంగేట్రం చేసిన లక్ష్మారెడ్డి సామాన్య వ్యక్తిగా తన నిరాడంబరతను ప్రదర్శిస్తూ తమ పార్టీ అధినేత సిఎం కేసీఆర్‌కు విధేయుడిగా ఉంటూ వస్తున్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోని తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామంలో 1962 ఫిబ్రవరి 3న డాక్టర్ లక్ష్మారెడ్డి జన్మించారు. పాతికేళ్ల వయసులో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అటు తర్వాత సింగిల్‌విండో చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పనిచేశారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీల సభ్యుడిగా పని చేయడమే కాకుండా తెలుగు యువత జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటే ధ్యేయంగా 2001లో ఏర్పాటైన టిఆర్‌ఎస్ పార్టీలో చేరి సిఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా మెలుగుతూ వచ్చారు. లక్ష్మారెడ్డి 2004లో జడ్చర్ల నియోజకవర్గం నుంచి టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. టిఆర్‌ఎస్ ఉద్యమంలో కేసీఆర్‌కు అండగా నిలిచారు. తెలంగాణ కోసం ఏడాది ఎమ్మెల్యే పదవి కాలం ఉండగానే 2008లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. 2009లో పొత్తుల కారణంగా ఎమ్మెల్యే అవకాశాలను లక్ష్మారెడ్డి జారవిడుచుకున్నారు. సిఎం కేసీఆర్ 2009లో మహబూబ్‌నగర్ ఎంపిగా గెలుపు కోసం లక్ష్మారెడ్డి తన శాయశక్తుల కృషి చేశారు. 2014లో జడ్చర్ల నియోజకవర్గం నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి తన సత్తా చాటుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం మంత్రివర్గంలో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ తెలంగాణ రాష్ట్ర తొలి విద్యుత్ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర కేబినెట్‌లో డిప్యూటి సిఎంగానూ, ఆరోగ్య మంత్రిగా ఉన్న టి.రాజయ్య పదవీచ్యుతుడు కావడంతో ఆయన స్థానంలో లక్ష్మారెడ్డిని ఆరోగ్య మంత్రిగా సిఎం కేసీఆర్ నియమించారు. తిరిగి 2018లో డిసెంబర్ ఏడున జరిగిన రాష్ట్ర ముందస్తు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా జడ్చర్ల నుంచి ముచ్చటగా మూడోసారి గెలుపొందిన డాక్టర్ లక్ష్మారెడ్డి అటు అధినేత సిఎం కేసీఆర్ ఆశీస్సులతో పాటు ఇటు నియోజకవర్గ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారనే చెప్పాలి.



చైనా మాంజా విక్రయాలపై ప్రత్యేక దృష్టి

- వంద బండిళ్లను సీజ్ చేసిన అటవీశాఖ అధికారులు
- ఆలయాలను గోదాములుగా మార్చుకున్న వ్యాపారులు

మన తెలంగాణ / హైదరాబాద్ : సింథటిక్‌తో కూడిన నైలాన్ మాంజను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించడంతో అటవీశాఖ ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసింది. పర్యావరణ పరిరక్షణ తో పాటు పక్షుల సంరక్షణ నిమిత్తం మాంజను ఉత్పత్తి, విక్రయంతో పాటు నిల్వ, రవాణాను అడ్డుకునేందుకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో అటవీశాఖ ప్రత్యేకంగా అధికారులు, సిబ్బంది కూడిన బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు హైదరాబాద్ మహా నగరంతో పాటు రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాల్లో తనిఖీలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా పతంగుల విక్రయదారులతో పాటు దుకాణాలు, గోదాముల్లో ఈ తనిఖీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నగరంలోని మాంజాను విక్రయిస్తున్న వారి నుంచి భారీగా స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి దాదాపు వంద రౌండ్ల మేరకు మాంజను సీజ్ చేసినట్లు అధికార యంత్రాంగం తెలిపింది. నగరంలో అత్యధికంగా మాంజ హోల్‌సేల్ విక్రేతలు పాత నగరంలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో వ్యాపారులు దుకాణాల్లో పతంగులతో పాటు సాధార ణ మంజాలను విక్రయిస్తూ తెలిసిన వారికి భారీస్థాయిలో చైనా మాంజను సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఒక్కో దుకాణదారుడికి నాలుగైదుకు తక్కువ కాకుండా గోదాముల ను ఏర్పాటు చేసుకొని చైనా మాంజను విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులతో పాటు అటవీశాఖ గోదాము లను తనిఖీ చేస్తారనే ఉద్దేశ్యంతో వారి కంట పడకుండా ఉండేందుకు ప్రార్థన మందిరాల ప్రాంగణాల్లో ఉన్న గోదాములతో పాటు వాటికి అనుసంధానంగా ఉండే గదులు, దుకాణాలను గోదాములుగా మార్చుకొని వాటిలో నిల్వ ఉంచి గుట్టుచప్పుడు కాకుండా అమ్ముతున్నారు. ప్రధానంగా రిటైల్ వ్యాపారులతో పాటు గ్రామాలకు భారీ స్థాయిలో మాంజను సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. వీటిని అడ్డుకునేందుకు అటవీ శాఖ పోలీసుల సహకారంతో చేస్తున్న ప్రయత్నాలు పెద్దగా ఫలించడం లేదు. పాత నగరంలోని యాఖుత్‌పురా, చాంద్రాయణ గుట్ట, చార్మినార్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో నిల్వ ఉంచి సెల్‌ఫోన్లతో పాటు ఇతర మాధ్యమాల ద్వారా సమాచారాన్ని అందిస్తూ చైనా మాంజను వ్యాపారులకు చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. సింథటిక్ మాంజ నిషేధం అమల్లోకి వచ్చి మూడేళ్లయినా దీనిపై అటవీశాఖ ఆశించిన మేరకు ప్రచారాన్ని కల్పించకపోవడంతో ఉత్పత్తి జరగడం తో పాటు విక్రయాలు కూడా అత్యధికంగా సాగుతున్నాయని పలువురు పతంగి ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. సింథటిక్ మాంజా వల్ల కలిగే నష్టాలతో పాటు ఇతరత్రా సాధారణ మాంజ వినియోగం వల్ల కలిగే లాభాలతో పాటు భారీ స్థాయిలో విక్రయిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటే నిషేధాన్ని అమలు చేయడం కష్టమనే అభి ప్రాయాలను కూడా వ్యక్తం చేస్తున్నారు. తనిఖీలు, ఇతర రకాల ఒత్తిడిలతో చైనా మాంజను విక్రేతలను అరికట్టడం సాధ్యం కాదని కూడా వివరిస్తున్నారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు

- సంగారెడ్డిలో పాత పంటల జాతర ప్రారంభించిన అకున్‌సబర్వాల్





మన తెలంగాణ / హైదరాబాద్ : చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్ తెలిపారు. పంజాబ్ రాష్ట్రంలో పుట్టి పెరిగిన తనకు వ్యవసాయంపై అవగాహనతో పాటు అమితమైన ప్రేమ ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పౌరసరఫరాలశాఖ కమిషనర్‌గా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పగడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆహార భద్రతకు ప్రాధాన్యత పెరిగితే సర్వసాధారణంగానే పౌష్టికాహారం దిశగా అడుగులు పడతాయని తెలిపారు. దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ''పాత పంటల జాతర'' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఏడాది సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే జాతర ఈ ఏడాదితో 20 ఏళ్లకు చేరుకుంది. ఈ నేపథ్యంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించేందుకు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అర్జున్‌నాయక్ తండాలో ఏర్పాటు చేసిన జీవ వైవిధ్య ఫెస్టివల్‌ను కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అకున్ సబర్వాల్ మాట్లాడుతూ వ్యవసాయంపై తనకున్న మక్కువే ఈ జాతరకు రావాడానికి కారణమైందన్నారు. సంస్థ ద్వారా ఐదువేల మంది పేద, బలహీన వర్గాలకు చెందిన మహిళలు సంఘటితంగా ఏర్పడి చిరుధాన్యాలను పండించడం అభినందనీయమన్నారు. దీనివల్ల ఆయా మహిళలు సామాజిక, ఆర్థిక అసమానతలను అధిగమించి ఆర్థిక స్వాలంబన, సామాజిక భద్రత దిశగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. ఇది చాలా మెచ్చుకోదగిన విషయమన్నారు. రైతులు తమకు ఇష్టమైన పంటను పండించుకునే హక్కు ను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ''రైతుబంధు'' పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. పౌష్టికాహార భద్రతను సాధించే క్రమంలో చిరుధాన్యాలు ఎంతో విలువైనవన్నారు. ఈ పంటకు తక్కువ పెట్టుబడి తక్కువ నీటి వినియోగంతో పండే చిరుధాన్యాలు ఆహార భద్రతతో పాటు పౌష్టికాహార భద్రతకు నాందిగా మారే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జీవ వైవిధ్యం ఎంతో కృషి చేసిన బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన మేధరి నాగమణి, అలగోల్ గ్రామానికి చెందిన మిసన గారి ఇందిరమ్మను ఈ సందర్భంగా కమిషనర్ సత్కరించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ గాలెబ్ పాల్గొన్నారు.

సాంకేతిక అధ్యాపకుల భద్రత ప్రశ్నార్థకం

- 1:15 నిష్పత్తితో రోడ్డున పడ్డ 15 వేల మంది ఫ్యాకల్టీ
- కొనసాగుతున్న అధ్యాపకులు సగం వేతనం తిరిగివ్వాల్సిందే



మనతెలంగాణ/హైదరాబాద్ :ప్రైవేట్ ఇంజనీరింగ్, ఎంబిఎ, ఎంసిఎ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు భద్రత కరువైంది. అధ్యాపకులు, విద్యార్థుల నిష్పత్తి 1: 15 నుంచి 1:20 పెంచుతూ అఖిల భారత విద్యామండలి(ఎఐసిటిఇ) తీసుకొచ్చిన కొత్త నిబంధనతో సుమారు 15 వేల అధ్యాపకులు ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారు. ఎం.టెక్, పిహెచ్‌డి వంటి ఉన్నత అర్హతలు కలిగి ఉండి ఇప్పటివరకు అధ్యాపకులుగా కొనసాగి గత జూన్, జూలైలో ఉద్యోగాలు కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారు. సాంకేతిక కళాశాలల్లో అధ్యాపకులు, విద్యార్థుల నిష్పత్తి 2017–18 విద్యాసంవత్సరం వరకు 1:15 ఉండగా, 2018–19 విద్యాసంవత్సరంలో దానిని 1:20 నిష్పత్తికి పెంచారు. దాంతో ప్రైవేట్ యాజమాన్యాలు సిబ్బందిని తగ్గించుకున్నాయి.

50 శాతం వేతనం వెనక్కి ఇవ్వాల్సిందే

ప్రైవేటు కళాశాలల్లోని ఇంజనీరింగ్ అధ్యాపకుల వేతనాల బాధలు మాటల్లో చెప్పలేనివి. ఎఐసిటిఇ నిర్దేశాల ప్రకారం అధ్యాకులకు రూ.80 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు వేతనం జమ చేస్తూ అందులో సగం జీతం మళ్లీ వెనక్కి తీసుకుంటున్నారు. అధ్యాపకులు నెలకు రూ. 40 వేల నుంచి రూ. 60 వేల వరకు వేతనాలు పొందుతున్నప్పటికీ వారు రూ.80 వేల నుంచి రూ. 1.50 లక్షల వేతనం పొందుతున్న వారు చెల్లించాల్సిన పన్నులన్నీ ఉద్యోగులే చెల్లించాల్సిందిగా యాజమాన్యాలు షరతు విధిస్తున్నాయి. కళాశాలల్లో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నా ప్రత్యామ్నాయం లేక అధ్యాపకులు అక్కడే కొనసాగుతున్నారు. ఇందుకు సిద్ధపడితేనే వారికి ఉద్యోగం గ్యారంటీ లేదంటే మరో దారి చూసుకోవాల్సిందే. యాజమాన్యాలు ఒక చేత్తో వేతనాలు జమచేసి, మరో చేత్తో తిరిగి తీసుకుంటున్నాయి. ఈ తంతు చాలా కళాశాలల్లో కొనసాగుతున్నా, ఆధారాలు లేకపోవడంతో ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారు. ఇతర కళాశాలల్లో అవకాశాలు దొరకవనే అనుమానంతో దీనికి ఒప్పుకోక తప్పడంలేదు.

రికార్డుల్లో పక్కాగా...

కళాశాలల యాజమాన్యాలు రికార్డుల్లో ఎక్కడా దొరకకుండా జాగ్రత్త పడుతున్నారు. ఎఐసిటిఇ నిబంధనల మేరకు అధ్యాపకులకు యుజిసి 6వ పే చెల్లిస్తున్నట్లు రికార్డుల్లో చూపిస్తూ, దొడ్డిదారిలో తిరిగి తీసుకుంటున్నారు. కొన్ని కళాశాలల యాజమాన్యాలు అధ్యాపకుల బ్యాంకు ఎటిఎం కార్డు, సంతకం చేసిన చెక్‌లను ముందే తీసుకుని నెలనెలా జమ చేసిన వేతనంలో నుంచి సగానికిపైగా తిరిగి తీసుకుంటున్నాయి. కొన్ని కళాశాలలు అధ్యాపకులే బ్యాంకు నుంచి ఆ మొత్తాన్ని డ్రా చేసుకుని తమకు ఇచ్చేలా ఏర్పాటు చేసుకున్నారు. అధ్యాపకుల నుంచి తిరిగి తీసుకునే సొమ్మును ఎక్కడా రికార్డుల్లోకి ఎక్కదు. ఈ తతంగమంతా మౌఖిక ఆదేశాలతోనే సాగుతుంటుంది. ఎక్కడా రాతపూర్వక లేఖలు, ఈ మెయిల్ వంటివి ఉండవు. ఎలాంటి ఆధారాలు లేవు. దాంతో అధ్యాపకులు ఎక్కడా ఫిర్యాదు చేయలేకపోతున్నారు.

సర్టిఫికెట్లు ఇస్తేనే ఉద్యోగం

ఇంజనీరింగ్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల ఒరిజినల్ సర్టిఫికెట్లు యాజమాన్యాల వద్ద డిపాజిట్ చేస్తేనే ఉద్యోగాలు దొరుకుతాయి. ఎఐసిటిఇ నిబంధనల ప్రకారం ఏ యాజమాన్యం కూడా అధ్యాపకుల సర్టిఫికెట్లను డిపాజిట్ చేసుకోకూడదు. కానీ నిబంధనలను ఖాతరు చేయకుండా చాలా కళాశాలలు ఉద్యోగుల సర్టిఫికెట్లను తమ వద్దనే ఉంచుకుంటున్నాయి. ఉద్యోగం తప్పనిసరి అవసరమై సర్టిఫికెట్లు డిపాజిట్ చేసిన అధ్యాపకులు యాజమాన్యాలు ఎంత జీతం ఇచ్చినా, ఎదురు మాట్లాడకుండా కొనసాగుతున్నారు.

పాత విధానం కొనసాగించాలి

సాంకేతిక విద్యా కళాశాలల్లో అధ్యాపకులు, విద్యార్థుల నిష్పత్తిని తిరిగి 1:15 నిష్పత్తికి తగ్గించాలి. యాజమాన్యాలు అధ్యాపకుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. దీనిపై న్యాయపోరాటం చేస్తున్నాం. న్యాయస్థానం తీర్పు మాకు అనుకూలంగా వస్తుందని భావిస్తున్నాం. అలాగే నిబంధన ప్రకారం వేతనాలు బ్యాంకు ఖాతాలో జమ చేస్తూనే, సగానికి పైగా వేతనాన్ని తిరిగి తీసుకుంటున్నాయి. అన్ని అర్హతలున్నా అధ్యాపకులు అరకొర వేతనాలతోనే జీవనం సాగించాల్సి వస్తుంది. ఈ తరహా వ్యవహారం నడుపుతున్న కళాశాలలపై సంబంధిత సంస్థలు, వర్సిటీలు చర్యలు తీసుకోవాలి.

గ్యాంగ్‌రేప్ ఘటనపై హోంమంత్రి సీరియస్

కేసును దర్యాప్తును వేగవంతం చేయాలని సిపికి ఆదేశం



మనతెలంగాణ/హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని కామాటిపూర పోలీస్ స్టేషన్ పరిధిలో పాతబస్తీలో 16 ఏళ్ల మైనర్ బాలికపై సామూహిక అత్యాచార ఘటనపై సోమవారం హోంమంత్రి మహమూద్ అలీ సీరియస్ అయ్యారు. అత్యాచార ఘటన జరిగిన వివరాలను నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అత్యాచార ఘటన కేసును వేగవంతంగా దర్యాప్తు చేసి నిందితులకు చట్టపరంగా కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని హోంమంత్రి మహమూద్‌అలీ పోలీసులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలోని కామాటిపురా పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డారని, గత నాలుగేళ్లుగా సదరు బాలికను బెదిరిస్తూ లైంగిక హింసకు పాల్పడ్డారని ఈ కేసులో ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సిపి హోంమంత్రికి వివరించారు. లైంగిక దాడి దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి విజయ్ తన స్నేహితులకు పంపాడు. వీటిని చూసి భయపెట్టిన రాజేశ్ అనే యువకుడు కూడా బాలికపై లైంగిక దాడి చేశాడని తెలిపారు. అనంతరం మరో ఇద్దరు కూడా ఇదే తరహా బెదిరింపులకు పాల్పడి లైంగికదాడి ఆ బాలికపై అత్యాచారం జరిపారని సిపి అంజనీకుమార్ హోంమంత్రికి వివరించారు. లైంగిక హింసకు సంబంధించిన ఫొటోలను సోషల్‌మీడియాలో పెడతామంటూ బెదిరిస్తూ పదకొండు మంది నాలుగేళ్లుగా ఆ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసిందని తెలిపారు. బాధితురాలు తనకు జరిగిన అన్యాయాన్ని తల్లితండ్రులకు తెలియజేయడంతో వారు ఆదివారం కామాటిపుర పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి ఈ కేసులో కీలక నిందితులైన శుభం, రాజేశ్, అభిజిత్ అనే ముగ్గురి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సిపి హోం మంత్రికి తెలిపారు. ఇదిలావుండగా అత్యాచారాల ఘటనలపై దర్యాప్తును వేగవంతం చేయాలిని, బాధితులకు న్యాయం చేసి, నిందితులకు శిక్ష పడేలా చూడాలని హోం మంత్రి రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. దేశ వ్యాప్తంగా తెలంగాణ పోలీసులకు మంచి గుర్తింపు ఉందని, ఆ గుర్తింపును మరింత రెట్టింపు చేసుకునేలా పోలీసులు పనిచేయాన్నారు. మైనర్ బాలిక ఘటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, పక్కా ఆధారాలు సేకరించి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని సిపి అంజనీకుమార్‌కు రాష్ట్ర హోంశాఖ మంత్రి ప్రత్యేక ఆదేశాలిచ్చారు.

షూటింగ్ స్పాట్‌లుగా పర్యాటకప్రాంతాలు



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలోని అందాలను పర్యాటక ప్రియులకు పరిచయం చేసేందుకు వీలైనంతగా సినీ మాధ్యమాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. మారుమూల పల్లెలు మొదలుకొని, హైదరాబాద్ నగరం వరకు ఎన్నో చారిత్రక, సాంస్కృతిక వారసత్వ కేంద్రాలు, లైఫ్‌స్టైల్ సెంటర్లు, జలపాతాలు... ఇలా రాష్ట్ర పర్యాటకం విలువ పెంచే ప్రాంతాలు లెక్కకు మిక్కిలి ఉన్నాయి. సమైక్య పాలనలో సరైన ప్రచారం లేక కనుమరుగైన ప్రాంతాల గురించి ఎలుగెత్తి చాటడమే మిగిలింది. కాళేశ్వరం వంటి గొప్ప ప్రాజెక్టులు, చారిత్రక శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు, పక్కనే నల్లమల అరణ్యం, పులుల రక్షిత కేంద్రాలు, మధ్యలో జలపాతాలు.. శాఖల వారీగా షూటింగులకు వీలైన ప్రాంతాల జాబితాను తయారుచేయాలని ప్రభుత్వం అన్ని శాఖలను ఆదేశించినట్లు తెలిసింది. ఈ మేరకు వచ్చిన అన్ని ప్రాంతాలను వర్గీకరించి, సింగిల్ విండో పద్ధతిలో షూటింగులకు అనుమతి ఇచ్చేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. ఈ మేరకు ఇప్పటికే కసరత్తు మొదలైంది. అటవీశాఖ నుంచి అడవుల జాబితా, పార్కులు, ఎకో ఫ్రెండ్లీ ప్రాంతాలు, ప్రకృతి రమణీయత, నీటి సౌలభ్యం ఆధారంగా ఆయా ప్రాంతాలను వర్గీకరిస్తున్నారు. ఇదేవిధంగా ఇరిగేషన్ శాఖ నుంచి కొత్త, పాత ప్రాజెక్టుల జాబితాలు, ఎక్కడెక్కడ షూటింగులకు వీలవుతుందో, వాటి ఆధారంగా ప్రాజెక్టుల వర్గీకరణ చేస్తున్నారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే సింగిల్‌విండో పద్ధతిలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో షూటింగులకు అనుమతి కోరుతూ చలనచిత్ర నిర్మాతలు, ప్రొడక్షన్ హౌజ్‌లు దరఖాస్తు చేసుకుంటాయి. టిఎస్ ఐపాస్ తరహాలో సకాలంలో అనుమతినివ్వాల్సి ఉంటుంది. వారం దాటినా అనుమతి ఇవ్వకపోతే, ఇచ్చినట్లుగానే నిర్మాతలు భావించవచ్చు. చాలా శాఖలకు సంబంధించిన వారితో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది. దీంతో ప్రతి శాఖకు షూటింగులకు సంబంధించి ఒక లైజనింగ్ అధికారిని ప్రత్యేకంగా నియమించారని తెలిసింది. వీరే క్షేత్రస్థాయిలోని దరఖాస్తులకు, ఉన్నతస్థాయిలోని కార్యాలయాలకు మధ్య అనుసంధానంగా ఉంటారు. నిబంధనలకు లోబడి ఉన్న వాటికి సకాలంలో అనుమతులు వచ్చేలా అనుసంధానం చేస్తారు. రాష్ట్రంలోని ప్రతిపాదిత షూటింగ్ లొకేషన్లను మూడు విభాగాలుగా విభజించారు. ఇందులో రెడ్ జోన్, గ్రీన్ జోన్, ఎల్లో జోన్లలో వేర్వేరుగా రోజు వారీగా రుసుములు వసూలు చేస్తారు. రెడ్ జోన్‌లో షూటింగులకు అనుమతులు ఇవ్వరు. గ్రీన్ జోన్‌లో రోజుకు రూ.15 వేల చొప్పున, ఎల్లో జోన్‌లో రూ.20 వేల చొప్పున చార్జీలు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి తోడు షూటింగు సమయాల్లో జరిగే నష్టాలకు గాను ముందు జాగ్రత్తగా రూ.50 వేలు కాషన్ డిపాజిట్‌గా ఎఫ్‌డిసి తీసుకుంటుంది. షూటింగ్ లొకేషన్లలో ఎటువంటి నష్టం జరగకపోతే, ఆ డిపాజిట్‌ను వాపసు ఇస్తారు. నష్టం జరిగితే, ఆ మేర మినహాయించుకొని, మిగతా మొత్తాన్ని వాపసు చేస్తారు. గ్రీన్‌జోన్‌లోని షూటింగ్ స్పాట్‌లకు ఎటువంటి నిబంధనలు లేకుండా, 24 గంటల పాటు షూటింగ్ చేసుకునే వెసులుబాటును కల్పించారు. ఎల్లో జోన్‌లో మాత్రం పలు నిబంధనలు విధించారు. షూటింగ్ స్పాట్‌ను బట్టి, నిర్దిష్టమైన రోజుల్లో, నిర్దిష్టమైన సమయాల్లోనే షూటింగ్‌కు అనుమతినిస్తారు. దీనికి సంబంధించిన సంబంధిత శాఖలకు ముందుగానే సమాచారం చేరవేస్తారు. సింగిల్ విండో పద్ధతిలో షూటింగ్ అనుమతులు, అన్ని శాఖలు తమ తమ పరిధుల్లోని పర్యాటక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు ఎంపిక చేసి, ముందుగానే జాబితాలు ఇవ్వడంతో నిర్మాతలు తమ తమ బడ్జెట్ పరిధుల్లో ఉన్న వాటిని ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రతి చిన్న చిన్న వాటికి విదేశాలకు వెళ్లే అలవాటు ఉన్న మన నిర్మాతలకు రాష్ట్రంలో ప్రాంతాలు ఎంపిక చేసుకొని, షూటింగులు జరిపితే నిర్మాణ వ్యయం కూడా తగ్గే అవకాశం ఉంటుందన్నది విమర్శులు, విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

కాబూల్‌లో భారీ పేలుడు

నలుగురు బలి...పలువురికి గాయాలు

కాబూల్ : అఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో సోమవారం సాయంత్రం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు. 40 మందికి పైగా గాయపడ్డారు. పలు స్వచ్ఛంద సంస్థలు, ఒక అంతర్జాతీయ హౌసింగ్ కంపెనీ పరిసరాలలో పేలుడు జరిగింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండే ఈ ప్రాంతంలో భారీ విస్ఫోటనం జరగడంతో కలవరం చెలరేగింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు దీనికి బాధ్యులెవరు? అనేది తేల్చుకోవల్సి ఉందని పోలీసు ప్రతినిధి బసీర్ ముజాహిద్ కాబూల్ రాయిటర్స్‌కు తెలిపారు. ట్రక్కు బాంబు పేలుడుతోనే పేలుడు జరిగిందని నిర్ధారించినట్లు అంతర్గత మంత్రిత్వశాఖ తెలిపిందని స్థానిక న్యూస్ వెబ్‌సైట్ టోలోన్యూస్ తెలిపింది. పలు అంతర్జాతీయ సంస్థల కార్యాలయాలు ఉండే ప్రాంతంలోనే దాడి జరిగిందని, తాలిబన్లతో పురోగతిలో ఉన్న చర్చలకు విఘాతం కల్పించేందుకు అజ్ఞాత శక్తులు ఈ పనికి పాల్పడినట్లు వెల్లడైంది. గాయపడ్డ వారిలో కనీసం పది మంది చిన్నారులు కూడా ఉన్నారు. దాడి జరిగిన ప్రాంతంలో ఐరాస సిబ్బంది కూడా నివసిస్తోంది. భారీ విస్ఫోటనంతో పరిసరాలలోని నివాస గృహాలు వాహనాలు బాగా దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతానికి తక్షణం ప్రత్యేక పోలీసు బలగాలను పంపించారు.



హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో కైట్ ఫెస్టివల్

అప్పుడు 662.. ఇప్పుడు769...

పంచాయతీ ఏకగ్రీవాల్లో రికార్డు

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మొదటి సారి జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఏకగ్రీవలకంటే ఈసారి మొదటి విడతలోనే ఆ సంఖ్యను దాటడం విశేషం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి గణాంకాల ప్రకారం 12,918 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. అప్పుడు తెలంగాణలో 8,685 గ్రామ పంచాయతీలు, 1,03,468 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి ఎపిలో 2,642 గ్రామపంచాయతీలు సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. ఇందులో తెలంగాణలో 662 పంచాయతీలు సర్పంచ్‌లను ఏకగ్రీవం చేశాయి. ఇప్పుడు మొదటి విడతలో 4468 పంచాయతీలకు గాను 769 సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంతో చూస్తే ఏకంగా 107 పంచాయతీలు అధికంగా ఉండటం గమనార్హం. అయితే ఈసారి పంచాయతీల సంఖ్య 8778 నుంచి 12,732కు చేరడం కూడా ఏకగ్రీవాల సంఖ్య పెరిగేందుకు దోహదం చేసింది. ఇదే ఒరవడి రెండు, మూడు విడతల్లోనూ కొనసాగితే ఏకగ్రీవాల సంఖ్య 2 వేలు దాటిన ఆశ్చర్యంపోవాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో టిఆర్‌ఎస్ నిర్దేశించుకున్న ప్రణాళికలు విజయవంతమైనట్లేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏకగ్రీవంగా ఎంపికయ్యే గ్రామాలకు ప్రభుత్వం నుంచి గ్రామాభివ ద్ధికి పది లక్షల రూపాయల నజరాన ఉంటుంది.

సంక్రాంతి సంబురాలు

తెలంగాణలో రూపుమారుతున్న పంటల పండుగ







మనతెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ గ్రామీణ స్వరూపం మారుతోంది. సమైక్యపాలనలో విచ్ఛిన్నమైన గ్రామీణ వ్యవస్థ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఊపిరి పీల్చుకుంటోంది. జల ప్రవాహ ప్రాంతాల్లో శతాబ్దాల క్రితమే నాగరికత విరాజిల్లిన తెలంగాణలో ఉమ్మడి పాలనలో సంక్రాంతిని రాష్ట్రంలో పెద్దగా జరిపేవారు కాదు. వ్యవసాయ ఆధారిత పండుగైన సంక్రాంతిని గతంలో మొక్కుబడిగా చేసుకున్నారు. నీరులేక పంటలు పండక తెలంగాణ రైతులు సంక్రాంతిని పీడ పండుగనే గుర్తించారు. సమైఖ్య పాలకులకులు నిర్లక్ష్యం చేసిన రాష్ట్ర గ్రామీణ వ్యవస్థను సిఎం కెసిఆర్ ఆర్థికంగా బలోపేతం చేస్తుండటంతో సంక్రాంతి పండుగ తెలంగాణలో జోరుగా జరుపుకుంటున్నారు. తగ్గిన వలసలు ఒకవైపు ఉంటే సంక్రాంతి పండుగ రోజుల్లో గ్రామ సీమలకు నగరవాసులు తరలివెళ్లడమే ఇందుకు ఉదాహరణ. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు తెలంగాణకు సంక్రాంతి సందర్భంగా ఆర్‌టిసి వందల సంఖ్యలో ప్రత్యేక బస్సులు వేసి ఆంధ్రకు వేల సంఖ్యల్లో బస్సులు నడిపారు. ఇప్పుడు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఆర్‌టిసి 3,673 బస్సులు వేయడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు ఇస్తున్న ప్రాధాన్యతతో కొత్తగా 25 లక్షల ఎకరాలకు ఆయకట్టు పెరిగింది. వలసలకు నిలయమైన మహబూబ్ నగర్ జిల్లాలో ప్రాజెక్టుల ద్వారా జల కళ సంతరించుకోంది. నగరాల్లో వలస కార్మికులుగా పనులు చేస్తున్న కార్మికులు తిరిగి తమగ్రామాల్లోకి వెళ్లి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అందుకే భవన నిర్మాణ కూలీల కొరత గత రెండేళ్లలో పెరిగింది.

అగ్రగామిగా అభివృద్ధి

సిఎం కెసిఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఫలితాలు ఇస్తున్నాయనడానికి రాష్ట్రంలో సంక్రాంతి సంబురాలే నిదర్శనమని మాజీ మంత్రి, టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ లక్ష్మారెడ్డి చెప్పారు. మన అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శమయ్యాయన్నారు. పాలమూరు జిల్లాలో వలసలు వాపస్ వచ్చాయని తెలిపారు. కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన ఆయన ప్రాజెక్టుల పనులన్నీ పూర్తి అయితే దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలుస్తుందన్నారు.

మాంసం మస్కా!

- వ్యాధులు సోకినవి.. మరణించినవీ అమ్మకం
- కబేళాల్లో పర్యవేక్షణ కరువు.. నాణ్యతలో డొల్లతనం



మన తెలంగాణ/హైదరాబాద్: కొరికిందంతా ముక్కా కాదు.. దక్కిందంతా రుచి కాదు.. రూపాయలు పోసి కొనుక్కుంటున్నా మనకు ఆరోగ్యకరమైన మాంసం లభిస్తుందన్న హామీ లేదు. దుకాణాల నిర్వహణలో లోపాలు... సవాలుగా మారుతున్న అపరిశుభ్రత.. తనిఖీల్లో డొల్లతనం.. వ్యాపారుల స్వార్థం.. వెరసి మాంస ప్రియులు కోరి అనారోగ్యాన్ని కొనితెచ్చుకోవాల్సి వస్తోంది. మాంసం అధికంగా తింటున్న రాష్ట్రంలో తెలంగాణ టాప్ ప్లేస్‌లో ఉంది. గత ఏడాది జయశంకర్ వ్యవసాయ వర్సిటీ చేసిన సర్వే ప్రకారం మన తెలంగాణలో నెలకు ఒక్కో వ్యక్తి సగటున 1.38 కిలోల మాంసం తింటున్నారు. మాంసహారంలో కోడి మాంసం వాటా 40 శాతం వరకు ఉంది. ఆ తరువాత స్థానాల్లో గొర్రె లేదా మేక మాంసం, చేపలు మన రాష్ట్రంలో అధికంగా తింటున్నారు. అయితే మార్కెట్‌లో దొరుకుతున్న మాంసం మొత్తం సురక్షితమైనదే ఖచ్చితంగా చెప్పడానికి వీలేకుండా పోతుంది. రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో మాంసాహార దుకాణాలు ఉన్నాయి. ఒక్కో జిల్లా కేంద్రంలో మూడు, నాలుగు కబేళాలు ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్లాటర్ హౌస్‌లలో రోజుకు 2వేల మేకలు , గొర్రెల్ని శాస్త్రీయ పద్ధతుల్లో వధించే సామర్థ్యం ఉన్నప్పటికీ కేవలం 50 నుంచి 150 మాత్రమే అక్కడకు వస్తున్నాయి. ఇటీవల అందులోనూ వ్యాధి భారీన పడిన వాటిని కొన్నింటిని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అంటే నాణ్యతా ప్రమాణాలకు పాతరేసి యథేచ్ఛగా బహిరంగ ప్రాంతాల్లో వాటిని వధించి హోటళ్లకు తరలిస్తున్నారు. జియాగూడలోని 11 ఎకరాల్లో ప్రైవేటుగా ప్రతిరోజూ దాదాపు ఆరువేల మేకలు, గొర్రెలు వధిస్తున్నారు. నగరంలో సరఫరా అవుతున్న మాంసంలో దాదాపు 70 శాతం మేకలు, గొర్రెల్ని ఇక్కడే వధిస్తుండటం గమనార్హం.

ధర ఎక్కువే.. మరి నాణ్యత ఏదీ

ప్రస్తుతం కిలో చికెన్ రూ.180 గా ఉంది. కిలో మటన్ రూ.560 నుంచి రూ.600 వరకు అమ్ముతున్నారు. ఇంత పెట్టి కొంటున్నప్పటికీ నాణ్యత ఉన్న మాంసమేనా అంటే ఏమి చెప్పలేని పరిస్థితి. ఇక చేపలను మూడు, నాలుగు రోజులు ఐస్‌లో నిల్వ ఉంచి అమ్ముతున్నారు. వాస్తవానికి కార్పొరేషన్, పురపాలక, నగరపాలక సంస్థల్లో కబేళాలు తప్పనిసరిగా ఉండాలి. ఆ కబేళాల్లో పశువైద్యులు అందుబాటులో ఉండి వధించడానికి 8 గంటలు ముందే జీవాలకు ఆరోగ్య పరీక్షలు చేయాలి. ఆరోగ్యవంతమైనవి అని తేలితే అనుమతితోపాటు జీవం శరీరంపై ఒక స్టాంప్ వేస్తారు. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. కారణం కబేళాల్లో పశువైద్యుల కొరత, పర్యవేక్షణ పూర్తిగా పడకేయడమే ఇందుకు కారణం. అయితే నిరంతరం తనిఖీలు చేస్తూ, నాణ్యత పరీక్షించాల్సిన బాధ్యతను అధికారులు పూర్తిగా మరిచారు. ఫలితంగా అపరిశుభ్ర వాతావరణంలో, నడిరోడ్లపైనే జంతువులను వధించి విక్రయిస్తున్నారు. వ్యాధులు సోకినవి, చనిపోయిన వాటిని సైతం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు.

ఎపిలో బిసి నాయకత్వం వహిస్తా

యాదవ ఆత్మీయ సదస్సులో పాల్గొన్న తలసాని

చంద్రబాబుకు తప్పనిసరిగా రిటర్న్ గిఫ్ట్



మనతెలంగాణ/హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో బిసిలందరికీ నాయకత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎంఎల్‌ఎ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. ఎపిలో బిసిలకు పప్పు బెల్లాలు పెట్టి అధికారం అనుభవిస్తున్నారని విమర్శించారు. విజయవాడలోని ఇబ్రహీంపట్నంలో సోమవారం జరిగిన యాదవుల ఆత్మీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు ఆయన భారీ ప్రదర్శనతో విజయవాడ కనకదుర్గ ఆలయం చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో యాదవులకు అత్యంత ప్రాధాన్యత లభిస్తుందన్నారు. చట్టసభల్లో తగినన్ని సీట్లు ఇచ్చి సిఎం కెసిఆర్ యాదవులతో పాటు బిసి వర్గాలను ప్రోత్సహించారన్నారు. అలాగే యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.5వేల కోట్ల మూల నిధితో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసున్నారన్నారు. అయితే ఎపిలో యాదవుల పట్ల చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఎపిలో యాదవులతోపాటు బిసిలకు నాయకత్వం వహించి సంక్షేమానికి పాడుపడే ఆలోచన ఉందని చెప్పారు. కాపులకు రిజర్వేషన్ల హామీ ఇచ్చి చంద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. అలాగే ఆంధ్రకు ప్రత్యేక హోదా అంశంలో చంద్రబాబు నాయుడుకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఎపి ప్రత్యేక హోదాకు టిఆర్‌ఎస్ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. చంద్రబాబుకు తప్పనిసరిగా రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని చెప్పారు. అయితే ఈ గిఫ్ట్‌ను తెలంగాణప్రజలు ఇస్తారో ఆంధ్రప్రజలే ఇస్తారో వేచి చూడాలన్నారు.

సోయా సాగుపై రైతుల వెనకడుగు

- మూడేళ్లుగా తగ్గుతున్న సాగు.. దిగుబడులు
- అనుకూలించని వాతావరణం.. అందుబాటులో లేని వెరైటీలు
- ప్రణాళికలే తప్ప.. ఆచరించని వ్యవసాయ శాఖ



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో సోయాబీన్ సాగు తగ్గుతోంది. తక్కువ ఖర్చుతో, ఎక్కువ పని లేకుండా వచ్చే పంటగా పేరొందిన సోయా సాగుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. ఒకవైపు సిఎం కెసిఆర్ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు, పంటల దిగుబడులు పెరగాలని అందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అదేశిస్తున్నారు. అయితే వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం సోయాబీన్‌పై ప్రణాళికలు రూపొందించుకున్నారే తప్ప వాటిని అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవడం లేదు. గత మూడేళ్లుగా మన రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులు రైతులకు ఏమాత్రం సహరించడం లేదు. సోయా వర్షధార పంట అయితే అవసరమైన సమయంలో వర్షాలు పడకపోగా, పంట చేతి కొచ్చే దశలో వానలు పడటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తెగుళ్లు రావడంతో పంట దిగుబడి కూడా చాలా వరకు తగ్గుతోంది. ఇటీవల గడిచిన ఖరీఫ్‌లో 2018తో చూస్తే కొంత మొత్తం ఎక్కువే సాగైనప్పటికీ వర్షాలు లేకపోవడంతో పూర్తిగా దిగుబడులు పడిపోయాయి. వాతావరణం అనుకూలించకపోవడం, కొత్త వెరైటీలు లేకపోవడం, దిగుబడులు తగ్గిపోవడంతో సోయా సాగు చేసేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ అధ్యయనంలో చేసిన తేలింది. మద్ధతు ధరను పెంచి, రైతులను ప్రోత్సాహిస్తే సాగు పెంచవచ్చునని, అందుకు తగిన ప్రణాళికలనూ వ్యవసాయ శాఖ సిద్ధం చేసుకుంది. అయితే వాటిని ఆచరణలో పెట్టడంతో మాత్రం విఫలమైంది. రాష్ట్రంలో నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, సంగారెడ్డి, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని రైతులు సోయా సాగు చేస్తున్నారు. జెఎస్–335 రకం రాష్ట్రంలో అత్యధికంగా సాగవుతోంది. నల్లమట్టి, తేమను గ్రహించే నేలలు సోయా సాగుకు అనుకూలంగా ఉన్నాయి. ఈ నేలల్లోనే పంట వేస్తే లాభాదాయమకని విస్తృతమైన ప్రచారం చేపట్టాలని వ్యవసాయ శాఖ భావించినప్పటికీ ఆ దిశగా కార్యాచరణ మొదలుపెట్టలేదు.

పండగ 'ప్రయాసం'

సంపాదకీయం

పండగలు ప్రజలకు కాదు జన రవాణా వాహనాలు నడిపే రంగాల యాజమాన్యాలకు, అవి ప్రభుత్వ రంగంలోనివైనా, ప్రైవేటువైనా సరే. దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోడం శృతిమించి అధిక లాభార్జనల దుర్వ్యాపార స్థాయికి చేరుకున్న తరువాత అది ఏ రంగమైనా ఒకటే. ప్రజల ధనంతో నడుపుతున్నామనే స్పృహ కోల్పోయి ప్రభుత్వ రంగ రవాణా సంస్థలు వారి మూలుగులనే పీల్చి పిప్పిచేస్తున్నాయి. జలగల్లా వ్యవహరించి జనహిత దృష్టి కంటె లాభార్జన చూపే తమకు ముఖ్యమని చాటుకుంటున్నాయి. సంక్రాంతి, దీపావళి, దసరా పండగల సందర్భంగా నగరాలు పల్లెబాట పట్టడం మామూలే. ఈ మూడు నాలుగు రోజులు హైదరాబాద్ రోడ్లు నిర్మానుష్యమై పట్టపగలే అర్ధరాత్రి దృశ్యాలు దర్శనమివ్వడం సంవత్సరాల తరబడిగా జరుగుతున్నదే. ఈ సంక్రాంతికి హైదరాబాద్ నగరం నుంచి 30 లక్షల మంది ఊళ్లకు తరలిపోయారని ఒక అంచనా. ఇంతమంది జనం ఒకటి రెండు రోజుల్లో స్వస్థలాలకు వెళ్లాలంటే భారీ సంఖ్యలో రవాణా వాహనాలుండాలి. కాని ఎప్పటి మాదిరిగా ఈసారి కూడా వాహనాల కొరత అసాధారణ స్థాయికి చేరుకొని ప్రయాణికులతో విషాద క్రీడ సాగించింది. బస్టాండ్లు, రైలు స్టేషన్లు విపరీతమైన రద్దీని చవిచూశాయి. ముందుగా రిజర్వు చేసుకున్న వారికి తప్ప అప్పటికప్పుడు ప్రయాణమైన లక్షలాది మంది ప్రజలు నరకమంటే నరకాన్నే చూశారు. జాతీయ రహదారుల మీద ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడ నేషనల్ హై వే మీద టోల్ గేట్ల వద్ద కార్లు కిలోమీటర్ల పొడవున బారులు దీరి ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంతగా జామ్‌లు ఏర్పడ్డాయి. విపరీతమైన పండగ రద్దీని తట్టుకోడానికి ఆర్‌టిసి, ప్రైవేటు, రైల్వేలు అదనపు వాహనాలు నడిపాయి. ఎన్ని చేసినా ప్రజలకు సుఖమైన ప్రయాణం లభించలేదు. కష్టాలు తప్పలేదు. 6044 ఆర్‌టిసి, 2800 ప్రైవేటు బస్సులు, అదనంగా పలు రైళ్లు నడిచాయి. కూర్చునేందుకు సీట్లు కాదు కదా నిలబడేందుకు సైతం చోటు కరవై దగ్గరి గమ్యాలకు బస్ టాప్‌లు ఎక్కి ప్రయాణం చేసిన దృశ్యాలు కనిపించాయి. వాహనాల కొరతను తీర్చలేకపోవడం నిస్సందేహంగా ప్రభుత్వ రంగంలోని జన రవాణా విభాగాల వైఫల్యమే. ఆర్‌టిసి, రైల్వేల నిర్వాకమే. ఇది ఎప్పుడు తొలగుతుంది, ఎందుకిలా నిరవధికంగా కొనసాగుతోంది అనేది కోటి డాలర్ల ప్రశ్న. ప్రజా రవాణా బాధ్యతను పూర్తిగా ప్రైవేటు రంగానికి అప్పగించడం కోసమే ఈ వైఫల్యాన్ని ప్రభుత్వాలు నిరవధికంగా పోషిస్తున్నాయేమో అనే అనుమానానికి ఆస్కారం కలగకమానదు. ఈ మహా జన రద్దీ అవసరాన్ని ప్రైవేటు రంగం విజయవంతంగా సంతృప్తి పరచగలదా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకడం కంటె మానుకోడమే మంచిది. ప్రైవేటు బస్సులు పోటీ కోసం అలవికానంత స్పీడుతో మృత్యు ఘోషతో ప్రజలను కాల్చుకు తిన్న సందర్భాలు గతంలో అనేకమున్నాయి. అంతేగాక వాటికి ప్రభుత్వ రంగం నుంచి పోటీ కరవైతే అవి ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని ఎంతగా దోచుకుంటాయో చెప్పనవసరం లేదు. ఇప్పటికే పండగ వేళ ఇటు ఆర్‌టిసి, అటు ప్రవేటు బస్సులు, ఇంకో వైపు రైల్వేలు మరో వైపు విమాన సర్వీసులు చార్జీలను విపరీతంగా పెంచేసి పండగ చేసుకోడానికి కూడా పైసా మిగలనీయకుండా ప్రజలను కాల్చుకుతిన్నాయి. ప్రైవేటు బస్సులతో పోటీపడి ఆర్‌టిసి, రైల్వేలు కూడా చార్జీలను రెట్టింపు చేశాయి. విమాన సేవలు విస్తరించి అత్యవసరాల్లో త్వరగా గమ్యాలు చేరుకోడానికి మెరుగైన సదుపాయం ఏర్పడిందనే ఆనందాన్ని అనుభవించే అవకాశం ప్రయాణికులకు ఇవ్వకుండా వాటి చార్జీలు నిజంగానే ఆకాశానికి అంటాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి రూ. 46500 విమాన చార్జీ వసూలు చేశారంటే దీనికి దోపిడీ అనే పదం చాలదు. ఇలా ప్రజల అవసరాన్ని ఉపయోగించుకొని వారి రక్త మాంసాలను ఆరగించే జలగ మనస్తత్వం ప్రైవేటుతోపాటు ప్రభుత్వ రంగ రవాణా సర్వీసుల్లో కూడా ప్రబలడం ఎంతమాత్రం మంచి సంకేతం కాదు. ప్రైవేటును కూడా అదుపు చేసి ప్రజల ప్రయోజనాలకనుగుణంగా నడుచుకొనేలా చూడవలసిన ప్రజా ప్రభుత్వాలు పండగ వేళ కంట తడిపెట్టిస్తున్న ఈ రవాణా దౌష్ట్యాన్ని అరికట్టడానికి తగిన వ్యూహాలను ఇకనైనా రచించి అమల్లోకి తేవాలి.

యుపిలో ఊహించిన మలుపు

చూపు

భారత రాజకీయాల్లో జనవరి 12వ తేదీ గొప్ప మలుపుగా చరిత్రలో నమోదవుతుంది. పాతికేళ్ళ తర్వాత, మొదటి సారిగా ఉత్తరప్రదేశ్‌లో రెండు పార్టీలు చేతులు కలిపాయి. సమాజ్‌వాది పార్టీ, బహుజనసమాజ్ పార్టీ రెండు కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి. ఈ రెండు పార్టీలు ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో నిన్నటి వరకు తలపడిన పార్టీలు. ఈ రెండు పార్టీలు గతంలో చేతులు కలిపిన ఉదాహరణ అస్సలు లేదని కాదు. 1993లో ఈ రెండు పార్టీలు కలిసి బిజెపికి పగ్గం వేశాయి. ఇప్పుడు మళ్ళీ అదే పునరావృతమవుతుందా? అప్పట్లో బహుజనసమాజ్ పార్టీ రాష్ట్రంలో బలమైన పార్టీగా ఉంది. సమాజ్‌వాది పార్టీ, బహుజనసమాజ్ పార్టీలతో అప్పుడు కూడా కాంగ్రెసు కలవలేదు. అప్పుడు ఎన్నికల్లో బిజెపి అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్, జనతాదళ్ పార్టీలు మద్దతివ్వడంతో యస్పీ, బియస్పీ సంకీర్ణం అధికారంలోకి వచ్చింది.

ఇంకా ఎన్నికలకు వందరోజులున్నాయి. సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, బహుజనసమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి చేతులు కలుపుతున్నారన్న వార్త వచ్చినప్పటి నుంచి బిజెపి శ్రేణుల్లో కలవరం ప్రారంభమైంది. కాని 2014 నుంచి విజయపథాన సాగుతున్న మోడీ రథాన్ని అడ్డుకునే బలం ఈ రెండు పార్టీల సమైక్య కూటమికి ఉందా అనేది అనుమానమే.

ఈ కూటమిలో కాంగ్రెసు కూడా ఉన్నట్లయితే బిజెపిని ఓడించడం తేలికయ్యేదని చాలా మంది విశ్లేషకుల అభిప్రాయం. కాని మాయావతి కాంగ్రెసు విషయంలో తీవ్రమైన వ్యతిరేకత చూపడం, పైగా లక్నోలో ఈ రెండు పార్టీల కూటమి గురించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్‌పై నిప్పులు చెరగడం చాలా మందిని ఆశ్చర్యానికి గురిచేసింది. మరోవైపు అఖిలేష్ యాదవ్ చాలా వ్యూహాత్మకంగా కాంగ్రెసు విషయంలో మౌనం వహించారు. ఇంకో వైపు కాంగ్రెస్ ఉత్తరప్రదేశ్‌లో 80 లోక్‌సభ స్థానాలకు, అంటే అన్ని స్థానాలకు పోటీ చేస్తామని ప్రకటించింది.

ఈ ప్రకటనలేవీ అప్పటికప్పుడు చెప్పిన మాటలు కాదు. అఖిలేష్ యాదవ్ తమ కూటమి గురించి రాసుకొచ్చిన ప్రసంగం చదివారు. అఖిలేష్ యాదవ్ ప్రసంగాన్ని రాసుకురావడం అనేది చాలా చాలా అరుదైన విషయం. మాయావతి కూడా రాసుకొచ్చిన ప్రసంగ పాఠమే చదివారు. ఆమె ఎల్లప్పుడు అలవాటుగా రాసుకొచ్చిన ప్రసంగమే చదువుతారు. అఖిలేష్ యాదవ్ ప్రసంగం రాసుకొచ్చి చదవడం, కాంగ్రెస్‌పై మౌనంగా ఉండడం, మాయావతి కాంగ్రెస్‌పై దాడులు చేయడం పథకం ప్రకారం చేశారని కొందరంటున్నారు. కాంగ్రెస్ ఈ కూటమిలో చేరకపోడానికి కూడా కారణం రాజకీయ ఎత్తుగడే అనే వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి.

ఈ కూటమిలో రెండు పార్టీల మధ్య సీట్ల పంపిణీ కూడా జరిగిపోయింది. రెండు పార్టీలు చెరి 38 స్థానాల్లో పోటీపడుతున్నాయి. నాలుగు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అందులో రెండు స్థానాలు చిన్న పార్టీలకు కేటాయిస్తున్నారు. రాహుల్ గాంధీ, సోనియాగాంధీలు పోటీ చేసే రాయ్ బరేలీ, అమేథీ నియోజక వర్గాలను కూడా ఈ పార్టీలు వదిలేశాయి. అంటే అర్థమేమిటి? కూటమిలో కాంగ్రెసును చేర్చుకోలేదు కాని తలుపులు తెరిచే ఉన్నాయి. ఎన్నికల తర్వాత సర్దుబాట్లకు, చర్చలకు అవసరమైన సుహృద్భావ వాతావరణం కొనసాగిస్తున్నారు. కీలకమైన మరి కొన్ని స్థానాల విషయంలో కూడా కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందం తప్పక ఉంటుందని చాలా మంది భావిస్తున్నారు.

అన్నింటికి మించి ఉత్తరప్రదేశ్ ముస్లిం ఓట్లు కీలకమైనవి. ముస్లిం ఓట్లు చీలిపోతే బిజెపికి ప్రయోజనం. ఈ ఓట్లలో చీలిక రాకుండా మూడు పార్టీలు ఖచ్చితమైన వ్యూహం పాటిస్తాయని చాలా మంది అభిప్రాయం. ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెసు బలం ఇప్పుడు కూడా కాదనలేనిది. చాలా కాలంగా ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధికారానికి దూరంగా ఉందన్నది నిజమే, కాని ఇప్పుడు 2014 నాటి పరిస్థితి లేదు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో గెలుపు దానికి కొత్త ధైర్యాన్నిచ్చింది. రాహుల్ గాంధీ నాయకుడుగా ఎదుగుతున్నాడు. విచిత్రమేమంటే గత నాలుగేళ్ళుగా బిజెపి రాహుల్ గాంధీని ''పప్పూ'' అంటూ ఎగతాళి చేయడమే ఆయనకు కలిసి వచ్చిందా అనే అనుమానాలు కూడా బలపడుతున్నాయి.

ఉత్తరప్రదేశ్ ముస్లిం ఓట్లు సమాజ్‌వాది పార్టీ వైపు ఎక్కువగా మొగ్గు చూపుతాయన్నది కాదనలేని యదార్థం. బహుజనసమాజ్ పార్టీ, కాంగ్రెసుల్లో పోటీ ఉంటే కాంగ్రెసు వైపు మొగ్గే అవకాశం ఉంది. ఎందుకంటే మూడు సార్లు మాయావతి బిజెపితో చేతులు కలిపిన చరిత్ర ముస్లిములకు తెలుసు. బియస్పీ పోటీ చేస్తున్న ముస్లిం జనాభా అధికంగా ఉన్న నియోజక వర్గాల్లో కాంగ్రెసుకు గెలుపు అవకాశాలున్నాయి. కాని కాంగ్రెస్ ఎలాంటి అభ్యర్థులను నిలబెడుతుందన్నది చాలా కీలకమైన ప్రశ్న. కాంగ్రెస్ అభ్యర్థులు బలమైన వారు కాకపోతే ఓట్లు చీలి బిజెపికి లాభించవచ్చు.

సమాజ్‌వాది పార్టీ, బహుజనసమాజ్ పార్టీల మధ్య పొత్తు బిజెపి ఊహించ లేదు. ఈ పొత్తు వార్త బయటకు రాగానే జనవరి 11వ తేదీన న్యూఢిల్లీ రాం లీలా మైదానంలో జరిగిన పార్టీ జాతీయ కార్యనిర్వాహకవర్గం సమావేశాల్లో పార్టీ అధ్యక్షుడు దాదాపు 15 నిమిషాలు ఈ పొత్తు గురించే మాట్లాడడం బిజెపిలో కలవరానికి నిదర్శనం. ఈ పొత్తు ఒక ప్రహసనంగా అమిత్ షా కొట్టి పారేశారు. కాని అలాంటి విలువలేని ప్రహసనం గురించి 15 నిముషాల పాటు మాట్లాడవలసిన అవసరమే మొచ్చిందన్న ప్రశ్న వింటున్నవారిలో పుట్టకుండా ఉంటుందా?

ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఈ పొత్తుపై విమర్శలు సంధించారు. ఈ పొత్తు వల్ల బలహీనమైన, నిస్సహాయ ప్రభుత్వం ఏర్పాటు చేస్తారా అని ప్రశ్నించారు. ఒక్కడిని ఎదుర్కోడానికి అందరూ ఒక్కటవుతున్నారన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ తదితర నాయకులు ఈ పొత్తు కులతత్వ పొత్తని, మోడీ భయంతో అందరూ ఒక్కటవుతున్నారని విమర్శించారు. మరోవైపు సిబిఐలో ఒక్కసారి కదలిక వచ్చింది. యస్.పి., బియస్పీ నేతలపై సిబిఐ దాడులు మొదలయ్యాయి. చట్టం తన పని చేసుకుపోతోందని బిజెపి నేతలన్నారు, కాని చట్టం అకస్మాత్తుగా ఇప్పుడు ఈ పొత్తు తర్వాతే ఎందుకు పని ప్రారంభించిందన్న ప్రశ్న చాలా మంది అడుగుతున్నారు.

సమాజవాది పార్టీ, బహుజనసమాజ్ పార్టీల మధ్య పొత్తు బిజెపి ఊహించ లేదు. ఈ పొత్తు వార్త బయటకు రాగానే జనవరి 11వ తేదీన న్యూఢిల్లీ రాంలీలా మైదానంలో జరిగిన పార్టీ జాతీయ కార్యనిర్వాహక వర్గం సమావేశాల్లో పార్టీ అధ్యక్షుడు దాదాపు 15 నిమిషాలు ఈ పొత్తు గురించే మాట్లాడడం బిజెపిలో కలవరానికి నిదర్శనం. ఈ పొత్తు ఒక ప్రహసనంగా అమిత్ షా కొట్టిపారేశారు. కాని అలాంటి విలువలేని ప్రహసనం గురించి 15 నిముషాల పాటు మాట్లాడవలసిన అవసరమేమొచ్చిందన్న ప్రశ్న వింటున్నవారిలో పుట్టకుండా ఉంటుందా? ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఈ పొత్తుపై విమర్శలు సంధించారు. ఈ పొత్తు వల్ల బలహీనమైన, నిస్సహాయ ప్రభుత్వం ఏర్పాటు చేస్తారా అని ప్రశ్నించారు. ఒక్కడిని ఎదుర్కోడానికి అందరూ ఒక్కటవుతున్నారన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ తదితర నాయకులు ఈ పొత్తు కులతత్వ పొత్తని, మోడీ భయంతో అందరూ ఒక్కటవుతున్నారని విమర్శించారు. మరోవైపు సిబిఐలో ఒక్కసారి కదలిక వచ్చింది.

రెండేళ్ళ క్రితం అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ఇప్పుడు చర్యలు తీసుకుంటున్నారన్నది ప్రజల నుంచి దాచిపెట్టడం కూడా కష్టమే. మొత్తం 35 పార్టీలు ఎన్డీయేలో ఉండేవి. గత నాలుగున్నరేళ్ళ కాలంలో దాదాపు 16 పార్టీలు ఎన్డీయే నుంచి తప్పుకున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేనట్లు తెలుగుదేశం కూడా కాంగ్రెసుతో చేతులు కలిపింది. ఈ పరిణామాలు బిజెపిని కలవరపెట్టే పరిణామాలే. 1990 దశకంలో ఉత్తరప్రదేశ్ రాజకీయాలు కమండల్ – మండల్ రాజకీయాలుగా నడిచాయి.

బాబరీ మసీదు కూల్చివేత జరిగి, అయోధ్య ఉద్యమం ఉధృతంగా ఉన్న కాలంలో కూడా కమండల్ పై మండల్ విజయం సాధించింది. పాతికేళ్ళు గడిచిపోయాయి. ఇప్పుడు మళ్ళీ అవే సమస్యలు యథాతథంగా కొనసాగుతున్నాయి. అయోధ్య వివాదాన్ని ఒకవైపు రాజేస్తుంటే, మరోవైపు రిజర్వేషన్ల సమస్య కూడా ముందుకు వస్తోంది. మండల్ రాజకీయాల్లో చాలా మార్పులు వచ్చాయి. ఇప్పుడు అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు, విభిన్న సముదాయాలు రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేయడం వంటి కొత్త సమస్యలతో మండల్ రాజకీయాలు చాలా మారిపోయాయి. ఈ పరిస్థితుల్లో ఉత్తరప్రదేశ్ రాజకీయాలు ఏ మలుపు తిరుగుతాయో వేచి చూడాలి.

✻ శరత్ ప్రధాన్ (ది వైర్)

కెసిఆర్ మార్క్ పునరేకీకరణ

దేశంలో వచ్చే సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా రాజకీయ శక్తుల పునరేకీకరణ వేగంగా సాగుతున్నది. ప్రత్యేకించి తెలంగాణ ముఖ్యమంత్రి, పీపుల్స్ ఫ్రంట్ వ్యూహకర్త కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రతిపాదించిన బిజెపి, కాంగ్రెసేతర మూడో ప్రత్యామ్నాయ ప్రాంతీయ పార్టీల ఐక్యత రోజురోజుకు పెరుగుతున్నది. ఇది పీపుల్స్ ఫ్రంట్ దిశగా రాజకీయ శక్తుల పునరేకీకరణను సూచిస్తున్నది. దేశ రాజకీయాలను శాసించే ప్రబల శక్తిగా నిలిచిన ఉత్తరప్రదేశ్‌లో నిన్నటి దాకా బద్ధ శత్రువులుగా ఉన్న బహుజన్ సమాజ్ పార్టీ, సమాజ్ వాది పార్టీలు ఐక్యం కావడం దేశ రాజకీయాల్లో పెను సంచలనానికి కారణమైంది.

దేశంలో అత్యధిక కాలం పాలన సాగించిన కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలే దేశ రాజకీయాలను శాసించే అనుకూల పరిస్థితులు క్రమంగా పెరుగుతున్నాయి. జాతీయ రాజకీయ పార్టీల ప్రాబల్యాన్ని దెబ్బ తీసే విధంగా మెజారిటీ లోక్‌సభ సీట్లున్న రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలం పుంజుకుంటున్నాయి. ఇందుకు తాజా ఉదాహరణగా ఉత్తరప్రదేశ్ ములాయం సింగ్, మాయావతిల ఐక్యతనే ప్రధానంగా చెప్పవచ్చు. దేశంలో 545 లోక్‌సభ సీట్లు ఉంటే ఇందులో అత్యధికం ఉత్తర ప్రదేశ్‌లోనే 80 సీట్లు ఉన్నాయి. ఇక్కడ ఏ పార్టీకి మెజారిటీ వస్తే ఆ పార్టీనే కేంద్రంలో పాలక పార్టీగా అవిర్భవించే అవకాశాలున్నాయి. ఇప్పటి దాకా బిజెపియేతర మహాఘట్బంధన్‌గా ఎస్‌పి, బిఎస్‌పిలు కాంగ్రెస్‌తో కలిసి వచ్చే లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేస్తాయని అంతా భావించారు. కానీ దీనికి భిన్నంగా కాంగ్రెస్‌ను పక్కకు పెట్టి ములాయం సింగ్, మాయావతిలు కలిసి చెరి సగం సీట్లు పోటీ చేస్తామని ప్రకటించడంతో కాంగ్రెస్ మహాకూటమి ఆశలపై నీళ్లు చల్లినట్లుగా పరిశీలకులు భావిస్తున్నారు. మొత్తంగా ఇది దేశంలో కాంగ్రెస్, బిజెపిలకు ప్రత్యామ్నాయంగా మూడో ఫ్రంట్ అదీ ప్రాంతీయ పార్టీల ఐక్యతతోనే ఏర్పడుతుందని ఈ ఫ్రంట్ దేశ భవిష్యత్ రాజకీయాలను శాసిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు గడిచిన ఏడాదిగా చెబుతున్నది కార్యాచరణలోకి వస్తున్నట్లుగా ఉత్తర ప్రదేశ్ రాజకీయాలు సూచిస్తున్నాయి.

ఇప్పటికే ఒడిశాలో జెడిఎస్ అధినేత, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రత్యామ్నాయ ఫ్రంట్‌కు అనుకూలంగా రాజకీయ సంకేతాలు ఇచ్చారు. ఆయన ఆ రెండు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలకు సమాన దూరంగా ఉంటానని ప్రకటించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా మూడో ఫ్రంట్‌కు అనుకూలంగా సంకేతాలు ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన విపక్షంగా ఉన్న వైసిపి పార్టీ కూడా కాంగ్రెస్, బిజెపిలను వ్యతిరేకిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రతిపాదించిన పీపుల్స్ ఫ్రంట్‌కు అనుకూలంగా ఉన్నట్లుగా ఆ పార్టీ నేతల ప్రకటనలు సూచిస్తున్నాయి. ఇక వామపక్ష పార్టీలైన సిపిఐ, సిపిఎంలు మూడో ప్రత్యామ్నాయ శక్తి కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ ఎన్‌డిఎలో కీలక పాత్ర వహించిన తెలుగు దేశం, శివసేనలు కూడా ఆ కూటమికి ప్రస్తుతం దూరంగా ఉన్నాయి. పెద్ద రాష్ట్రాలలో ఒకటైన తమిళనాడులో అన్నాడిఎంకె ఎటూ మొగ్గు చూపకుండా 2019 ఎన్నికల ఫలితాల కోసం ఎదురు చూస్తోంది.

తమిళనాడులో విపక్షంగా ఉన్న డిఎంకె కూడా భవిష్యత్ రాజకీయ శక్తి కోసం ఎదురు చూస్తున్నది. పశ్చిమ బెంగాల్లో ఎదురేలేని నేతగా పాపులర్ ముఖ్యమంత్రిగా ఉన్న మమతా బెనర్జీ కూడా దేశంలో రాజకీయ పరిణామాలను నిశితంగా విశ్లేషిస్తూ కేంద్రంలో కూడా రాజకీయ చక్రం తిప్పాలని, కాంగ్రెస్, బిజెపి పాలనకు చరమ గీతం పాడాలని అనుకూల వాతావరణం కోసం ఎదురు చూస్తున్నారు. 2014 లోక్‌సభ ఎన్నికలలో 545 సీట్లలో 282 సీట్లను గెలిచిన ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల జరిగిన పలు లోక్‌సభ ఉప ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి చవిచూశారు. ఆయన పాపులారిటీ క్రమంగా తగ్గుతున్నట్లుగా పలు సర్వేలు సూచిస్తుండడంతో ఆయన గెలిచే మార్గాలను అన్వేషిస్తూ అగ్రకులాలకు పది శాతం రిజర్వేషన్లను హడావుడిగా ఆమోదింప చేసుకున్నారు. 2014 ఎన్నికలలో పలు రాష్ట్రాలలో ప్రధాన శక్తులుగా ఉన్న 14 ప్రాంతీయ పార్టీలు 172 సీట్లను గెలుచుకున్నాయి. ఇందులో ఆప్, అన్నాడిఎంకె, టిఎంసి, బిఎస్‌పి, ఎస్‌పి, కశ్మీర్ ఎన్‌సి, టిఆర్‌ఎస్, వైసిపి, జెఎంఎంఎ, ఆర్‌జెడి, ఎన్‌సిపి, శివసేన, జెడిఎస్, డిఎంకె, శిరోమణి అకాలీదళ్ పార్టీలున్నాయి. ఇందులో కొన్ని ప్రాంతీయ పార్టీలు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలో ఉన్నా ఇప్పటికే కొన్ని పార్టీలు ఆ కూటమికి గుడ్‌బై చెప్పాయి. మరికొన్ని బిజెపికి దూరంగా ఉండే ఆలోచనలో ఉన్నాయి.

ఈ పార్టీల్లో 2014 ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ కేవలం ఐదు సీట్లను సాధించగా బహుజన్ సమాజ్ పార్టీ అసలు సీట్లే గెలవలేదు. అయినా ప్రాంతీయ పార్టీల స్కోర్ 172గా ఉంది. 2019లో బిజెపి వ్యతిరేకతలో ఈ రెండు పార్టీలు 70కి పైగా సీట్లను సాధిస్తే ప్రాంతీయ పార్టీ సంఖ్యా బలం 240కి పైకి పెరుగుతుంది. ఇతర రాష్ట్రాల లోని వైసిపి, ఆర్‌జెడి, డిఎంకె, టిఆర్‌ఎస్ పార్టీల బలం పెరిగితే ప్రాంతీయ పార్టీలు లోక్‌సభలో మ్యాజిక్ మార్క్‌గా ఉన్న 272ను అధిగమించడం అసాధ్యమేమీకాదని దేశ రాజకీయ పరిస్థితులను విశ్లేషిస్తున్న రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అయితే ఈ దిశగా ప్రాంతీయ పార్టీలను ఐక్యం చేసే కీలక శక్తిగా తెలంగాణలో రెండోసారి ఘన విజయం సాధించిన కెసిఆర్ వేగంగా ముందుకు కదులుతున్నారు.

ఆయన 2019ని ఫోకస్ చేస్తూ దేశంలోని అన్ని సెక్యులర్, ప్రజాస్వామిక పార్టీలను ఐక్యం చేయడానికి ఇప్పటికే ఎన్నో రాష్ట్రాల పర్యటనలు చేశారు. అధినేతలను ఐక్యత దిశగా వారి ఆలోచనలను మారుస్తున్నారు. ఇందు కోసం ఆయన దేశ రాజధాని ఢిల్లీలో కూడా టిఆర్‌ఎస్ కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతుండడం గమనించదగిన అంశంగా చెప్పవచ్చు.

ప్రాంతీయ శక్తులకు వామపక్షాలు కూడా జత కలిస్తే 2019 ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెసేతర ప్రాంతీయ పార్టీల నాయకత్వంలోని ఫ్రంట్‌కు అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఎన్నికల ముందు కాకుండా ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బిజెపేతర ప్రాంతీయ పార్టీల కూటమి గురించి ఆలోచిస్తామని మహారాష్ట్ర ఎన్‌సిపి అధినేత శరద్‌పవార్ అంటున్నారు. ప్రాంతీయ పార్టీల అధినేతల అంతరంగాలు ఎలా ఉన్నా వారిని పీపుల్స్ ఫ్రంట్ దిశగా ఐక్యం చేయడానికి టిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ అహరహం శ్రమిస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం చావునోట్లో తలపెట్టి దేశంలో అనేక పార్టీల అధినేతల మనసు మారేలా చేసి తెలంగాణను సాధించిన కెసిఆర్‌కు ప్రాంతీయ పార్టీల ఐక్యతను సాధించడం అసంభవమేమీ కాదని ఆయన రాజకీయ ఎత్తుగడలను విశ్లేషిస్తున్న రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

✻ మిట్టపల్లి శ్రీనివాస్



దేశంలో జాతీయ పార్టీల ప్రాబల్యానికి క్రమంగా గండి పెరుగుతున్నది. ఈ మేరకు ప్రాంతీయ పార్టీల శక్తి పుంజుకుంటున్నది. బిజెపి, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయ శక్తిగా పీపుల్స్ ఫ్రంట్ ప్రాంతీయ పార్టీల నాయకత్వంలో ఏర్పడబోతున్నదని, ఇదే దేశ భవిష్యత్‌కు ఆశాకిరణమని చెప్పిన తెలంగాణ ముఖ్యమంత్రి, టిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ మాటలు యుపిలో నిప్పు – ఉప్పులా ఉన్న సమాజ్‌వాది పార్టీ, బహుజన సమాజ్ పార్టీల కలయిక వాస్తవమని నిరూపిస్తున్నాయి. ఇదే దిశలో అనేక ప్రాంతీయ పార్టీల అధినేతల ఆలోచనలు మారుతున్నాయి.

లోక్‌సభలో పెద్ద రాష్ట్రాల సీట్లు

ఉత్తరప్రదేశ్	80
మహారాష్ట్ర	48
పశ్చిమ బెంగాల్	42
బీహార్	40
తమిళనాడు	39
మధ్యప్రదేశ్	29
కర్ణాటక	28
గుజరాత్	26
రాజస్థాన్	25
ఆంధ్రప్రదేశ్	25
తెలంగాణ	17
ఒడిశా	21
కేరళ	20

2014లో ప్రాంతీయ పార్టీల సీట్లు

టిఎంసి	34
ఎఐఎడిఎంకె	37
బిజెడి	20
డిఎంకె	0
టిడిపి	16
టిఆర్ఎస్	11
వైఎస్ఆర్ కాంగ్రెస్	9
ఎస్‌పి	5
బిఎస్‌పి	0
శివసేన	18
ఎన్‌సిపి	4
జెడియు	2
ఆర్‌జెడి	4
ఎల్‌జెపి	6
శిరోమణి అకాలీదళ్	4

సకుటుంబం

రైతన్న కష్టం తీరా...
పంటలు ఇంటికి రాగా
గాదెలు నిండగా...లోగిళ్లలో రంగవల్లులు విరబూయగా
గుండెలు చల్లగా..భోగిమంటలు వెచ్చగా
పిండివంటలు తీయగా...హోయి హోయి
రాగాలు తీయగా
తెలుగు వారి అపురూప పండుగ 'సంక్రాంతి'

సిరుల పండుగ సంక్రాంతి



తెలుగువారి పండుగలలో ముఖ్యమైనది 'సంక్రాంతి' ఇది కొందరు మూడు రోజులు, మరి కొందరు నాలుగు రోజులు జరుపుకుంటారు. భోగితో మొదలయ్యి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమతో ముగిసే పండుగ సంక్రాంతి.

సంక్రాంతి లేదా సంక్రమణం అంటే మారడం అని అర్థం. సూర్యుడు మేషాది ద్వాదశ రాశులందు క్రమంగా పూర్వరాశి నుంచి ఉత్తరరాశిలోకి ప్రవేశించడం సంక్రాంతి. అందుచేత సంవత్సరానికి పన్నెండు సంక్రాంతులు ఉంటాయి. అయినా పుష్యమాసంలో హేమంత రుతువులో, శీతగాలులు వీస్తూ మంచు కురిసే కాలంలో సూర్యుడు మకరరాశిలో మారగానే వచ్చే మకర సంక్రాంతికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఇది జనవరి మాసంలో వస్తుంది. మకర సంక్రాంతి రోజున, అంటే జనవరి 15 తేదీన సూర్యుడు ఉత్తరాయణ పథంలో అడుగుపెడతాడు. ఈరోజు నుంచి స్వర్గద్వారాలు తెరచి ఉంటాయని పురాణాలు పేర్కొన్నాయి.

ధనుస్సురాశిలో ప్రవేశించిన సమయం ధనుస్సంక్రమణం. కాగా ధనుస్సులో సూర్యుడుండే కాలము ధనుర్మాసం అంటారు. మానవులకు ఒక సంవత్సరం దేవతలకు ఒకరోజు అంటారు. ఈ లెక్కన ఉత్తరాయణం రాత్రి, దక్షిణాయనం పగలుగా భావించబడుతోంది. సూర్యుడు కర్కటకరాశిలో ప్రవేశించుట కర్కాటక సంక్రమణం అంటారు. అక్కడ నుండి దక్షిణాయనం ప్రారంభం. అనగా ఇది రాత్రి కాలం. మకరరాశిలో ప్రవేశించు సమయం మకరసంక్రమణం ఇక్కడి నుండి ఉత్తరాయణం. అనగా పగలుగా భావన, ఇలా భావించినప్పుడు దక్షిణాయనమునకు చివరిది ఉత్తరాయణమునకు ముందుది ఐన ధనుర్మాసం ప్రాతఃకాలం వలె పవిత్రమైనది...సాత్వికమైన ఆరాధనలకు ప్రధానమైంది. కనుక సత్వగుణ ప్రధానమైన విష్ణువును ఈనెలలో ఆరాధిస్తారు. ఈ నెల విష్ణుమూర్తికి ప్రీతికరమైనది. గోదాదేవి కథ ఈ మాసమునకు సంబంధించినదే. సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించడాన్ని 'పండుగ నెలపట్టడం' అని కూడా అంటారు. ఈ నెల రోజులూ ఇంటి ముందు పండుగ హడావుడినీ గుర్తు చేస్తూ నాలుగు వీధుల చిహ్నంగా ముగ్గును తీర్చిదిద్దుతారు. అయితే ఈ ధనుర్మాసం సౌరమానానికి సంబంధించింది. కానీ మనం (తెలుగు వారం) చాంద్రమాన అనుయాయులం. దీనికి గుర్తుగా ఈ ముగ్గు మధ్యలో చంద్రుని తీర్చిదిద్దుతారు.

సరిగ్గా ఈ రోజుతో ధనుర్మాసం పూర్తి అవుతోంది. పుష్యమాసాల చలి అధికంగా ఉండటం వల్ల భోగి రోజు భోగిమంటలు వేస్తారు. మొదట ఆవు పిడకతో అగ్నిహోత్రుడికి నమస్కరించి భోగిమంట వెలిగిస్తారు. ఆ తర్వాత దుంగలు, పొలాలలో ఉన్న తాటాకులు, డొక్కలు, కమ్మలు కూడా వేస్తారు. చిన్న పిల్లల చేతి భోగి దండలు అంటే ఆవు పేడతో గుచ్చిన పిడకల దండ వారికే దిష్టి తీసి భోగిమంటలలో వేస్తారు.

ధనుర్మాసంలో గొబ్బెమ్మలు పెట్టుకుంటారు

ముందుగా చెప్పుకున్నట్టు ఇది రైతులకు పంట ఇంటికి వచ్చినప్పుడు చేసుకొనే పండుగ. కాబట్టి పేడకి కూడా సత్స మానమైన పూజ చేస్తారు. గొబ్బెమ్మల చుట్టూ అమ్మాయిలు తిరుగుతూ 'సుబ్బి గొబ్బెమ్మ సుబ్బడిస్తావా'' అంటూ పాటలు పాడి, నైవేద్యాలు పెట్టి అందరితో బాటు తింటారు. ఇంక భోగి రోజు ఇంకో ముచ్చట ఉంటుంది. అదే భోగి పళ్లు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు కను దిష్టి తగలకుండా ఈ భోగి పళ్లు పోస్తారు. ఈ బాలభోగాన్ని శ్రీమన్నారాయణుడి ఆశీస్సుగా భావిస్తారు. రైతుల ఇళ్లల్లో ఇంట్లో పని చేసే వారికి పిండివంటలతో కడుపు నిండా భోజనం పెట్టి, బట్టలు ఇస్తారు.



సాయంత్రం పూట చాలా ఇళ్లలో స్త్రీలు, చిన్న పిల్లలు బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తారు. దీనిలో పిల్లలు తమ దగ్గర ఉన్న వివిధ రకాల ఆటవస్తువులను ప్రదర్శనగా ఉంచి ఆనందిస్తారు. ఇది భోగి రోజు మొదలెట్టి మూడు రోజులనగా భోగి, సంక్రాంతి, కనుమ రోజు ఉంచుతారు. రోజూ ఆ బొమ్మలకు వివిధ ప్రసాదాలు నివేదించి, చూడటానికి వచ్చిన వారికి పెడతారు. కొన్ని ప్రాంతాల వారు గాలి పటాలు ఎగురవేస్తారు, సంక్రాంతి అంటే కొన్ని ఊళ్లలో ఈ గాలిపటాల పోటీలే ఉంటాయి. ఇది చిన్న పిల్లలే కాదు, పెద్దవాళ్లు కూడా తమని తాము మరచిపోయి ఆడే ఆట. కొన్ని చోట్ల కోళ్ల పందాలు, కొన్ని చోట్ల ఎద్దుబళ్ల పందాలు, మరి కొన్ని చోట్ల ఈ గాలిపటాల పందాలు ఉంటాయి. ఎవరికీ హాని చేయనం వరకు ఈ ముచ్చట్లు ఆనందాన్ని ఇస్తాయి. భోగి పండుగ నాడు అరిసెలు, బెల్లం మిఠాయిలు, జంతికలు, చక్కిలాలు(సకినాలు) చేసుకుంటారు. ప్రసాదానికి పులిహోర, పరమాన్నం చేసుకుంటారు.

సంక్రాంతి: సంక్రాంతి అంటే మారడం, చేరడం అనే అర్థాలు ఉన్నాయి. రవి సంక్రమణం రోజున స్నానం చెయ్యని నరుడు ఏడు జన్మలదాకా రోగి, నిర్ధనుడు అవుతాడు. కనుక సంక్రాంతి రోజున పవిత్ర నదుల్లో పుణ్యస్నానం చేయాలి. కొందరు నల్లనువ్వుల నూనెతో శరీరానికి నలుగు పెట్టి తలస్నానం చేస్తారు. శివాలయానికి వెళ్లి శివాభిషేకం చేయడం మంచిది. ఈ సంక్రమణ కాలంలో ధాన్యం, ఫలాలు, విసనకర్ర, వస్త్రం, గుమ్మడి, సువర్ణం, కాయగూరలు, దుంపలు, తిలలు, చెఱకు, గోవు మొదలైనవి దానం చేయాలి. ఈ రోజున వస్త్రదానం చేయడం ఉత్తమ ఫలితాలను ఇస్తుంది.

రెండవ రోజైన సంక్రాంతి రోజున పాలు పొంగించి, అందులో కొత్త బియ్యం వేసి పొంగలి చేస్తారు. 'హరిలో రంగ హరీ' అంటూ నడినెత్తిపై నుంచి నాసిక దాకా తిరుమణి పట్టెలతో, కంచు గజ్జెలు ఘల్లుఘల్లుమనగా చిందులు తొక్కుతూ, చేతుల్లో చిరుతలు కొడుతూ తలపై రాగి అక్షయ పాత్ర కదలకుండా హరిదాసు ప్రత్యక్షమవుతాడు. కొత్తబియ్యం వచ్చిన శుభానందంలో ఈ హరిదాసులకు బియ్యం, డబ్బులు వేస్తారు. ఈ రోజున పితృదేవతలకు తర్పణాలు వదులుతారు. ప్రతీ సంక్రమణానికీ పితృతర్పణాలు ఇవ్వాలి. కాని మిగిలిన పదకొండు సంక్రమణాలకు ఇవ్వకపోయినా, ఈ మకర సంక్రమణానికి మాత్రం తప్పకుండా పితృతర్పణాలు ఇస్తారు. సంక్రాంతి రోజులలో మనం చూసే ఇంకో సుందర దృశ్యం. గంగిరెద్దులను ఆడించే గంగిరెద్దుల వారు. చక్కగా అలంకరించిన గంగిరెద్దులను ఇంటింటికీ తిప్పుతూ, డోలు, సన్నాయి రాగాలకు అనుగుణంగా వాటిచేత చేయించే నృత్యాలు చూడటానికి చాలా రమణీయంగా ఉంటాయి. ఆ గంగిరెద్దులు మనం ఇచ్చే కానుకలను స్వీకరిస్తున్నట్లుగా తలలు ఊపుతూ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మోకాళ్ల మీద వంగటం వంటి విద్యలు వాటికి నేర్పిస్తారు. అయ్యగారికి దండం పెట్టు, అమ్మగారికి దండం పెట్టు అంటూ గంగిరెద్దుల వాళ్లు సందడి చేస్తారు.





దేవరుణం, పితృరుణం, మనుష్య రుణం, రుషిరుణం, భూత రుణం అనే పంచ రుణాల నుంచి విముక్తిని పొందే మార్గాలను ప్రతి గృహస్థుడు ఏవిధంగా ఆచరించాలో ఒక ఆచారాన్ని నిర్దేశించింది ఈ మకర సంక్రాంతి. పొంగలి, పిండివంటలు నైవేద్యం పెట్టి దేవరుణాన్ని, తర్పణాలు ఇచ్చి పితృరుణాన్ని, వండిన పదార్థాలను, దేవతలకు నివేదించాక పశువులకు పెట్టి భూతరుణాన్ని, పనిచేసేవారికి ఇంటికి వచ్చిన అతిథులకి కడుపునిండా భోజనం పెట్టి, తగు రీతిలో సత్కరించి తద్వారా మనుష్యరుణాన్ని, సంక్రాంతి సాధనలు, గ్రంథాలను చదవటం వల్ల శీఘ్రఫలాలనిస్తాయని విశ్వసిస్తారు. వీటిని ఆచరించడం ద్వారా రుషిరుణాన్ని తీర్చే గొప్ప పండుగ ఈ సంక్రాంతి.


కనుమ:మూడవ రోజైన కనుమ వ్యవసాయంలో తమకు ఎంతో చేదోడువాదోడు ఉన్నందుకు పశువులకు శుభాకాంక్షలు తెలుపటానికి జరుపుతారు. వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లకు ఈ రోజు పూజ ఉంటుంది. నాగలి పూజా అని అంటారు. నాగలికి, ముద్రబల్లకి, పరుగు పారకి పూజ చేస్తారు. మధ్యలో పేడ పెద్ద గొబ్బెమ్మగా పెట్టి ఇంటి ఆడపిల్ల చేత దానికి పసుపుకుంకుమా రాయించి, పైన పూలు వేసి పూజ చేస్తారు.

రైతులకు ఈ గోపేడ భూమికి ఔషధం...అదే వారి గొబ్బిమాలక్ష్మి. కొన్ని ప్రాంతాలలో కోడి పందాలు కూడా నిర్వహిస్తారు. కనుమనాడు మినుము తినాలని అంటారు. అందుకు ఎక్కువగా ఆ రోజు గారెలు, ఆవడలు చేసుకుంటారు.



ముక్కనుమ: ఈ రోజు కొందరు బొమ్మల నోము పెడతారు. ఈ నోము తొమ్మిది సంవత్సరాలు నోచే నోము. మూడుల రోజులతో పూర్తవుతూ అందరికీ ఆనందాన్ని పంచే పండుగను ఘనంగా సాగనంపేందుకు పుట్టినదే రథం ముగ్గు. అందరూ ఒకరికి ఒకరు తోడుంటూ కలసి సహజీవనం సాగించాలి అనే సంకేతాలతో ఒక రథం ముగ్గు తాడును మరొక ఇంటి వారి ముగ్గుతో కలుపుతూ పోతుంటారు. ఈ రోజు నెత్తి మీద నుండి స్నానం చేస్తూ 'కాకీ...నీ రూపు నువ్వు తీసుకొని నా రూపు నాకు ఇవ్వు' అని అంటారు. చలికాలంలో చలికి మనుషుల రంగు నలుపెక్కుతుంది. ఇక కనుమ తర్వాత వచ్చే ఎండలకి ఆ నలుపు విరుగుతుంది. అందుకు కాకి రూపు పోతుందని ఇలా అంటారు. ఈరోజు బొబ్బట్లు, బూరెలు చేసి నైవేద్యం ఇస్తారు.

గాదెలు ధాన్యాలతో నిండగా, అరుగులు కొబ్బరి రాసులతో కిక్కిరిసి పోగా, ఇంట్లో ధాన్యలక్ష్మి సిరులివ్వగా...రైతుల మోములో నవ్వులు, వాకిట్లో రంగవల్లులతో పోటీపడగా...ఆనందాల హేలతో జరుపుకునే తెలుగింటి పండగ..ఈ సంక్రాంతి.





వైశాలి. పేరి
vshaliperi@gmail.com

మన రంగవల్లులు



21చుక్కలు సరిచుక్క 1వచ్చే వరకు

మాధవి, ఒరిస్సా.



ధరణి ఉప్పల్.



మూర్తిగారి తులసి జైస్వాల్‌గార్డెన్ హైదరాబాద్.



ఉష భువనగిరి,

ఖాళీ స్థలాలకు జియో ట్యాగింగ్!

ఆదాయం పెంచుకోవడంపై మున్సిపల్ శాఖ కసరత్తు

మన తెలంగాణ/హైదరాబాద్ : పట్టణ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలకు ఆశించిన స్థాయిలో పన్నులు వసూలు కావడం లేదు. దీంతో ఖాళీ స్థలాలకు కూడా జియో ట్యాగింగ్ వ్యవస్థను తీసుకొచ్చేందుకు రాష్ట్ర మున్సిపల్ శాఖ శరవేగంగా కసరత్తు చేస్తోంది. ఈ మేరకు మున్సిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు స్పష్టమైన ఆదేశాలు కూడా జారీ చేశారు. ఖాళీ స్థలాలకు సంబంధించిన యజమానులు ఎవరో? వారు ఎక్కడ ఉంటారో తెలియకపోవడం వల్ల సంబంధిత మున్సిపాలిటి అధికారులు సైతం ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. అందులో భాగంగానే ఖాళీ స్థలాలపై ఖచ్చితంగా పన్నులు వసూలు చేయాలన్న లక్ష్యంతో మున్సిపల్ శాఖ జియో ట్యాగింగ్‌ను తీసుకవస్తోంది. అలాగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ఖాళీ స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ఏ మేరకు అయ్యాయన్న వివరాలు కూడా అందించాల్సిందిగా మున్సిపల్ శాఖ ఇటీవల రిజిస్ట్రేషన్ల శాఖను కూడా కోరింది. ఇందుకు ఆ శాఖ వివరాలను సుముఖతను కూడా వ్యక్తం చేసింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో పెద్దఎత్తున ఉన్న ఖాళీ స్థలాలు ఉన్నాయి. వాటిపై సక్రమంగా పన్నులు వసూలు చేయగలిగితే చాలా వరకు మున్సిపాలిటీలపై ఆర్థిక భారం పడే అవకాశాలు కూడా లేవు. పట్టణ ప్రాంతాల పరిధిలో ప్రతి సంవత్సరం స్థలాలకు సంబంధించిన మార్కెట్ రేటు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ స్థలాలు, ప్లాట్లకు సంబంధించిన యజమానులు మాత్రం చెల్లించాల్సిన పన్నులు మాత్రం కట్టడం లేదు.





పట్టణంలోని ప్రతి స్థలం జియో ట్యాగింగ్

పట్టణ ప్రాంతాల పరిధిలో ఖాళీ స్థలాలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని బిల్డర్లు ఎక్కువ సంఖ్యలో పెద్ద పెద్ద లేఅవుట్లను రూపొందిస్తున్నారు. అలాగే సాధారణ వర్గాల ప్రజల కోసం మధ్య తరహా లే అవుట్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. దీని కారణంగా పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్లు కూడా జరుగుతున్నాయి. అయితే ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్ను చెల్లించకుండానే క్రయ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీనిని నియంత్రించాలన్న లక్ష్యంతోనే మున్సిపల్ శాఖ జియో ట్యాగింగ్ ద్వారా పట్టణాల్లో ప్రతి స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోనున్నారు. ఇప్పటికే ఈ విధానాన్ని భవనాలకు వినియోగించి ఆస్తిపన్నును మున్సిపల్ శాఖ ప్రతి సంవత్సరం పెంచుకుంటోంది.

17నుంచి అసెంబ్లీ





(మొదటిపేజీ తరువాయి)

నెల 18వ తేదీన స్పీకర్ ఎన్నిక నిర్వహిస్తారు. ఆ తర్వాత నూతనంగా ఎన్నికైన స్పీకర్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, ప్రతిపక్ష నాయకులు, ఇతర పార్టీల శాసనసభా పక్ష నాయకులు కలిసి ఆయనను స్పీకర్ స్థానంలో కూర్చోపెడతారు. అనంతరం నూతనంగా ఎన్నికైన స్పీకర్ అధ్యక్షతన సభా కార్యక్రమాలు సాగుతాయి. ఆ తర్వాత బిఎసి సమావేశాన్ని నిర్వహిస్తారు. ఈ నెల 19వ తేదీన శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఈ నెల 20వ తేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ప్రవేశపెట్టి, దానికి ఆమోదం తెలపడం జరుగుతుంది.

మీడియాపై ఎలాంటి ఆంక్షలు లేవు..

అసెంబ్లీ కార్యదర్శి

రానున్న సమావేశాల నేపథ్యంలో మీడియాపై ఆంక్షలు విధించారన్న వార్తలను అసెంబ్లీ కార్యదర్శి డా. వేదాంతం నరసింహా చార్యులు తోసిపుచ్చారు. ప్రతి సమావేశాల సందర్భంగా రొటీన్ గా విడుదల చేసే మార్గదర్శకాలను కొన్ని పత్రికలు వార్తగా ప్రచురించాయని పేర్కొన్నారు. వచ్చే సమావేశాలను దృష్టిలో ఉంచుకొని ఇవాళ శాసనసభలో పోలీసు శాఖ ఉన్నతాధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో అసెంబ్లీ కార్యదర్శి డా. నర్సింహా చార్యులు మాట్లాడారు. మీడియాపై ఆంక్షలు పెడుతున్నట్లు వచ్చిన వార్తలు సరికావనీ, వాటిని పరిగణనలోకి తీసుకొని సమావేశాల సమయంలో మీడియా ప్రతినిధులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలిగించరాదని ఆయన కోరారు. రెండవ అసెంబ్లీ మొదటి సమావేశం సందర్భంగా ఎలాంటి ఏర్పాట్లు చేయాలి, పోలీసు బందోబస్తు, డూస్ అండ్ డోంట్స్ తదితర అంశాలపై ఇవాళ అసెంబ్లీ కమిటీ హాల్ 1 లో సమన్వయ సమావేశం జరిగింది. ఈ భేటీలో శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, డిజిపి మహేందర్ రెడ్డి, ఎస్‌పిఎఫ్ అడిషనల్ డిజి తేజ్ దీప్ కౌర్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేది, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్, సెంట్రల్ జోన్ డిసిపి విశ్వ ప్రసాద్, అసెంబ్లీ చీఫ్ మార్షల్ కరుణాకర్, ఇతర పోలీసు ఉన్నతాధికారులతో పాటు, అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీ చైర్మన్ సూరజ్ వి. భరద్వాజ్, అసెంబ్లీ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కిడ్నీ రోగుల పుట్టపాక





(మొదటిపేజీ తరువాయి)

లేకపోవడం ప్రధాన కారణమైయితే, ప్రజలు ఫ్లోరిన్ నీటిని తాగుతూ కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారు. స్వాతంత్ర్యానంతరం గ్రామ పంచాయతీగా ఏర్పడిన ఈ గ్రామంలో ఇప్పటి వరకు సుమారు 10 మంది స్త్రీ, పురుషులు సర్పంచ్‌లుగా పని చేసిన సమస్య మాత్రం తీరలేదు. తేలియా రుమాల్ అనే వస్త్రాలు తయారు చేయడంలో రెండు పద్మశ్రీలతోపాటు, జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకోవడంతో పుట్టపాక ప్రపంచ ప్రఖ్యాతిగాంచింది. ఇంత ప్రసిద్ధి గాంచిన ప్రజలు మాత్రం దుర్భర జీతాల నుండి విముక్తి పొందలేకపోతున్నారు. గ్రామంలో 70శాతం మంది చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తుండగా, మరో 30 శాతం మంది వ్యవసాయం వృత్తిగా జీవనోపాధి పొందుతున్నారు. సుమారు 6వేల వరకు జనాభా ఉన్న ఈ గ్రామంలో రెండు ఇళ్లకు ఒక్కరు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రభుత్వాధికారులు, నేతలతో ఎన్నోమార్లు మొరపెట్టుకున్న తమ గోడు పట్టించుకున్నవారు లేరని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం వ్యాధి పీడితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. వ్యాధి సోకిన వారు నెలకు రెండుమార్లు డయాలసిస్ చేయించుకునేందుకు 50 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుంది. కనీసం డయాలసిస్ సెంటర్‌ను తమ గ్రామంలో ఏర్పాటు చేయాలని విన్నపాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని, కిలోమీటర్లు వెళ్లి డయాలసిస్ చేయించుకునేందుకు స్థోమత లేదని కన్నీరు మున్నీరవుతున్నారు. దూరాభారం వెళ్లలేక కొందరు మరణాన్ని ఆశ్రయించక తప్పలేదని గద్గద స్వరంతో దీనంగా చెబుతున్నారు.

వెంటాడుతున్న ఫ్లోరైడ్‌భూతం

దశాబ్దాలు ఈ గ్రామాన్ని ఫ్లోరైడ్ భూతం పట్టిపీడిస్తోంది. వందలడుగుల్లో బోర్లు వేసినప్పటకీ ఫ్లోరిన్‌నీరు రావడంతో వాటినే సేవిస్తుండడం వల్ల ఈ గ్రామ ప్రజలు కిడ్నీ వ్యాధికి గురవుతున్నారు. అంతేకాకుండా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, రంగులద్దిన నీటిని బయటికి వదులుతుండడంతో, ఆ నీరు భూమిలోకి ఇంకి తిరిగి బోరునీరు కలిషితమై వచ్చిన నీటిని సేవించడం, చేనేత కార్మికులు అధిక సమయం మగ్గంపై కూర్చుని నీటిని ఎక్కువగా తాగకపోవడం, దీనితోడు మద్యవ్యసనం వారి జీవితాలను కిడ్నీ వ్యాధుల రూపంలో ఛిద్రం చేస్తున్నది.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయండి..

పుట్టపాక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు భావనాబుుషి

గ్రామంలో చాలా మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. వైద్య శిబిరాలను నిర్వహించాం. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ప్రభుత్వం చొరవచూపి బాధితుల కోసం కిడ్నీ సెంటర్, డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

కిడ్నీ వ్యాధి బాధితులను ఆదుకోవాలి..

న్యాయవాదుల బృందం

పుట్టపాకలో కిడ్నీ వ్యాధి బాధితులను ఆదుకోవాలని తెలంగాణ హైకోర్టు న్యాయవాద బృందం సభ్యులు బి. శంకర్ కోరారు. ఆదివారం ఇరవై ఐదు మందితోకూడిన హైకోర్టు న్యాయవాదుల బృందం పుట్టపాక గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా కోరారు. మూత్రపిండాల వ్యాధితో మృతి చెందిన కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గ్రామంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.

మకరజ్యోతి దర్శనం

(మొదటిపేజీ తరువాయి)

అయ్యప్ప భక్తులు శబరిమలకు చేరుకున్నారు. మహిళల ప్రవేశంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ఈ ఏడాది శబరిమలలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మకర జ్యోతి దర్శనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనా జరక్కుండా ట్రావెన్కూర్ దేవస్వం బోర్డు భారీ ఏర్పాట్లు చేసింది. శబరిమలలో మకరజ్యోతి సందర్భంగా పంపానదితో పాటుగా సన్నిధానం, హిల్‌టాప్,టోల్‌ప్లాజా సమీపంలో జ్యోతి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం వచ్చిన భక్తులంతా జ్యోతి దర్శనం కోసం ఉండిపోవడంతో సోమవారం అదనంగా వచ్చిన వేలాది భక్తులతో ఆలయ ప్రాంతం అంతా కిటకిటలాడిపోయింది. అంతకు ముందు రెండు రోజుల క్రితం (శనివారం) పందళం ప్యాలెస్‌నుంచి బయలుదేరిన స్వామి తిరువాభరణాలు సోమవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో పద్దెనిమిది మెట్ల మీదుగా సన్నిధానానికి చేరుకున్నాయి. వాటికి సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికిన ఆలయ పూజారులు అనంతరం స్వామికి ఆభరణాలను అలంకరింప జేసి సరిగ్గా ఆరున్నర గంటలకు తిరువాభరణ హారతి ఘట్టాన్ని నిర్వర్తించారు. స్వామికి ఆభరణాలను అలంకరించే సమయంలోనే సాయంత్రం 6.35 గంటలకు ఆలయానికి ఈశాన్య దిశలో ఉండే పొన్నాంబల మేడు పర్వతాలపై మణికంఠుడు జ్యోతి రూపంలో దర్శనమిచ్చాడు. జ్యోతిని దర్శించుకున్న లక్షలాది భక్తుల శరణు ఘోషతో ఆలయ ప్రాంతమంతా ప్రతిధ్వనించింది. ఈ జ్యోతి దర్శనం కోసమే అయ్యప్ప భక్తులు అష్టకష్టాలను అనుభవించి శబరిమలకు చేరుకుని గంటకొద్దీ వేచి ఉంటారు. సాయం సంధ్య వేళ మకర జ్యోతి దర్శనం వేయి జన్మల పుణ్యఫలంగా భక్తులు భావిస్తారు. మకర జ్యోతి దర్శనానికి లక్షల సంఖ్యలో భక్తులు రానుండడంతో సుమారు ఆరు వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లను చేశారు. భక్తులకు భద్రత కల్పించడంతో పాటుగా తొక్కిసలాట జరక్కుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉద్రిక్తత కారణంగా ఈ సారి భక్తుల రద్దీ తక్కువగా ఉండవచ్చని మొదట భావించినప్పటికీ ఆది, సోమవారాల్లో భారీ సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయప్రాంతం అంతా ఇసకేస్తే రాలని పరిస్థితి కనిపించింది. ఈ నెల 19వ తేదీ వరకు అయ్యప్ప భక్తులు శబరి గిరీశుడ్ని దర్శించుకోవచ్చు. 20వ తేదీన పందళ రాజవంశీకులు స్వామివారిని దర్శించుకున్న తర్వాత ఆలయాన్ని మూసివేస్తారు.

అయ్యప్పను దర్శించుకున్న పి. సుశీల

సోమవారం అయ్యప్ప స్వామిని దర్శించుకున్న ప్రముఖుల్లో ప్రఖ్యాత గాయని పి సుశీల కూడా ఉన్నారు. ఆమె అయ్యప్పను దర్శించుకోవడం ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా ఆమె కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హరివరాసనం అవార్డును కూడా అందుకున్నారు.





రైల్వేలో నీలంరంగు సిగ్నల్

న్యూఢిల్లీ : ప్రమాదాలను నివారించేందుకు భారతీయ రైల్వే కొత్త పద్ధతిని ప్రవేశపెడుతోంది. బోగీలకు ఉన్న ప్రతి ద్వారం వద్ద నీలం రంగు లైట్లను అమర్చుతోంది. రైలు కదులుతున్న సమయంలో ఇవి మిణుమిణుకుమనేలా ఏర్పాటు చేస్తున్నారు. ఈ లైట్లు వెలిగితే రైలు కదులుతోందని, ఎవరూ ఎక్కే ప్రయత్నం చేయొద్దని అర్థం. ప్రస్తుతం ఈ విధానాన్ని ముంబయి లోకల్ రైళ్లకు మాత్రమే ప్రయోగాత్మకంగా అమర్చారు. రైలు కదిలే ముందు రైలు పొడవునా ప్రతి ద్వారం వద్ద ఉన్న నీలం రంగు లైట్లు వెలిగేలా, దీని నియంత్రణ గార్డు చేతిలో ఉండే ఏర్పాటు చేశారు.

నేతల సంక్రాంతి శుభాకాంక్షలు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ప్రజలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ, టిపిసిసి ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రైతు సంక్షేమం, నిరుపేదల అభివృద్ధే ధ్యేయంగా దేశాన్ని అన్ని రంగాలలో పురోభివృద్ధి దిశగా ప్రధాన మంత్రి పనిచేస్తున్నారని లక్ష్మణ్ పేర్కొన్నారు.

నేడు కైట్ ఫెస్టివల్..

సంక్రాంతి సంబురాల్లో భాగంగా మంగళవారం నగరంలోని నెక్లెస్‌రోడ్డులో కైట్ ఫెస్టివల్‌ను బిజెపి నిర్వహిస్తోంది. ఉదయం 11 జరిగే ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌తో పాటు కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ శాసనసభ్యులు జి. కిషన్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

గోవధ నిందితులపై ఎన్‌ఎస్‌ఏ కింద కేసు నమోదు

బులంద్ షెహర్ : గత నెలలో ఉత్తర ప్రదేశ్‌లో గోవధకు పాల్పడ్డారన్న ఆరోపణపై అరెస్టయిన ఏడుగురిపై కఠినమైన జాతీయ భద్రతా చట్టం కింద కేసు నమోదు చేశామని అధికారులు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 3న జిల్లాలో ఆవుల కళేబరాలు కనిపించడంతో రెచ్చిపోయిన ప్రజలు పెద్ద ఎత్తున హింసకు పాల్పడ్డారు. ఆ హింసాత్మక సంఘటనలో ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్, మరో యువకుడు మరణించారు. గోవధ కేసుల్లో అరెస్టయిన వారిపై ఎన్‌ఎస్‌ఏ కింద కేసు నమోదు చేసినట్టు జిల్లా మేజిస్ట్రేట్ అనుజ్ ఝా చెప్పారు. అరెస్టయిన ఏడుగురిలో నలుగురు ...తాము డిసెంబర్ ఒకటి , రెండు తేదీల్లో నయగావ్, మాహా గ్రామాల సమీపంలో ఉన్న అడవుల్లో నాలుగు ఆవులను చంపినట్టు అరెస్టయిన నిందితులు అంగీకరించారని బులంద్ షెహర్ పోలీస్ సూపరింటెండెంట్ అతుల్ కుమార్ శ్రీవాత్సవ తెలిపారు. ఇలా ఉండగా, అల్లర్ల సందర్భంగా అరెస్టయిన బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ యోగేష్ రాజ్ ఏడుగురు గోవధకు పాల్పడినట్టు అంతకు ముందు గుర్తించారని, అయితే ఆయన గుర్తించిన వారు, అసలైన నిందితులు వేరని అతుల్ కుమార్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో మార్పులు

మన తెలంగాణ/హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో మార్పులపై పూర్తి అధికారాలు జిల్లా కలెక్టర్‌కే ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్నవాటిలో జిల్లా కలెక్టర్ ఖచ్చితంగా ఏమైనా మార్చాలని అనుకుంటే మార్చవచ్చునని తెలిపింది. ఈ క్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులను సంప్రదించి మార్చిన పోలింగ్ కేంద్రంను ప్రకటించాలని, ఆ సమాచారం అభ్యర్థులకు చేరవేయాలని పేర్కొంది. యాద్రాది భువనగిరి, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి వచ్చిన లేఖల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టతనిచ్చింది.

రెండో విడతలో 25,419 నామినేషన్లు

రేపటి నుంచి మూడో విడతకు స్వీకరణ

మన తెలంగాణ/హైదరాబాద్ : రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా 4135 పంచాయతీలకు 25,419 నామినేషన్లు దాఖలు అయినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అలాగే 36,602 వార్డులకు 60, 038 నామినేషన్లు దాఖలు చేశారు. ఆదివారంతో స్క్రూటిని ముగిసినప్పటికీ అన్ని జిల్లాల నుంచి సమాచారం రాలేదు. దీంతో సరైన నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల సంఖ్యపై మంగళవారం స్పష్టత రానుంది. ఈ నెల 17 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువుంది. ఇదిలా ఉండగా మూడో విడత పంచాయతీలకు నామినేషన్ల స్వీకరణ ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానుంది.

100 చానళ్లకు రూ.153.40

(మొదటిపేజీ తరువాయి)

ఎంపిక చేసుకోవాలని తెలిపింది. ఫిబ్రవరి1నుంచి కొత్త విధానం అమలులోకి వస్తుందని, ఈ ప్యాక్‌లో హెచ్‌డి చానళ్లు ఉండవని స్పష్టం చేసింది. అయితే రెండు సాధారణ చానళ్లకు బదులు ఒక హెచ్‌డి చానల్‌ను ఎంపిక చేసుకోవచ్చని కొన్ని సంస్థలు అంటున్నాయి. తమ సర్వీస్ ప్రొవైడర్లనుంచి దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలని ట్రాయ్ సూచించింది. అంతేకాదు గంపగుత్తగా చానళ్లను ఎంపిక చేసుకోవలసిన అవసరం లేదని ,తమకు ఇష్టమైన వాటినే ఎంపిక చేసుకోవచ్చని తెలిపింది. కాగా ఒక చానల్ గరిష్ఠధరను రూ.19గా నిర్ణయించింది.

నిన్న పులి, నేడు చిరుత

(మొదటిపేజీ తరువాయి)

మర్చిపోకముందే మరో చిరుత పులి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడం కలకలంరేపింది. మంచిర్యాల జిల్లా కేంద్రానికి సమీపంలోని రంగంపేట అటవీ ప్రాంతంలో సోమవారం అటవీ అధికారులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన చిరుత పులి మృతదేహాన్ని కనుగొన్నారు. వెంటనే వేటగాళ్ల ఆచూకి కోసం డాగ్‌స్క్వాడ్‌ను రంగంలోకి దింపి వేటగాళ్ల ఆచూకి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రంగంపేట పరిసర ప్రాంతాల్లో అడవి పందుల వేటకోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి చిరుత పులి హతమైనట్లు అటవీ అధికారులు భావిస్తున్నారు. చిరుత పులి ఈ ప్రాంతానికి ఎలా వచ్చిందనే అంశంపై సిసి కెమెరాలను పరిశీలిస్తున్నారు. పక్షం రోజుల్లోనే రెండు పులులు మృత్యువాత పడడం చర్చనీయాంశంగా మారింది.



పతంగుల పండుగలో భాగంగా అలహాబాద్‌లో నిర్వహించిన వేడుకలో పతంగి ఎగరవేస్తున్న బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా



పోస్టింగ్‌లు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి : షర్మిల

మనతెలంగాణ, సిటీబ్యూరో : సోషల్ మీడియాలో తనపై, తన కుటుంబం సభ్యులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్‌కు వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వైఎస్ షర్మిళ ఫిర్యాదు చేశారు. తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి షర్మిళ సోమవారం సిపిని కలిశారు. వారితో పాటు కమిషనర్‌ను కలిసిన వారిలో వైఎస్‌ఆర్‌సిపి సీనియర్ నాయకులు వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణా రెడ్డి, వాసిరెడ్డి పద్మ ఉన్నారు. 2014 ఎన్నికలకు ముందు తనకు సినీ హీరో ప్రభాస్‌కు సంబంధం ఉందని ఓ వర్గం సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిందని, గతంలో దీనిపై ఫిర్యాదు చేశామని తెలిపారు. పోలీసులు నిందితులను అరెస్టు చేయడంతో ప్రచారం ఆగిపోయిందని ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వస్తుండడంతో ప్రచారం మొదలు పెట్టారని అన్నారు. తన వ్యక్తిత్వాన్ని దిగజార్చేందుకు యత్నిస్తున్నారని వారిపై వారి వెనుక ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిని కోరామని తెలిపారు. ఇది తన ఒక్కదానిపై జరిగిన దాడి మాత్రమే కాకుండా మహిళలపై కూడా లేనిపోని నిందలు వేస్తున్నారని అన్నారు. సోషల్ మీడియా, వెబ్‌సైట్లలో ఉన్న ఇలాంటి ప్రచారం చేస్తున్న వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇది నా వ్యక్తిగత విషయంగా కాకుండా మహిళలందరి ఆత్మగౌరవ విషయంగా పరిగణించి దోషలను శిక్షించాలని కోరామని తెలిపారు.

ఈ ఏడాది ఆరుగురు చీఫ్ ఇంజనీర్ల రిటైర్!

మన తెలంగాణ/హైదరాబాద్ : ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్న ఆరుగురు చీఫ్ ఇంజనీర్లు 2019లో పదవీ విరమణ చేయనున్నారు. వీరితో పాటు 7 మంది ఎస్‌ఇలు, 26 మంది ఇఇలు కూడా 2019లో పదవీ విరమణ చేస్తారు. పనులన్నీ కీలకమైన సందర్భంలో ఉన్నందున వీరి పదవీ విరమణకు ప్రభుత్వం అనుమతిస్తుందా.. పొడిగిస్తుందో వేచిచూడాలి. అయితే వీరితో పాటు ఇఎన్‌సిగా చాలా కాలంగా కొనసాగుతున్న మురళీధర్ పదవీకాలం కూడా వచ్చే జూన్‌తో ముగుస్తుంది. దీంతో పాటు దేవాదుల చీఫ్ ఇంజనీర్‌గా ఉన్న బంగారయ్య పదవీ కాలం కూడా డిసెంబరుతో ముగుస్తుంది. వీరికి పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం పొడిగింపునిచ్చిన సంగతి తెలిసిందే. 2019లో పదవీ విరమణ చేసే ఆరుగురు సిఇలలో మైనర్ ఇరిగేషన్ (గోదావరి బేసిన్) కె. శ్యాంసుందర్, కాళేశ్వరం సిఇ ఎన్. వెంకటేశ్వర్లు, క్వాలిటీ కంట్రోల్ సిఇ బేతు వెంకటేశ్వర్లు, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న మైనర్ ఇరిగేషన్ (కృష్ణా బేసిన్) సిఇ కె.సురేష్ కుమార్, మహబూబ్‌నగర్ (ప్రాజెక్టులు) సిఇ టి.ఖగేందర్, డిజి వాలంతరీ పి. శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు. ఎస్‌ఇలలో హైడ్రాలజీ ఎస్‌ఇ బి.రవీంద్ర కుమార్, నిజామాబాద్ ఎస్‌ఇ ఎం. దామోదర్, హైదరాబాద్ లేక్స్ ఎస్‌ఇ సి.గంగాధర్, గోదావరి బోర్డు ఎస్‌ఇ సి.మహేందర్, కరీంనగర్ హైడ్రాలజీ ఎస్‌ఇ ఎ.శ్రవన్ కుమార్, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ ఎస్‌ఇ టి.రాజశేఖర్, డిండి ఎత్తిపోతల ఎస్‌ఇ టి.విజయ్ కరన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



మన తెలంగాణ/శామీర్‌పేట : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఒకరు తీవ్రగాయలైన సంఘటన శామీర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్ధిపేట జిల్లా, ములుగు మండలం, వాగునూతి గ్రామానికి చెందిన గూడురు నర్సింహ్మారెడ్డి (51) పాల వ్యాపారం చేస్తు జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మల్లారెడ్డి, రసూల్‌పూరకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఓం బహదూర్(52)తో కలిసి కారులో వెళ్తున్నారు. తుర్కపల్లి వద్ద కారు టైర్‌లో గాలితగ్గడంతో పంచర్ దుకాణాం వద్ద నిలిపి మాట్లాడుతున్నారు. అదే సమయంలో సిద్దిపేట నుంచి నగరం వైపుకు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో నర్సింహ్మారెడ్డి, ఓం ప్రకాశ్ బహదూర్‌లు అక్కడికక్కడే మృతి చెందగా మల్లారెడ్డికి తీవ్ర గాయాలు అయ్యాయి. మల్లారెడ్డిని చికిత్స నిమిత్తం నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కెటిఆర్‌పై చాటుకున్న అభిమానం

సంక్రాంతి ముగ్గుల్లో కెటిఆర్ చిత్రం

మన తెలంగాణ / సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సంక్రాంతి సంబరాల్లో సిరిసిల్ల శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావుపై అభిమానంతో సంక్రాంతి ముగ్గుతో కెటిఆర్ చిత్రన్ని రూపొందించారు. సిరిసిల్లలో సంక్రాంతి సంబరాల వేడుకల్లో భాగంగా మున్సిపల్ కౌన్సిల్ వారు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో కెటిఆర్ చిత్రపటాన్ని టిఆర్‌ఎస్ అభిమానులు ముగ్గుల రూపంలో భారీగా చిత్రీకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని దేవదాస్, మున్సిపల్ కౌన్సిలర్లు బత్తుల వనజ, దిడ్డి మాధవి, కొండ అనూష, టిఆర్‌ఎస్‌వి నేతలు తదితరులు కెటిఆర్ రూపాన్ని ముగ్గు రూపంలో చిత్రీకరించి జిల్లా కలెక్టర్ వెంకట్రామరెడ్డి, జెసి యాస్మిన్ భాషా, డిఆర్‌వో ఖీమ్యానాయక్, ఆర్‌డిఒ శ్రీనివాసరావు, ఎస్‌పి రాహుల్ హెగ్డే, మున్సిపల్ కమిషనర్ డా. కెవి రమణాచారి తదితరుల ప్రశంసలు అందుకున్నారు. సిరిసిల్లలోని మానేరు నది ఒడ్డున బతుకమ్మ ఘాట్ వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీలో పలువురు సంక్రాంతి రంగవల్లులను తీర్చిదిద్దినప్పటికీ ఆహుతులను కెటిఆర్ ముగ్గు విశేషంగా ఆకర్షించింది.

సుల్తానాబాద్‌లో రైతుబంధు పథకం ముగ్గు

ఆకట్టుకున్న ఉపాధ్యాయురాలు

మనతెలంగాణ/ సుల్తానాబాద్ : పట్టణంలోని గాంధీనగర్‌లో భోగి, మకర సంక్రాంతి పండగను పురస్కరించుకొని పబ్బతి నితారెడ్డి అనే ఉపాధ్యాయురాలు తన ఇంటి ముందు రైతుబంధు పథకం ముగ్గును వేశారు. రైతు చేతిలో పట్టా పాసుబుక్కు, మరో చేతిలో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రైతుబంధు చెక్కును చూపిస్తూ పక్కనే వరిధాన్యం గొలుసుతో ముగ్గు వేసి రైతులతో పాటు ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. ముగ్గుల తోనూ సృజనాత్మకంగా విషయాలను ఎలా విశదీకరించవచ్చన్న విషయాన్ని నితారెడ్డి తాను ముగ్గు ద్వారా నిరూపించారు. ముగ్గు అంటే కొన్ని చుక్కలను కలుపుతూ రంగులు నింపడమే కాదు, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని కళ్లకు కట్టినట్టు చూపవచ్చని ఒక ఉపాధ్యాయినిగా ముగ్గుతో ఇలా బోధించడం ఉపాధ్యాయురాలి నైపుణ్యాన్ని చాటి చెప్పుతుంది.

నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు

మన తెలంగాణ /తిరుమల ప్రతినిధి : సంక్రాంతి సంబరాలను ప్రతియేటా తన స్వగ్రామంలో జరుపుకొనే ఆనవాయితీ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారి కుటుంబ సభ్యులు ఈసారి కూడా ఇదేవిధంగా కుటుంబ సభ్యులతో కలిసి నారావారిపల్లెలో సందడి చేశారు. బంధుమిత్రులు అందరూ కలిసి భోగి మంటలు వేశారు. సాంప్రదాయ దుస్తులు ధరించి కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపారు. తన స్వగ్రామమైన నారావారిపల్లెలో ఇల్లిల్లు తిరిగి బంధువులను పరిచయస్తుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి నారా లోకేష్ తన సతీమణి బ్రాహ్మణి కుమారుడు దేవాన్ష్ లతో కలిసి తిరుమల చేరుకొని శ్రీవారి దర్శనం చేసుకున్నారు. తిరుమల విచ్చేసిన లోకేష్ కు టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.ఎస్.శ్రీనివాసరాజు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో మంత్రికి వేద పండితులచే ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను చిత్రపటాన్ని అందించారు.

వాతావ'రణం' తట్టుకునేలా పరిశోధనలు

- సుస్థిర వ్యవసాయానికి తప్పనిసరి అవసరం
- యాసంగి పంటలపై ఉష్ణోగ్రతలు, నైరుతి వర్షాల ప్రభావం
- రాష్ట్రంలో వాతావరణ మార్పులపై పర్యావరణ పరిశోధన సంస్థ నివేదిక
- వ్యవసాయ శాఖకు పలు సూచనలు.. కేంద్రానికి నివేదిక



మన తెలంగాణ/హైదరాబాద్ : వాతావరణ మార్పులను తట్టుకునేలా సుస్థిర వ్యవసాయానికి తగిన అన్ని పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని పర్యావరణ రక్షణ, శిక్షణా పరిశోధన సంస్థ (ఇపిటిఆర్‌ఐ) స్పష్టం చేసింది. వ్యవసాయ రంగంలో వీటన్నింటిని అధిగమించి, రైతుల ఆదాయానికి గండిపడకుండా చూడాలంటే ఆనర్గానిక్ ఎరువుల స్థానంలో బయో ఫెర్టిలైజర్స్ వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర పర్యావరణ శాఖకు తెలంగాణలో వాతావరణ మార్పులపై కార్యాచరణ నివేదికను సమర్పించడంతో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖకు పలు సూచనలు చేసింది. ఇందులో ప్రధానంగా వ్యవసాయ రంగంపై వాతావరణ మార్పుల కారణంగా కలుగుతున్న నష్టాలను పేర్కొనడంతో పాటు అందుకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలను కూడా వివరించారు. రైతులందరికీ సకాలంలో పంట రుణాలు అందించాలని, కౌలు రైతులకూ ఈ సౌకర్యం అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. నష్టం వాటిల్లిన ప్రతి పంటకు బీమా కింద పరిహారం వచ్చేలా రైతుల్లో చైతన్యం తీసుకురావాలని పేర్కొన్నారు. పంటల సాగు విధానంలో మార్పులు తీసుకురావాలని, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవాలంది. క్షేత్రస్థాయిలో సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు జర్మ్‌ప్లాసమ్ బ్యాంకులు నెలకొల్పాలని సూచించారు. పంట ఉత్పత్తులు ధరల సమాచారాన్ని కూడా రైతులకు అందేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బోరు బావులుకు అధిక ఇంధన సామర్థ్యం ఉన్న పంపుసెట్లను అమర్చడం వంటివి చేయాలన్నారు.

నష్టాలను తగ్గించడమే లక్ష్యం

వాతావరణ మార్పుల కారణంగా వ్యవసాయ ఆధారిత కుటుంబాల ఆదాయంలో వస్తున్న నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో ముందుకు వెళ్లనున్నట్లు ఇపిటిఆర్‌ఐ పేర్కొంది. వ్యవసాయ రంగం విషయంలో ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గుల కారణంగా యాసంగి పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందని గుర్తించారు. అలాగే నైరుతి రుతపవనాల కాలంలో వర్షాలు సరిగ్గా రాకపోవడంతో సాగు విస్తీర్ణం కూడా తగ్గుతుందన్నారు. ఇందుకోసం పంటల రకాలను(వైరైటీ) అభివృద్ధి చేసి, రైతులతో సాగులోకి తీసుకురావాలని సూచించారు. ఇవి మారుతున్న వాతావరణ ఆధారంగా వేడికి, చలికి తట్టుకోవడంతో పాటు తక్కువ నీటిని తీసుకుని సాగయ్యేలా బ్రీడర్ సీడ్ నుంచే ఉండాలని పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో పొడి భూములు ఉన్నాయని, ఇక్కడ వార్షిక వర్షపాతం 500 మిల్లి మీటర్ల కంటే తక్కువగా ఉంటుందని ఇలాంటి చోట్ల వర్షపాత వ్యవసాయం ఆచరణీయం కాదని సూచించారు. భూసారం విపరీతంగా దెబ్బతింటోందని ఎరువులు, పురుగు మందుల వినియోగం అధికంగా పెరగడంతోనే ఇలా అవుతుందని ఇది పంటల దిగుబడిపైన మాత్రమే కాదని రైతుల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని కేంద్రానికి నివేదించిన ప్రణాళికలో ఇపిటిఆర్‌ఐ పేర్కొంది.

పురుగు మందులతో అడవులు విషతుల్యం

అడవులు తగ్గిపోతున్నాయని, ఫలితంగా భూముల్లో సారం తగ్గుతుందని ఇపిటిఆర్‌ఐ తన కార్యాచరణలో పేర్కొంది. అడవుల్లో చెట్లు చిగురించి, పుష్పించే సమయంలో వచ్చే పక్షులకు అవాంతరాలు సృష్టిస్తున్నారని, అలాగే కీటకాలు రాకుండా పురుగు మందులు కొడుతుండటంతో అడవులు విషతుల్యంగా మారే ప్రమాదం ఏర్పడిందని నివేదించారు. పక్షులు, కీటకాలు కాలనుగుణంగా వస్తాయని అవి దాదాపుగా వృక్షాలకు మేలు చేసేవిగానే ఉంటాయని, వాటికి సంబంధించిన ఆనవాళ్లను గుర్తించేందుకు వాటి వేలి ముద్రలను తీసుకోవడం వంటివి చేయాలని సూచించారు. పట్టణ, గ్రామ ప్రజల నివాస ప్రాంతాల్లో మొక్కలు నాటాలని కార్యాచరణలో స్పష్టం చేశారు. కరువు, భూగర్భ జలాలు తగ్గిపోవడం, జలవనరులు కనుమరుగైపోవడం వంటి వాటిపై ముందస్తు రాష్ట్రస్థాయి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించింది. ముందుగా స్వలకాలంలో అధిగమించే వాటిని అనుసరించాలని తెలిపింది. ప్రస్తుతం జీవవైవిధ్యం ఎలా ఉందో కూడా పరిశోధన చేసి నివేదిక రూపంలో భద్రపర్చుకోవాలని కాలనుగుణంగా ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులను అధిగమించుకుంటూ ముందుకు వెళ్లాల్సి ఉంటుందని పేర్కొంది.

కోడికత్తి కేసులో కొనసాగుతున్న విచారణ

- నార్కో టెస్టుకు సిద్ధమని నిందితుని వెల్లడి

మన తెలంగాణ/హైదరాబాద్ : వైఎస్సార్ పార్టీ అధ్యక్షుడు జగన్‌పై కోడికత్తి దాడి ఘటనపై మాదాపూర్‌లోని ఎన్‌ఐఎ కార్యాలయంలో రెండో రోజు విచారణ సాగింది. హైదరాబాద్ ఎన్‌ఐఎ కార్యాలయంలో సోమవారం ఆరుగురు సభ్యులు గల ఎన్‌ఐఎ బృందం శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. ఈక్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి కోడికత్తి నిందితుని తరపు న్యాయవాది సలీం హైదరాబాద్‌లోని ఎన్‌ఐఎ కార్యాలయానికి చేరుకున్నారు. దాడి ఘటనలో నిందితుడు శ్రీనివాసరావు తరపు న్యాయవాది సలీం సమక్షంలో అధికారులు విచారణ చేపట్టారు. దాడి వెనుక ఎవరున్నారని ప్రశ్నించారు. అసలు జగన్‌పైనే దాడి ఎందుకు చేయాల్సి వచ్చిందని ఎన్‌ఐఎ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. తన వెనుక ఎవరూ లేరని, తనను నార్కో టెస్ట్ చేసినా ఇదే విషయం చెబుతానని శ్రీనివాస్ ఎన్‌ఐఎ అధికారులకు వివరించాడని అతని తరపు న్యాయవాది సలీం మీడియాకు తెలిపారు. కోడికత్తి కేసులో నిందితుడు శ్రీనివాసరావును 7 రోజల పాటు కస్టడీకి తరలించిన విషయం తెలిసిందే. మొదటి రోజు ఆదివారం జగన్‌పై దాడి జరిగిన ప్రదేశం, అక్కడ ఉన్న కొంతమందిని ఎన్‌ఐఎ అధికారులు వివరించారు. ఎంత కాలంగా ఎయిర్ పోర్ట్‌లో పనిచేస్తున్నది ఎందుకు? ఎందుకు దాడి చేయాల్సి వచ్చిందన్న దానిపై ఎన్‌ఐఎ అధికారులు సమాచారం రాబడుతున్నారు.



ప్రత్యేక సర్వీసుల పనితీరును పరిశీలించిన రైల్వే అధికారులు

మన తెలంగాణ / హైదరాబాద్ : సంకాంత్రి పండుగ నేపథ్యంలో ప్రత్యేక రైళ్ల నిర్వహణను చేపట్టిన దక్షిణ మధ్య రైల్వే తిరుగు ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. సంకాంత్రి తర్వాత తిరిగి వచ్చే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైళ్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. ఇందుకోసం ప్రయాణికుల రద్దీ, తిరుగు ప్రయాణికులకు సంబంధించిన సంఖ్యపై అంచనాలు వేస్తున్నారు. ప్రత్యేక సర్వీసుల నేపథ్యంలో భద్రత పై కూడా దృష్టిని సారించినట్లు అధికార యంత్రాంగం వెల్లడించింది. ఇందులో ప్రధానంగా సమయపాలనతో పాటు భద్రత కోసం అధికారులు నిత్య పర్యవేక్షణ చేపట్టారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ భద్రతపై ఆరా తీస్తూ రైళ్లు సాఫీగా భద్రంగా నడిచేందుకు వీలుగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. చివరి నిమిషంలో కూడా ప్రయాణికులు తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు వీలుగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఇందులో భాగంగానే ఏ రోజుకారోజు జన్ సాధారణ్ రైళ్లను నడిపిస్తున్నారు. 50 శాతం అదనంగా 203 ప్రత్యేక రైళ్లను అధికారులు ఈ ఏడాది నడిపారు. వీటితో పాటు అవసరమైన రైళ్లకు అదనపు బోగీలను కూడా ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లలో సోమవారం కమర్షియల్ విభాగం అధికారులతో పాటు పర్యవేక్షకులు ప్లాట్‌ఫారాలకు చేరుకొని ప్రయాణికుల సౌకర్యాల నిర్వహణ తీరు, రద్దీ రీత్యా ఏర్పాటు చేసిన అదనపు కౌంటర్ల ద్వారా టికెట్ల విక్రయం, ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మిషనల వద్ద క్యూ పద్ధతిని ఈ సందర్భంగా పరిశీలించారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడూ సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు రైల్వే రక్షక దళాన్ని కూడా కట్టుదిట్టం చేసినట్లు కూడా అధికారులు తెలిపారు. తొక్కిసలాటతో పాటు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాఫీగా స్వగ్రామాలకు వెళ్లేందుకు అధికారులు, సిబ్బంది విశేషంగా కృషి చేస్తున్నారని, వారి పని తీరు పట్ల ఉన్నతాధికారులు తీవ్రస్థాయిలో సంతృప్తిని వ్యక్తం చేశారు. కేటరింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేకంగా సిబ్బంది, టికెట్ల తనిఖీ కోసం కూడా భారీ సంఖ్యలో సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పారు. ప్రధాన రైళ్లతో పాటు అన్ని రకాల రైళ్లకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటి కప్పుడూ తెలియజేయడంతో పాటు తాజా సమాచారాన్ని డిస్‌పే బోర్డులను తెలియజేస్తున్నట్లు చెప్పారు.

జనరల్ బరిలో నిలిచే బిసిలను గెలిపించండి

- బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న బిసి అభ్యర్థులను గెలిపించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో బిసిల జనాభా అత్యధికంగా 56 శాతంగా ఉన్న ప్రభుత్వం పరిగణలోకి తీసుకోని ప్రభుత్వం బిసిల రిజర్వేషన్‌ను 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గించిందన్నారు. దీనివల్ల బిసిలకు రిజర్వు కావాల్సిన వేలాది గ్రామ పంచా యతీలు జనరల్ స్థానాలుగా మారాయని తెలిపారు. రాష్ట్రంలోని 12,751 గ్రామ పంచాయతీల్లో 4,335 గ్రామ పంచాయతీలు బిసిలకు రిజర్వు కావాల్సి ఉంది. కానీ నేడు ప్రభుత్వం రిజర్వేషన్ల శాతాన్ని తగ్గించడం వల్ల ఈ సంఖ్య కేవలం 2,345కు పరిమితమైందని ఆయన అన్నారు.

దీనివల్ల బిసిలు రిజర్వే కావాల్సిన 1,999 పంచాయతీలను కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. బిసిలు కోల్పోయిన గ్రామ పంచాయతీలను దక్కించుకోవాలంటే 5,147 జనరల్ స్థానాల్లోనూ బిసిలు బరిలోకి దిగాలని సూచించారు. జనరల్ స్థానా ల్లో పోటీ చేసిన బిసి అభ్యర్థులను గెలిపించేందుకు బిసిలంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. జనరల్ స్థానాలంటే అగ్రకులాల రిజర్వు చేసిన స్థానాలనే అపోహ ఉందన్నారు. కానీ వాస్తవ విరుద్ధమని జనరల్ స్థానాల్లో ఏ కులానికి చెందిన వారైనా పోటి చేయవచ్చనే అవకాశముందని తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన ఎంఎల్‌ఎలు జనరల్ స్థానాల్లో అగ్రకులాలకు చెందిన వారినే ఎంపిక చేసి సర్పంచ్‌లుగా బరిలోకి దింపుతున్నారు. దీంతో ఆర్థిక, అంగ, రాజకీయ బలం లేని బిసిలు ఎన్నికల్లో పోటీ చేయకుండా రాజకీయ అణచివేతకు గురవుతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ధైర్యంగా ముందుకు వచ్చి జనరల్ స్థానాల్లో బరిలోకి దిగే బిసి అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. జనరల్ స్థానాల్లో బరిలో నిలిచే బిసి అభ్యర్థులను పార్టీలకతీతంగా గెలిపించేందుకు బిసిలంతా సమైక్యంగా కృషి చేయాలన్నారు. మూడు విడతలుగా సాగే పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక సంఖ్యలో బిసి అభ్యర్థులను గెలిపించేందుకు బిసిలంతా ఉద్యమ స్ఫూర్తితో పనిచేసి బిసిల సత్తాను చాటాలన్నారు.

చీకటి మాటున ఇసుక దందా

మన తెలంగాణ / మహబూబ్‌నగర్ బ్యూరో : సహజ వనరులలో అత్యంత కీలకమైన ఇసుకను కొంత మంది అక్రమార్కులు చీకటి వ్యాపారం దర్జాగా చేసుకుంటున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు, ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు బిజీగా ఉండడంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. అధికారుల కళ్లుగప్పి నిరంతరంగా ఇసుకను తరలించుకుపోతున్నారు. ముఖ్యంగా చీకటి సమయంలో 8 గంటల నుండి తెల్లవారుఝాము వరకు నిరాటంకంగా ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. కొంత మంది అక్రమార్కులు రాజకీయ నాయకుల ముసుగులో ఈ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా చేసుకొని జేబులు నింపుకుంటున్నారు. భూగర్భ జలాల విషయంలో ఇసుకదే కీలకపాత్ర ఉంటోంది. చిన్న నదులు మొదల్కొని కాలువలు, కృష్ణ, తుంగభద్ర లాంటి నదుల్లో కూడా ఇసుక పెద్ద ఎత్తున తరలిపోతోంది. ఇసుక మాఫియాను అరికట్టాల్సిన రెవెన్యూ, పోలీస్ శాఖలలోని కొందరు వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. స్టేషన్‌లకు నెలమామూళ్లు ఇచ్చుకొని విచ్చలవిడిగా ఈ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. రానున్న వేసవి కాలం నేపథ్యంలో ఇసుక తరలిపోతే నదుల్లో భూగర్భ జలాలు ఇంకిపోయే ప్రమాదం ఉంది. అయినప్పటికీ ఇసుక రాబందులు యదేచ్ఛగా ఇసుకను తవ్వేస్తున్నారు. హైదరాబాద్ లాంటి నగరంలో ఇసుకకు డిమాండ్ ఉండడంతో ఇక్కడ నుండి టిప్పర్లలో నిత్యం తరలిపోతోంది.

టిప్పర్ ఇసుక హైదరాబాద్‌లో రూ.15 నుంచి 20 వేల దాకా ధర పలుకుతుండడంతో ఇసుక మాఫియా హైదరాబాద్ తరలిస్తున్నారు. మామూళ్లతో కలుపుకొని అన్ని ఖర్చులు పోను టిప్పర్‌కు కనీసం రూ.5 నుంచి రూ.10 వేల దాకా ఖర్చులు పోను మిగిలిన వాటిని జేబుల్లో వేసుకుంటున్నారు. ఇటీవల ఇసుక రవాణాపై జిల్లా కలెక్టర్లు కఠినంగా వ్యవహరించినప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఈ వ్యాపారం సజావుగా సాగుతోంది. ఇసుక రవాణాపై ఉన్న ఆంక్షాలతో పాటు వేబిల్లులు కూడా ఆన్‌లైన్‌లోనే నమోదు ఉండడంతో వీటిని ఆసరా చేసుకొని ఒకే వేబిల్‌పై అనేక సార్లు ఇసుకను తవ్వుకుంటున్నారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటలలోపు మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉన్న ఇసుక రీచ్‌లలో ఇసుకను తవ్వాల్సి ఉంటుంది. కానీ పగలు స్థబ్దతగా ఉండి రాత్రి సమయంలో ఇసుకను తరలించుకుపోతున్నారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ వ్యాపారం ఇసుకాసురులకు కాసుల వర్షం కురిపిస్తోంది.



జోగులాంబ గద్వాల జిల్లాలో తుంగభద్ర నది నుండి అటు కర్నూల్‌కు ఇటు హైదరాబాద్‌కు ఇసుకను పెద్ద ఎత్తున తరలుతోంది. రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడంతో టిప్పర్లకు టిప్పర్లు పెద్ద సంఖ్యలో తరలించుకుపోతున్నారు. అటు వైపున్న నంది కొట్కూర్, పగిడాల, పూదూరు, నెహ్రూనగర్ వంటి ప్రాంతాల నుండి కర్నూల్‌కు చెందిన ఇసుక మాఫియా మన ప్రాంత అధీనంలో ఉన్న తుంగభద్ర నుంచి ఇసుకను తరలించుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మరో వైపు పుల్లూర్ నుండి పెద్ద ఎత్తున ఇసుక రవాణా జరుగుతోంది. ఇక్కడ కొంత మంది పోలీస్ అధికారులు కూడా ఇందులో మామూళ్లు ఉన్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే అయిజ, గట్టు తదితర మండలాలకు కూడా ఇసుక పక్కదారి పడుతోంది. ఇక వనపర్తి జిల్లాలో ఇసుక వ్యాపారం మూడు టిప్పర్లు ఆరు ట్రాక్టర్లుగా వర్ధిల్లుతోంది. పెద్ద మందడి మండల పరిధిలో ఉన్న వాగులు నుంచి ఇసుక పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొంత మంది అక్రమార్కులు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి తరలించుకుపోతున్నారు. ఇక్కడ ఎవరి మామూళ్లా వారికి ముట్టజెప్పి దర్జాగా చీకటి వ్యాపారం చేసుకుంటున్నారు. మదనాపురం మండల పరిధిలో కూడా ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఇసుకను డంపులుగా చేసుకొని ఇతర ప్రాంతాలకు టిప్పర్ల ద్వారా తరలించుకుపోతున్నారు. ఆత్మకూర్, సిసికుంట తదితర ప్రాంతాల్లో కూడా ఇసుక మాఫియా జరుగుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో అచ్చంపేట, కల్వకుర్తి తదితర ప్రాంతాల్లో ఇసుక ఎక్కువగా అక్రమంగా తరలించుకుపోతున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో ఇసుక మాఫియా పెద్ద ఎత్తున జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఈ మాఫియా అన్ని మండలాల్లో విస్తరించి సహజవనరులను కొల్లగొడుతున్నారు. మహబూబ్‌నగర్ మండలంలోని కోడూరు, కోయిలకొండ మండలంలోని ఇంజమూరు వాగులో ఇసుకను తరలిస్తున్నారు. నవాబ్‌పేట మండలంలో కొంతమంది వ్యక్తులు సిండికేట్‌గా మారి రోజుకు 30 టిప్పర్ల ద్వారా తరలించుకుపోతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మూసాపేట మండలంలో పొన్నకల్, ఇజ్లాపూర్, కొమిరెడ్డిపల్లి తదితర గ్రామాలలో ఇసుక మాఫియా పెద్ద ఎత్తున చేపడుతున్నారు. పొన్నకల్ వాగు నుంచి నిత్యం ఈ అక్రమ వ్యాపారం సాగుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇక మిడ్జిల్ మండలంలో ఇసుక మాఫియాదే ఇష్టారాజ్యంగా జరుగుతోంది. పోలీసులను సైతం లెక్కచేయకుండా మాఫియా రెచ్చిపోతోంది. దర్జాగా రాత్రి సమయంలో ఇసుకను తరలిస్తున్నా పట్టుకునే సాహసం చేయడం లేదంటే మాఫియా దౌర్జన్యం ఎలా సాగుతుందో ఊహించుకోవచ్చు. స్థానిక ఎస్సైని సైతం మాట వినకుంటే బదిలీ చేయించుకునే స్థాయికి ఉన్నారంటే వారి పలుకుబడి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇసుకన తరలించుకుపోతుండడంతో భూగర్భ జలాలు ప్రమాదంలో పడే అవకాశాలు ఉన్నాయని స్థానికులు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక మాఫియాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మూడో రోజూ అదే హోరు



మన తెలంగాణ / సిద్దిపేట అర్బన్ : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు మూడో రోజు అదే హోరును కొనసాగించాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన హ్యాండ్ బాల్ జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. నువ్వా.. నేనా అన్నట్లు తలపడిన పోటీల్లో పలు రాష్ట్రాల జట్లు ప్రీ క్వార్టర్‌కు చేరాయి. రెండు రోజులు సెలవులు కావటంతో మైదానమంతా క్రీడాకారులు, అభిమానులతో కిక్కిరిసిపోయింది. సిద్దిపేట మునిసిపల్ ఛైర్మన్ రాజనర్సు క్రీడాకారులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో తమిళనాడు, చత్తీస్‌గఢ్ జట్టు పోటీపడగా తమిళనాడు జట్టు విజయం సాధించింది. మరో కోర్టులో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ జట్ల మధ్య పోటీ జరుగగా ఉత్తరప్రదేశ్ జట్టు విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్, సిబిఎస్ సిఎన్ఎస్ఒ జట్టు తలపడగా ఛత్తీస్‌గఢ్ విజయం సాధించింది. మణిపూర్, గోవా జట్లు తలపడగా మణిపూర్ జట్టు విజయం సాధించింది. పంజాబ్, బీహార్ జట్లు తలబడగా బీహార్ జట్టు పోటీలో గెలిచింది. అదేవిధంగా బాలుర విభాగంలో విద్యాభారతి జట్టు, పాండిచ్చేరి జట్టు పోటీ పడగా పాండిచ్చేరి జట్టు విజయం సాధించింది. ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్ పోటీ పడగా జమ్మూకాశ్మీర్ విజయం సాధించింది. మణిపూర్, తమిళనాడు జట్లు పోటీపడగా తమిళనాడు జట్టు విజయం సాధించింది. కేరళ, మహారాష్ట్ర జట్లు పోటీ పడగా కేరళ జట్టు విజయం సాధించింది. ఉత్తరాఖండ్, దాద్రానగర్ హవేలి జట్లు పోటీపడగా ఉత్తరఖండ్ విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్, బీహార్ జట్లు పోటీపడగా బీహార్ విజయం సాధించింది. లీగ్ దశలో పోటీలు పూర్తవగా విజయం సాధించిన 16 జట్లు ప్రీ క్వార్టర్‌కు చేరుకున్నాయి. క్వార్టర్‌కు చేరుకున్న జట్లు లీగ్ దశ దాటడంతో సంబురాలు చేసుకున్నారు. ఏర్పాట్లపై రాష్ట్ర క్రీడాకారులు సంతృప్తి వ్యక్తం చేశారు. క్రీడలు చూడడానికి వచ్చిన మునిసిపల్ ఛైర్మన్ రాజనర్సు, ఓఎస్డి బాలరాజు, డిఇఒ రవికాంత్ మైదానంలో క్రీడాకారులను ప్రోత్సహించారు.

మూడో పెళ్లి కోసం రెండోభార్యకు వేధింపులు

మనతెలంగాణ, బోరబండ: ఇప్పటికే రెండు పెండ్లిళ్లు చేసుకొని ఇద్దరు భార్యలకు, ఆరుగురు సంతానం ఉన్నప్పటికీ మళ్లీ ముచ్చటగా 3వ పెళ్లి చేసుకొవడానికి రెడీ అయి ఒప్పుకోవాలంటూ రెండో భార్యను వేధింపులకు గురి చేస్తూ చితక బాధిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే బోరబండ సైట్ 3కు చెందిన మహమ్మద్ ఖాన్(38) భార్య ఉండగానే నాలుగు సంవత్సరాల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్య షమీనా బేగంకు (35) ముగ్గురు సంతానం. రెండవ భార్య రుక్సానా బేగంకు (28) ముగ్గురు సంతానం, పది రోజుల క్రితమే రెండో భార్యకు బాబు పుట్టాడు. ఈ క్రమంలో తాజాగా మూడవ వివాహం చేసుకుంటానని అందుకు అనుమతి పత్రంపై సంతకం చేయాలంటూ రెండవ భార్యను వేధించసాగాడు. సోమవారం ఉదయం ఈ విషయమై రెండో భార్యను బెల్టుతో బాదాడు. మూడవ వివాహానికి ఒప్పుకోకపోతే భవనంపై నుండి తోసేసి చంపేస్తానని బెదిరించసాగాడని బాధితురాలు మీడియా ముందు వాపోయింది. తనకు న్యాయం చేయాలంటూ బల్కంపేటలో ఉన్న తెలంగాణ ఉమెన్స్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థను ఆశ్రయించింది. దీంతో సంస్థ అధ్యక్షురాలు శ్రీలత, టి.లతని వెంట పెట్టుకొని ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిపి కేసు నమోదు చేయించారు.

ప్రభుత్వాసుపత్రిలో బాలింత మృతి



మన తెలంగాణ/కామారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు చేపడుతున్నది. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసూతి అయినవారికి నగదుతోపాటు కెసిఆర్ కిట్టును అందిస్తున్నది. అయితే కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రసవానికి వచ్చిన మహిళ సోమవారం ఉదయం మృతి చెందడంతో డాక్టర్ల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని ఆగ్రహిస్తూ బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో మూడు గంటలపాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బీబీపేట్ మండలం ఇస్సానగర్ గ్రామానికి చెందిన బి.నాగమణి (22) ప్రసవానికి ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో చేరారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన అనంతరం ఆదివారం ఆమెకు ఫిట్స్ రావడంతో పాటు బీపీ తగ్గడంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. పరిస్థితిని గమనించిన బంధువులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఐసియులోకి తరలించారు. ఐసియులో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందడంతో ఒక్కసారిగా ఆ మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధర్నాకు దిగారు. రెండు గంటల పాటు ప్రభుత్వ ఆసుపత్రి ముందు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించగా ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం తెలుసుకున్న డిఎస్పి లక్ష్మీ నారాయణ పోలీసు బలగాలతో ఆసుపత్రికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడి వారిని సముదాయించారు. ప్రభుత్వాసుపత్రిలో జరిగిన సంఘటనకు సంబంధించి కలెక్టర్ డా॥ఎన్.సత్యనారాయణ ఆరా తీసినట్లు తెలిసింది. పోలీసుల జోక్యంతో గొడవ సద్దుమనగడంతో ఆసుపత్రి సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

మతిస్థిమితంలేని యువతి ఆత్మహత్య



మన తెలంగాణ/బోయిన్‌పల్లి : బోయిన్‌పల్లి మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన తంగళ్ళపల్లి అనిత (26) అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం గత కొంతకాలంగా తనకు పెళ్లి కావడంలేదని తీవ్రమైన మనస్తాపానికి గురై 2 నెలల క్రితం మతిస్థిమితం కోల్పోయింది. జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయంలో తీసుకెళ్లి ఉంచినప్పటికీ నయం కాకపోవడంతో తిరిగి ఇంటికి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో తమ ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించే లోపు మార్గమధ్యలోనే చనిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిమిత్తం మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నిఘా నీడలో పల్లె....!

- అవసరమైన చోట్ల తనిఖీ కేంద్రాలు
- గ్రామాల్లోకి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం
- పంచాయతీ ఎన్నికల వ్యయం,కోడ్ అమలుపై ప్రత్యేక నిఘా



మన తెలంగాణ/పెద్దశంకరంపేట : శాసనసభ ఎన్నికలను తలపించేలా పంచాయతీ ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. డబ్బులు, మద్యం ఏరులై పారకుండా ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా నిఘా పెడుతున్నారు. దీనికితోడు విచ్చలవిడిగా ఖర్చులు చేస్తే కేసులు నమోదు చేసేందుకు క్షేత్రస్థాయిలోనూ బృందాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తన నియామవళి అమలుపై మండలానికో ప్రత్యేక బృందాన్ని నియమించనున్నారు. మూడు విడతలుగా జరిగే మెదక్ జిల్లాలో 20 మండలాలున్నాయి. వేర్వేరుగా పోలింగ్ జరిగే మండలాల్లో ఇప్పటి నుంచే నిఘా నేత్రాలకు సంబంధించిన సభ్యులను నియమించారు.
పంచాయతీ ఎన్నికల వేడి రాజుకుంది. ఆదివారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఆయా గ్రామాల్లో సమావేశాలు అరంభమయ్యాయి. సోమవారం నాడు నారాయణఖేడ్ నియోజకవర్గ శాసనసభ్యులు భూపాల్ రెడ్డి పెద్దశంకరంపేట మండలంలోని పది గ్రామ పంచాయతీలలో సుడిగాలి పర్యటన చేసి అధికార పార్టీ బలపర్చిన అభ్యర్థులనే గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరో వైపు పోలీసులు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా మొదట గత చరిత్ర అధారంగా జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. ఇక్కడ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల మధ్య ఎలాంటి గ్రూపు తగాదాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. మొదటి దశ ఎన్నికలు నిర్వహించే 6 మండలాల్లో మొత్తం 1,364 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇందులో అత్యంత సున్నితంగా 22 గ్రామ పంచాయతీలు గుర్తించారు. అత్యంతర సమస్యాత్మకంగా మరో 31 పంచాయతీలు, సమస్యాత్మకంగా 42 పంచాయతీలను గుర్తించారు. మొదటి దశ పోలింగ్ ఈ నెల 21న జరుగనుంది. పార్టీ రహితంగానే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నప్పటికీ ఆయా పార్టీల ప్రభావం అన్ని గ్రామాల్లోను కనిపిస్తోంది. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు స్టాటిస్టిక్ సర్వేలేన్స్ టీంలను కూడా ఏర్పాటు చేశారు. ఇందులో ఒకరు పోలీస్ శాఖ తరపున, మరొకరు రెవెన్యు శాఖ తరపున ఉంటారు. తనిఖీ చేసేటప్పుడు వీడియోలో పూర్తి తతంగం చిత్రీకరిస్తారు. మొన్న నామినేషన్ల రోజున కూడా ఈ వీడియోలతో మండల కార్యాలయాల వద్ద ఉండి టీం సభ్యులు అభ్యర్థి ఎంత మందిని తీసుకొచ్చారు. ఏయే వాహనాలలో వచ్చారు... ఏ రకం వాహనాలు తీసుకొచ్చారు... అనే విషయాలని వీడియోలో చిత్రీకరించారు. అలాగే రోడ్డుపై తనిఖీ లు నిర్వహించేటపుడు ప్రధానంగా మద్యం, నగదు రవాణాపై వీరు ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. తనిఖీలో పట్టుబడిన నగదుకు సరైన రశీదులు చూపించాల్సిందే. లేకపోతే నగదును జప్తు చేసి కోర్టుకు సమర్పిస్తారు. దీంతోపాటు ప్రచారం, ఎన్నికల సమయంలో ఇరువర్గాల మధ్య హోరాహోరి ఉంటుంది. ఎలాగైనా ప్రత్యర్థిపై పై చేయి సాధించాలనే ఉద్దేశంతో ముందుకు వెళుతుంటారు. ఈ క్రమంలో చిన్నపాటి గొడవలు చోటు చేసుకునే అవకాశముంది. గ్రామంలో గత ఎన్నికల సమయంలో జరిగిన ఘటనల ఆధారంగా పోలీసులు సదరు గ్రామాలను సున్నిత, సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలుగా మూడు వర్గాలుగా విభజించారు. ఇటీవల శాసనసభ ఎన్నికల సమయంలోనూ ఇదే విధానం అవలంభించి అక్కడా గట్టి బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసులు తీసుకున్న ముందస్తు చర్యల వల్ల గత శాసనసభ ఎన్నికలలో ఎక్కడా గొడవలు జరగలేదు. ఇదే విధానం పంచాయతీ ఎన్నికలలో అవలంభించనున్నారు. పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖతోపాటు పంచాయతీరాజ్ శాఖ కూడా సన్నద్ధమవుతోంది.

ప్రలోభాలను కట్టుదిట్టం చేసే ప్రత్యేక బృందం

స్టాటిస్టిక్ సర్వేలెన్స్ టీంలు కేంద్రాల వద్ద తనిఖీ చేస్తుండగా, గ్రామాల్లో పర్యటించేందుకు మండలానికో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు. వీరు వాహనంలో మండలం మొత్తం పర్యటిస్తారు. ఎక్కడైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే వాలిపోతారు. నగదు, మద్యంతోపాటు ఓటర్లను చేరవేసేందుకు ఏదైనా పంపిణీ చేస్తే కేసులు నమోదు చేస్తారు. దినమంతా వీరు పంచాయతీల వారీగా తిరుగుతుంటారు. వీరితో ఒక ప్రత్యేక వీడియోగ్రాఫర్ కూడా ఉంటారు. ఏదైనా ఘటన వారికి కనిపిస్తే అక్కడే చిత్రీకరిస్తారు.

పదవుల కోసం పైసల్ రెడీ



- ఆస్తులమ్ముకుంటున్న ఆశావహులు
- రూ.లక్షలు రెడీ చేసుకుంటున్న అభ్యర్థులు

మన తెలంగాణ/మహాముత్తారం : ఏమిరా లచ్చన్నా... సర్పంచికి పోటీ చేత్తనంటివి గదరా... అవున్రా మల్లన్నా.. ఏం చేయాల్రా పైసలుంటేనే ఓట్లు రాల్తయిరా.. ఇయ్యాలా రేపు పైసల్లేకుంటే ఓట్లేవ్వడేస్తున్నడూ... మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లాగా సారూ! ఓటుకు వెయ్యిచ్చి చీర, సారె, టీ షర్టులు, మందు ఇచ్చిండు కదా... మనం కూడా ఇవ్వన్నీ ఇయ్యకుంటే ఓట్లు రావురా లచ్చన్నా.. మరి పైసలెట్లరా.. ఏమున్నదిరా మా తాత సంపాయించిన గా పోలారం కట్ట కింద ఉన్న అందూరు పొలం అమ్మకానికి పెట్టిన్రా.. అయ్యోగంత పని చేస్తివారా.. అవున్రా మరి మనకేమో సీటు కలిసొచ్చే.. అందుకేరా పొలం అమ్ముతున్నా.. ఎకరానికి 10లక్షలు మాట్లాడుకున్నరా.. ముందుగా 5లక్షలు బయానా ఇచ్చిండు.. తతిమ్మయి ఓట్లకు ముందు రోజు ఇత్తనన్నడు.. ఇగ గా పైసలచ్చిందంటే చల్లుడే గెలుసుడేరా...అసెంబ్లీ ఎన్నికల్లాగానే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ అశావహులు పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేసే పరిస్థితులు నెలకొన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఆయా మండలాల్లో సర్పంచ్, ఉప సర్పంచ్ పదవిని దక్కించుకునేందుకు పోటీకి సిద్ధమైన ఆశావహులు పోటీపోటీగా డబ్బు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం తాతముత్తాతల నాటి ఆస్థులను కూడా అమ్మేందుకు వెనకాడడం లేదు. ఇప్పటికే మహాముత్తారం మండలంలోని ఓ గ్రామ పంచాయతీకి చెందిన ఒకరు ఎకరం భూమిని అమ్ముకున్నాడు. మరొకరు అమ్మకానికి పెట్టాడు. చాలా మంది ఇంట్లో నిల్వ ఉన్న బంగారాన్ని బ్యాంకుల్లో పెట్టి అప్పులు తీసుకుంటున్నారు. మరి కొంతమందైతే వందకు రూ.3 నుంచి రూ. 5వరకు వడ్డీ వ్యాపారుల నుంచి డబ్బులను వడ్డీకి తీసుకుంటున్నారు. గ్రామంలో సర్పంచ్ పదవికి గౌరవం ఉండడంతో గ్రామంలో రిజర్వేషన్, జనాభాను బట్టి సర్పంచ్ పదవికి రూ.5లక్షల నుంచి రూ.15లక్షల వరకు ఖర్చు పెట్టేందుకు ఆశావహులు నిధులు సమకూర్చుకుంటున్నారు. ఈసారి సర్పంచ్‌తోపాటు ఉప సర్పంచ్ పదవికి కూడా చెక్‌పవర్ ఉండడంతో వార్డు మెంబర్‌గా ఎన్నికై ఉప సర్పంచ్ అయ్యేందుకు అభ్యర్థులు డబ్బులు ఖర్చు పెట్టేందుకు వెనకాడటం లేదు. దీంతో గ్రామాల్లో డబ్బు, మద్యం ఏరులై పారనుంది. అయితే ఇదంతా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటుకు నోటు పంచడం వల్లనే స్థానిక సంస్థల ఎన్నికల్లో చిక్కొచ్చిపడింది.

డబ్బులుంటేనే అభ్యర్థికే మద్దతు..!

గ్రామంలో డబ్బులున్న వారికే మద్దతు పలుకుతున్నారు. సర్పంచ్‌గా నిలబడతానంటే నీ దగ్గర డబ్బులెన్ని ఉన్నాయి.. బ్యాంకు అక్కౌంట్‌లో నిల్వ ఎన్ని ఉన్నాయంటూ ఆరా తీస్తున్నారు. అన్ని పార్టీల నాయకులు కూడా పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులకు మద్దతు తెలిపే విషయంలో స్థానికంగా ఆ వ్యక్తికి ఉన్న మంచి పేరుతోపాటు అతను ఎంత డబ్బు ఖర్చు పెట్టగలడు అన్నదే చూస్తున్నారు. ఖర్చు భరించే వారినే అభ్యర్థులుగా ఎంపిక చేసేందుకు ఆయా పార్టీల మండల స్థాయి నాయకులు కసరత్తు చేస్తున్నారు. పార్టీలో క్రియాశీలకంగా పని చేసిన కార్యకర్త అయినప్పటికీ సర్పంచ్‌గా గెలిచేందుకు ఆర్థిక స్థోమత లేకపోతే పార్టీ వర్గాలు మద్దతు తెలిపేందుకు ఆలోచిస్తున్నాయి. సామాజిక వర్గ సమీకరణలు, ప్రజాదరణతోపాటు ఆర్థిక బలమున్న వారి కోసమే పార్టీలు అన్వేషిస్తున్నాయి.

నిబంధనలేం చెప్తున్నయంటే..!

అభ్యర్థులు చేసే ఖర్చు ఎన్నికల సంఘం విధించిన పరిమితి ఖర్చుతో పోలిస్తే 10 రెట్లు ఎక్కువగా కన్పిస్తోంది. ఆశావహులు తమ అభ్యర్థిత్వాలు ఖరారు కాకముందే గ్రామాల్లో నిత్యం సమావేశాలు, దావత్‌ల పేరిట వేలల్లో ఖర్చు పెడుతున్నారు. రిజర్వుడ్ పంచాయతీలతో పోలిస్తే జనరల్ పంచాయతీల్లో ఎక్కువ మొత్తంలో డబ్బు ఖర్చయ్యే పరిస్థితి కనిసిస్తోంది. ఆర్థికంగా కొంత ఉన్న నేతలు నిధుల సమీకరణకు పెద్దగా ఇబ్బందులు పడకున్నా.. ప్రజాదరణ ఉండి కొన్ని పంచాయతీల్లో భూమి, ఇల్లు కాగితాలు తాకట్టు పెట్టి డబ్బులు సమకూర్చుకుంటున్నారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం సర్పంచ్‌కు 5వేల లోపు జనాభా గల గ్రామ పంచాయతీలో రూ. 1.50 లక్షలు, వార్డు మెంబర్‌కు రూ. 30వేలు, 5వేల జనాభా దాటితే రూ.2.50 లక్షలు, వార్డు మెంబర్‌కైతే రూ. 50వేలు ఖర్చు చేయాలని నిర్ణయించింది. కానీ దీనికి విరుద్దంగానే అభ్యర్థులు ఖర్చు చేసేందుకు సన్నద్ధమయ్యారు.



పట్టపగలే వ్యక్తి దారుణ హత్య

మన తెలంగాణ/మిర్యాలగూడ రూరల్: పట్ట పగలే ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా కంభంకు చెందిన దూదేకుల ఖాసీం(40)గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైళ్లలో తిరుగుతూ సమోసాలు అమ్మేవాడు. ఖాసిం మిర్యాలగూడలోని రైల్వేస్టేషన్‌కు సమీపంలో రవీంద్రనగర్‌కు చెందిన గౌర్రె సైదయ్య తయారు చేసి విక్రయించే సమోసాలను సేకరించి రైళ్లల్లో అమ్మేవాడు. ఈ క్రమంలో ఖాసింకు గౌర్రె సైదయ్య మేనల్లుడైన సిద్ధుతో పరిచయం ఏర్పడింది. సోమవారం మిర్యాలగూడకొచ్చిన ఖాసిం గౌర్రె సైదయ్య ఇంటికెళ్లాడు. ఇంట్లో సైదయ్య లేకపోగా, సిద్ధు తారాసపడ్డాడు. ఇంట్లో ఎవరు లేరని ఖాసిం, సిద్ధులు ఆ ఇంట్లోనే మద్యం సేవించేందుకు ఉపక్రమించారు. మధ్యలో మద్యం అయిపోవడంతో సిద్ధు మద్యం తెచ్చేందుకు బయటకెళ్లాడు. ఈలోగా గుర్తు తెలియని వ్యక్తులు సైదయ్య ఇంట్లో ఉన్న ఖాసింను మారణాయుధాలతో హతమార్చారని పోలీసుల అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఖాసిం వెంట మద్యం సేవించిన సిద్ధును అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. విషయం తెలుసుకున్న రూరల్ సిఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు. మృతుడు ఖాసింపై గతంలో పలు దొంగతనం కేసులు నమోదైన్నట్లు సమాచారం.



చిరుతను చంపిన వేటగాళ్ల అరెస్ట్




మనతెలంగాణ/మాక్లూర్ : నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మామిడిపల్లి అటవీ ప్రాంతంలో సోమవారం ముగ్గురు వేటగాళ్లు చిరుతపులిని చంపివేసినట్లు, విచారణ అనంతరం నిందితులను అరెస్టు చేసినట్లు ఫారెస్ట్ అధికారి రాములు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సోమవారం విధుల్లో భాగంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు మామిడిపల్లి అటవీ ప్రాంతంలో సంచరిస్తుండగా చిరుతపులి కళేబరాన్ని గమనించి అధికారులకు తెలియజేశారు. దీంతో హుటాహుటిన అధికారులు అక్కడికి చేరుకొని విచారణ చేపట్టగా ఘటనా స్థలంలో మద్యం బాటిళ్లు, గుట్కా ప్యాకెట్లు దొరికాయి. దీంతో అధికారులు జాగిలాల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. జాగిలాలు ముగ్గురు అనుమానితులను గుర్తించడంతో వారిని విచారించగా నేరాన్ని అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నేరస్థులు గుత్పతండాకు చెందిన రవి, వివేక్, శ్రీనివాస్‌గా గుర్తించామని, పులిని చంపడానికి ఉపయోగించిన గొడ్డలి, వేటకొడవలితోపాటు పులి మూడు దంతాలు, ఏడు గోర్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఫ్ఒ రాములు తెలిపారు. పశువైద్యాధికారి కిరణ్‌కుమార్ దేశ్‌పాండే సహాయంతో చిరుతపులి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అనంతరం ఫారెస్టు అధికారులు చిరుత కళేబరాన్ని దహనం చేశారు. కేసు విచారణలో ఆర్మూర్ రేంజ్ అధికారిణి అమృతమ్మ, వాసుదేవ్, కమ్మర్‌పల్లి, సిరికొండ రేంజ్ అధికారులు, బాల్కొండ ఎఫ్ఎస్ఓ సౌమ్య, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, ఫారెస్టు అధికారి శశిధర్, మాక్లూర్ ఎస్ఐ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



దృశ్యరూపం.. ఆసక్తికరం..!

- తెరపై బోధనతో సత్ఫలితాలు
- విద్యార్థుల్లో నూతనోత్తేజం
- సంతోషపడుతున్న విద్యార్థులు



మనతెలంగాణ/ నిజామాబాద్ రూరల్ : చదవడం, వినడంకంటే దృశ్యరూపంలో చూసిన అంశాన్ని ఎక్కువ కాలం గుర్తు పెట్టుకునే అవకాశం ఉంటుంది. విద్యాబోధనలో ఈ సూత్రమే అత్యంత కీలకం. మారుతున్న కాలానికి అనుగుణంగా బోధనలోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అందుబాటులోని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ, తెరపై బోధనతో ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి.
దీంతో ఈ తరహా విధానం ప్రభుత్వ బడుల్లోనూ అమలు చేస్తున్నారు. సర్కారు బడుల బలోపేతానికి నూతన బోధన దోహదం చేస్తుంది. కార్పొరేట్ విద్యాసంస్థలకే పరిమితమైన తెరపై పాఠ్యాంశాల బోధన నేడు మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోను కనిపిస్తోంది. ప్రైవేటు బడులకు ఏ మాత్రం తీసిపోకుండా సాగుతున్న బోధనలో విద్యార్థుల్లో నూతన ఉత్తేజం కనిపిస్తోంది. విద్యార్థుల ఉజ్వల భవితకు ఈ బోధన దోహదపడుతుంది. దశల వారిగా తెరపై బోధనకు ప్రభుత్వ పాఠశాలల్లోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విధానాన్ని కొన్ని పాఠశాలల్లో అమల్లోకి తెచ్చారు. ఈ విధానాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, దృశ్యరూపం, యానిమేషన్ చిత్రాల ద్వారా బోధనతో విద్యార్థులు పాఠ్యాంశాలను ఆసక్తితో నేర్చుకోవడంతోపాటు ఎక్కువ కాలం గుర్తు పెట్టుకుంటున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

మెరుగైన ఫలితాలకు తోడ్పాటు

చదివిన, విన్న అంశాల కంటే చూసిన విషయాన్ని ఎక్కువ కాలం గుర్తుంచుకునే అవకాశం ఉంది. రోజు తరగతి గదిలో చెప్పిన పాఠ్యాంశాల కన్నా డిజిటల్ తరగతిలో తెరపై చూపిన అంశాలే విద్యార్థులకు ఎక్కువగా గుర్తుంటాయని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు.
మారుతున్న కాలానికి అనుగుణంగా ఇటువంటి బోధన చేపడతుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో సైతం మెరుగైన ఫలితాల సాధనకు అవకాశం ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లోని ఆంగ్ల మాధ్యమ విద్యార్థులకు మరింతగా ఈ విధానం ఉపయోగపడుతుంది.

అప్పటికి, ఇప్పటికి ఎంతో తేడా

గతంలో సాగిన బోధనకు భిన్నంగా ఇప్పుడు డిజిటల్ విధానంలో తరగతులు జరుగుతున్నాయి. గతంలో భౌతిక, రసాయన, జీవశాస్త్రాల పాఠ్యాంశాలకు సంబంధించిన బొమ్మలను ఉపాధ్యాయులు నల్లబల్లపై వేసి విద్యార్థులకు వివరించేవారు. దీనివల్ల తెలివైన విద్యార్థులకు మినహా మిగిలిన వారికి అర్థం కావడానికి ఎక్కువ సమయం పట్టేది. డిజిటల్ బోధన అందుబాటులోకి రావడంతో కష్టాతరమైన అంశాలను విద్యార్థులంతా సులువుగా అర్థం చేసుకుంటున్నారు. తెరపైకి కనిపించే బొమ్మల ఆధారంగా బోధన సాగుతుండడంతో విద్యార్థుల్లో ఆసక్తి పెరిగి త్వరగా నేర్చుకుంటున్నారు.

హరీశ్‌రావు సంక్రాంతి శుభాకాంక్షలు



మన తెలంగాణ / సిద్దిపేట ప్రతినిధి : సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాష్ట్ర, సిద్ధిపేట జిల్లా ప్రజలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల సంపదలతో సంక్రాంతి పర్వదినాన్ని కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందంగా కన్నుల పండుగగా జరుపుకోవాలన్నారు. ఈ సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కెసిఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని ప్రజలు మరోమారు టిఆర్ఎస్‌కే పట్టం కట్టి అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు త్వరలోనే పూర్తయి రాష్ట్రం కోటి ఎకరాల మాగాణిగా మారబోతుందన్నారు.

కాళేశ్వరంలో ప్రముఖుల పూజలు



మన తెలంగాణ / కాళేశ్వరం : దక్షణ శైవక్షేత్రంగా పేరుగాంచిన కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ గంటా చక్రపాణి, ప్రెస్ అకాడమి చైర్మన్ అల్లం నారాయణ, భూపాలపల్లి ఓఎస్డి సురేష్‌కుమార్, కరీంనగర్ జాయింట్ కలెక్టర్ శ్రీరాం ప్రసాద్ మంథని ఆర్డీఓ నాగేష్‌లు స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు శ్రీ వారి చిత్ర పటాన్ని బహూకరించారు.

రెండు తలలతో లేగదూడ జననం.. మృతి



మన తెలంగాణ / ఆదిలాబాద్: ఆదిలాబాద్ మండలంలోని పిప్పల్‌ధరి గ్రామ పంచాయతీ పరిధిలోని దహిగూడలో ఓ ఆవుకు రెండు తలలతో లేగ దూడ పుట్టింది. ఆదివారం రాత్రి రైతు కొడప భీంరావ్‌కు చెందిన ఆవు ఆదివారం రాత్రి లేగ దూడను ప్రసవించే క్రమంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. సోమవారం ఉదయం పశువైద్యాధికారి భీంరావ్‌కు సమాచారం అందించడంతో ఆయన హుటహుటిన గ్రామానికి చేరుకుని చికిత్స అందించారు. దీంతో రెండు తలలున్న లేగ దూడకు జన్మనిచ్చింది. ఈ అరుదైన సంఘటనను చూసేందుకు గ్రామస్థులు భారీ ఎత్తున తరలివచ్చారు. అయితే జన్యులోపంతో ఇలా పుట్టడం సహజమని పశువైద్యాధికారి చెప్పారు. లేగ దూడ పుట్టిన కొన్ని గంటలకే మృత్యువాత పడడంతో రైతుతోపాటు గ్రామస్థులు అయ్యో పాపం అంటూ సానుభూతి వ్యక్త పరిచారు. ఇలాంటి జన్యులోపంతో పుట్టిన లేగ దూడలు బతకాడం చాలా అరుదని 100 కేసుల్లో ఒకటి రెండు బతుకుతాయని పేర్కొన్నారు.

బేస్ క్యాంపు పని తీరు భేష్



మనతెలంగాణ/జన్నారం: కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో మహ్మదాబాద్ బీట్‌లో గల గ్రాస్ ప్లాట్‌ను సోమవారం నిర్మల్ ఎఫ్‌డిపిటి డైరెక్టర్ శరవనన్ సందర్శించారు. మల్యాల్‌వెస్టు బీటులో గల గ్రాస్‌కటార్‌తో కటింగ్ చేయడాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా మల్యాల్ బీట్‌లోని జంతుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాట్లు చేసిన వంకతుమ్మ కుంటను పరిశీలించి బీట్‌లో ఉన్నచెట్లు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మల్యాల్ ఈస్ట్ బీట్‌లో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ పంపింగ్ తీరును చూశారు. అనంతరం మల్యాల అడవిలో ఏర్పాటు చేసిన బేస్ క్యాంపు శిబిరాన్ని సందర్శించి వారు రాత్రి పగలు అనే తేడా లేకుండా అటవీ ప్రాంతంలో చేస్తున్న పనులు వివరాలను స్వయంగా వారినే ఎఫ్‌డిపిటి డైరెక్టర్ శరవనన్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బేస్ క్యాంపు సిబ్బంది పని తీరుపట్ల సంతృప్తి చెందారు. ఆయన వెంట ఉన్న వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఎస్‌పిరెడ్డి మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు సంతృప్తి ఇస్తున్నాయని, అడవిలో ఉన్న జంతువులను కంటికి రెప్పలా కాపాడుకుంటే అటవీ అంతరించిపోకుండా ఉంటుందన్నారు. వారి వెంట స్థానిక ఎఫ్‌డిఓ రవీందర్‌గౌడ్ తాళ్లపేట రేంజ్ ఆఫీసర్ దేవిదాస్, మహ్మదాబాద్ సెక్షన్ ఆఫీసర్ జాదవ్ గోపాల్ సింగ్, బీట్ ఆఫీసర్లు బేగ్, ప్రనిత్, లాల్‌బాయి, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

జైనూర్‌లో యువకుని ఆదృశ్యం



మనతెలంగాణ/ జైనూర్ : జైనూర్ మండల కేంద్రానికి చెందిన సయ్యద్ వసీం (22) గత రెండు మాసలుగా కనపించడం లేదని బాధితులు జైనూర్ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. జైనూర్‌కు చెం దిన వసీం సంవత్సరం కాలంగా నన్నూర్ మండలంలో పనిచేస్తున్నాడు. అయితే 2018 అక్టోబర్ మాసం నుంచి కనిపించడం లేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తండ్రి అక్బర్ పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా అతని ఫోన్ పనిచేయగా, వారం రోజుల నుంచి ఫోన్ స్వీచ్‌ఆఫ్ వస్తుందని, దీంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు జైనూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సిఐ సాధిక్ పాషా తెలిపారు. సమాచారం తెల్సినవారు 9440900662,9440900636 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

బావిలోపడి బాలుడి మృతి



మనతెలంగాణ/జన్నారం: జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన నర్సింహ(12) అనే విద్యార్థి ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలో గల బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ తహిసినోద్దీన్ తెలిపారు. జన్నారంలో లిటిల్‌హాన్స్‌లో 6వ తరగతి చదువుతున్న నర్సింహ తోటి విద్యార్థులతో కలిసి కస్తూర్బా పాఠశాల సమీపంలో క్రికెట్ ఆడుతుండగా బాలు ఎగిరి దూరంలోకి వెళ్లగా పరుగెత్తుకుంటూ వెళ్లిన నర్సింహా బావిలో పడి మృతి చెందాదని తెలిపాడు. మృతి తండ్రి మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

769 పంచాయతీలు ఏకగ్రీవం

- **10,654 వార్డులు కూడా**
- **సర్పంచ్ పదవికి 12,202 మంది, వార్డులకు 70,094 అభ్యర్థుల పోటీ**
- **21న మొదటి విడత పోలింగ్**



మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో మొదటి విడతలో జరగాల్సిన 4468 పంచాయతీల్లో 769 పంచాయతీలకు సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. అలాగే 39,616 వార్డులకు గాను 10,654 వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లాల వారీగా దాఖలైన నామినేషన్లు, స్క్రూటిని, తిరస్కరణ, ఉపసంహరణ అనంతరం ఒకే పంచాయతీకి సర్పంచ్ పదవికి ఒకే నామినేషన్ వచ్చిన వాటిని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఇందులో అత్యధికంగా నిర్మల్ జిల్లాల్లో 57 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, అత్యల్పంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో 4 పంచాయతీలు మాత్రమే ఏకగ్రీవమయ్యాయి. మొదటి విడతలో ఒకటి కంటే నామినేషన్లు ఎక్కువగా దాఖలైన పంచాయతీల్లోని సర్పంచ్, వార్డు మెంబర్ పదవికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 21వ తేదీన ఎన్నిక నిర్వహించనుంది. నిబంధనల ప్రకారం ఏకగ్రీవం పూర్తయిన తరువాత మొదటి విడతలో 3701 పంచాయతీలకు, 28,976 వార్డులకు ఎన్నిక నిర్వహించనున్నారు. ఇందులో సర్పంచ్ పదవికి 12,202 మంది అభ్యర్థులు, వార్డు సభ్యుడి పదవికి 70,094 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. పోటీ ఉన్న పంచాయతీలలో నామినేషన్లను ఉపసంహరణ చేయించేందుకు స్థానిక రాజకీయ నాయకులు తమవంతు ప్రయత్నాలు చేసి కొన్నింటిని ఏకగ్రీవం చేయడంలో సఫలీకృతలయ్యారు. దీంతో దాదాపు అన్ని జిల్లాల్లో డబుల్ డిజిట్‌లోనే సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యారు. మొదటి విడతలో మొత్తం 4479 పంచాయతీలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వగా, అందులో 4468 పంచాయతీల్లోనే సర్పంచ్ పదవికి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

పదకొండు పంచాయతీల్లో నామినేషన్లు వేయకపోవడం, వేసినా అవి నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో తిరస్కరణకు గురయ్యాయి. అందువల్ల ఈ 11 చోట్ల ఎన్నికలు జరగడంలేదు.

ఎక్కువ జిల్లాల్లో త్రిముఖ పోటీ

రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉంది. కొన్నిచోట్ల నలుగురు చొప్పున పోటీలో ఉన్నారు. కామారెడ్డి, జగిత్యాల్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, మహబూబ్‌నగర్, సంగారెడ్డి జిల్లాల్లో పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల పదవికి పోటాపోటి ఉంది. మొదటి విడతలో కామారెడ్డిలో 133 పంచాయతీ సర్పంచ్‌లకు 688 మంది పోటీ పడుతున్నారు. సిద్దిపేటలోనూ 165 స్థానాలకు, 697 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. సంగారెడ్డిలో 235 పంచాయతీల సర్పంచ్ పదవికి గాను ఇక్కడ 764 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. అంటే ఒక్కో పంచాయతీకి సగటున ముగ్గురు నుంచి నలుగురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అలాగే ఇక్కడ 2080 వార్డులకు గాను 5874 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. అలాగే మేడ్చల్ మల్కాజ్‌గిరిలో 29 పంచాయతీ స్థానాలకు 111 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఆదిలాబాద్, కొమురం భీం, మంచిర్యాల్, నిర్మల్ జిల్లాల్లో ఒక్కో స్థానానికి నలుగురు చొప్పున పోటీ పడుతున్నారు.

జిల్లాల వారీగా ఏకగ్రీవమైన పంచాయతీలు, వార్డుల సంఖ్య

జిల్లా పేరు	సర్పంచ్‌లు	వార్డులు
ఆదిలాబాద్	50	592
ఆసిఫాబాద్	18	335
మంచిర్యాల్	08	192
నిర్మల్	57	574
జగిత్యాల్	10	318
కరీంనగర్	04	200
పెద్దపల్లి	04	166
సిరిసిల్ల	13	188
కొత్తగూడెం	22	321
ఖమ్మం	21	275
గద్వాల	30	354
మహబూబ్‌నగర్	44	681
నాగర్‌కర్నూల్	37	372
వనపర్తి	18	224
మెదక్	32	415
సంగారెడ్డి	23	318
సిద్ధిపేట	21	317
నల్లగొండ	52	655
సూర్యాపేట	18	288
భువనగిరి	22	241
కామారెడ్డి	31	484
నిమామాబాద్	36	236
మేడ్చల్	04	40
రంగారెడ్డి	20	234
వికారాబాద్	34	460
జనగాం	18	264
భూపాలపల్లి	33	377
మహబూబాద్	36	433
వరంగల్ రూరల్	45	442
వరంగల్ అర్బన్	10	138
మొత్తం	**769**	**10,654**

ఎన్నికల నియమావళి, నిబంధనలు





మన తెలంగాణ/హుజూరాబాద్ టౌన్: గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించనున్నారు. అయితే ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్ వార్డు సభ్యులకు ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనలు తెలుసుకోవడం తప్పనిసరి. ఎన్నో ఏళ్లుగా సర్పంచ్ పదవీ కోసం ఎదురు చూస్తూ స్వంత డబ్బులు ఖర్చు చేసి పార్టీ మీటింగ్‌లకు, జనాలను తీసుకుపోయి రిజర్వేషన్ల కారణంగా అవకాశం రాని వారు ఈ ఎన్నికల్లో అవకాశం వస్తే పోటీ చేసే ఆనందంలో నిబంధనలు మరిచిపోతే అంతే సంగతులు. గ్రామాల్లో పంచాయతీ పోటీచేస్తున్న వారు ఈ నిబంధనలు తెలుసుకోవడం ఆవశ్యకం.

– నిబంధనలు

- సర్పంచ్‌గా, వార్డు సభ్యుడిగా పోటీ చేసే వారి పేరు గ్రామ ఓటరు జాబితాలో తప్పనిసరిగా ఉండాలి.
- ఇంటి పన్ను వందశాతం చెల్లించి ఉండాలి, సంబంధించిన పన్ను రశీదు తప్పనిసరిగా ఉండాలి
- కుల ధృవీకరణ పత్రం ఏ సామాజిక వర్గానికి చెందిన వారో తెలిపే పత్రం ఉండాలి.
- పోటీ చేసే అభ్యర్థికి ఇరవై ఒక్క ఏండ్లు నిండిన వారై ఉండాలి
- సర్పంచ్‌కు పోటీ చేసేందుకు ఎస్సి, ఎస్టిలకు రూ.1000, ఇతరులు రూ.2వేలు చెల్లించాలి
- వార్డు సభ్యునికి ఎస్సి, ఎస్టి రూ.250, ఇతరులకు రూ.500 చెల్లించాలి
- ఏదైనా కోర్టు శిక్షలు పడిన వ్యక్తి ఐదేళ్ల వరకు పోటీ చేయరాదు, కోర్టు స్టే ఉంటే మాత్రం పోటీ చేయవచ్చు
- ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారు పోటీ చేయరాదు.
- 1995, మే 31కంటే ముందు పుట్టిన వారు ముగ్గురు సంతానం ఉన్నా పోటీ చేయవచ్చు
- ప్రభుత్వ ఉద్యోగం ఉన్న వారు పోటీ చేయరాదు, పోటీ చేయాలంటే ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది.
- రేషన్ డీలర్లు ఎన్నికల్లో పోటీ చేయవచ్చు, సుప్రీం కోర్టు 14189/2006తీర్పు ప్రకారం పోటీలో నిల్చునే వీలుంది.
- ఒక వ్యక్తి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించవచ్చు, సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థికి గ్రామాల్లో ఓటు హక్కు కల్గిన వ్యక్తి బలపరచాలి.
- వార్డుసభ్యునిగా పోటీ చేసే వ్యక్తికి ఆ వార్డులో ఓటు హక్కు కల్గిన వ్యక్తి బలపరచాల్సి ఉంటుంది.
- నామినేషన్ పత్రాలను సమర్పించేందుకు లోనికి ముగ్గురు మాత్రమే వెళ్లేందుకు అనుమతి ఉంటుంది
- డిక్లరేషన్ తప్పనిసరి పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్లతోపాటు వ్యక్తిగత డిక్లరేషన్లు తప్పనిసరిగా అందించాలి
- ఏదైనా సమాచారం దాచిపెడితే శిక్షార్హులవుతారు. కానీ నామినేషన్ పత్రాన్ని తొలగించరు.
- ఎవరైనా మతిస్థిమితం లేని వ్యక్తులు అని ఆధారాలతో నిరూపిస్తే అనర్హత వేటు పడుతుంది. నామినేషన్ వేసే వ్యక్తి ప్రతిపాదికుడిగా ఉన్న వారి సంతకాలను ఫోర్జరీ చేసినట్లు రిటర్నింగ్ అధికారి నిర్ధారణకు వస్తే నామినేషన్లు తిరస్కరిస్తారు.

పల్లెల్లో ఐక్యతా రాగం

- **గ్రామ స్వరాజ్యం కోసం నడుం బిగిస్తున్న యువత**
- **గులాబీని భుజానేసుకుంటున్న పల్లెలు**
- **వరంగల్ రూరల్‌లో ఇప్పటికే 51 ఏకగ్రీవ పంచాయతీలు**

మన తెలంగాణ/ వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి : పల్లెల్లో ఐక్యతారాగం జోష్‌లో ఉంది. గులాబీని భుజానేసుకొని పల్లెలన్నీ ఏకగ్రీవం వైపుగా ముందుకు సాగాయి. వరంగల్ రూరల్ జిల్లా పరిధిలో 16 మండలాలు, 401 గ్రామ పంచాయతీలున్నాయి. మూడు విడుతలుగా జరుగనున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండవ విడత ముగిసిన విషయం విధితమే. అయితే జిల్లా పరిధిలోని రెండవ విడతలో ఏకగ్రీవ గ్రామ పంచాచతీలుగా 51 గ్రామాలు చేరాయి. దీంతో పల్లెల్లో గులాబీ జోష్ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలు ముగిసి జిల్లాలోని మూడు నియోజకవర్గాలైన పరకాల, నర్సంపేట, వర్ధన్నపేటలో గులాబీ అభ్యర్థులు గెలుపొందటం, రాష్ట్రంలోనూ గులాబీ పార్టీ రెండోసారి అధికారం చేపట్టడంతో గ్రామ పంచాయతీ ఎన్నికలలోనూ గ్రామాలన్నీ గులాబీ జోష్‌తో కనిపిస్తున్నాయి. జిల్లాలో మొదటి విడుతలో ఐదు మండలాలు, రెండవ విడుతలో ఆరు మండలాలు ఎన్నికల ప్రక్రియలో ఉండగా మిగిలిన ఐదు మండలాలు మూడవ విడుతలో ఉన్నాయి. రెండవ విడుతలో పరకాలలో 9, నర్సంపేటలో 13, వర్ధన్నపేట నియోజకవర్గంలో వర్ధన్నపేట, పర్వతగిరి, ఐలవోని మండలాల్లో 27 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. సంక్రాంతితోపాటు ఏకగ్రీవంతో ఆయా గ్రామాలలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

ఎన్నికలలో యువత

పంచాయతీ ఎన్నికలలో యువతం అధికసంఖ్యలో పాల్గొనటం విశేషం. జిల్లాలోని పర్వతగిరి మండలంలాంటి చోట 16 మంది ఏకగ్రీవ పంచాయతీల్లో యువతరమే కనిపించటం గమనార్హం. ముఖ్యంగా కెసిఆర్ ప్రభుత్వ ప్రజాకర్షణ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామ స్వరాజ్యాన్ని నిర్మించేందుకు యువత నడుం కట్టారనేది ఎన్నికలలో యువత పాల్గొనే తీరు స్పష్టం చేస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గులాబీని భుజానెత్తుకుంటున్న పల్లెలు..

కెసిఆర్ ప్రభుత్వ విధానాలతో ఆకర్శించబడిన పల్లెలు గులాబీని భుజానెత్తుకుంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో అప్రతిహతమైన మెజార్టీని ఇచ్చిన పల్లెలు పంచాయతీ ఎన్నికలలోనూ పల్లెలన్నీ గులాబీమయం చేసే విధంగా ముందుకు సాగుతున్నాయి.

వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి యువకుడి రక్తదానం

మనతెలంగాణ/గంగాధర: ఇప్పుడు సోషల్ మీడియాలో ఎన్నో పోస్టులు చూస్తుంటాం, చేస్తుంటాం. కానీ ఆపదలో ఉన్నవారికి కూడా ఈ రకంగా ఉపయోగపడతాయని తెలియజేశాడు ఓ యువకుడు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో ఒకరికి అర్జెంటుగా బ్లడ్ కావలెనన్న మెసెజ్‌కు స్పందించిన యువకుడు కరీంనగర్‌కు వెళ్లి రక్తదానం చేశాడు. గంగాధర మండల కేంద్రానికి చెందిన కొత్త జైపాల్‌రెడ్డి మిత్రమండలి యువకుడు వైద భరత్. కొడిమ్యాల మండలానికి చెందిన పర్లపెల్లి లక్ష్మి కరీంనగర్ ప్రభుత్వ దవాఖానాలో చికిత్స పొందుతుండగా ఆర్జెంటుగా లక్ష్మికి రక్తం అవసరం ఉందని వైద్యులు తెలుపగా వారికి సంబందిచిన వ్యక్తులు అన్ని వాట్సాప్ గ్రూపులలో మెస్సేజ్‌లు చేశారు. ఆ వార్త చూసిన భరత్ వెంటనే స్పందించి అనారోగ్యంతో బాధపడుతున్న పేషెంట్ వద్దకు వెళ్ళి రక్తదానం చేశాడు.

బిందు సేద్యం... లాభాలు ఘనం

- **ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బిందు సేద్యంతోనే సాగు**
- **అన్ని పంటలకు డ్రిప్ ఇరిగేషన్**

మనతెలంగాణ/ఖమ్మం : హలం చేతబట్టి దుక్కిదున్ని వ్యవసాయం సాగు చేసే రైతుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుంది. యంత్రాల సాయంతోరైతన్నలు మంచి దిగుబడులు సాధిస్తున్న కాలం ముంచుకొస్తుంది. నీటిని బంగారంలా వాడుకుంటున్నారు. ప్రధానంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అనేకమంది రైతులు ఆరుతడి పంటలను నమ్ముకుని వాటికి డ్రిప్ ద్వారా సాగునీటిని అందించి సరాసరి దిగుబడులు పెంచుకోవడంతోపాటు మార్కెట్‌కు అనుగుణంగా అమ్మకాలు చేసి లాభాలు గడిస్తున్నారు. స్పింకర్ల (బిందు సేద్యం) సేద్యాన్ని గత దశాబ్ధంన్నర కాలం నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రైతులు నమ్ముకుని వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. ఈసేద్యాన్ని ప్రారంభించి ఆధునిక వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. దీనిద్వారా నీటిని పొదుపు చేయడంతోపాటు దిగుబడి, ఖర్చులు తగ్గించి లాభాలు గడిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అనేక మండలాల్లో సరైన వర్షపాతం లేక భూగర్భజలాలు అడుగంటిన నేపథ్యంలో ఉన్న కొద్దిపాటి నీటిని పొదుపుగా వాడుకుని బిందు సేద్యం ద్వారా ఆయా పంటలకు నీటిని అందించి రైతులు లాభాలు గడిస్తున్నారు. ప్రధానంగా ఖమ్మం జిల్లాలో టమోట, మిర్చి, ఇతర కూరగాయల పంటలు, మామిడి, సపోట, బొప్పాయి, నిమ్మ, ఆయిల్ ఫాం, ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ఇటీవల కాలంలో డ్రిప్ ఇరిగేషన్‌లో జంట సాళ్ల పద్ధతిలో మొక్కజొన్నను పండించి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఈ విధానంలో నీటి వినియోగం, ఎరువుల వినియోగం తక్కువగా ఉంటుంది కానీ దిగుబడులు మాములు పద్ధతులకన్నా ఎక్కువగా ఉన్నాయి. ఈ విధానంలో ఒక డ్రిప్ లైన్‌కు ఇంకొక డ్రిప్ లైన్‌కు మధ్యన 40 అంగుళాల దూరం పెట్టి డ్రిప్ లైన్‌కు అటుఇటూ విత్తనాలు పెట్టి రెండు మొక్కజొన్న వరుసల మధ్యన ఒక అడుగు దూరం మొక్కల



మధ్యన 78 అంగుళాల దూరం పెట్టుకున్నారు. ఎకరానికి ఎనిమిది కిలోల విత్తనం పడుతుంది. దీని వలన ఎకరానికి 30 నుంచి 33వేల మొక్కలు వచ్చి పంట పండిస్తున్నారు. విత్తనం పెట్టకముందు వివిధ కాంప్లెక్స్ ఎరువులను డ్రిప్‌లైన్ల ద్వారా మూడు కిలోల నీటిలో కలిపి వదులుతారు. మొలక వచ్చిన వారం రోజులకు మళ్లీ మూడు కిలోల ఎరువును డ్రిప్ ద్వారా వదులుతారు. విత్తిన 15 రోజుల నుంచి 75 రోజుల వరకు రెండు మూడు రోజులకు ఒకసారి మూడు కిలోల యూరియా డ్రిప్ ద్వారా 20 సార్లు అందిస్తారు. దిగుబడి మాత్రం ఎకరానికి మొక్కజొన్న 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. దీంతో లాభాలు అధికంగా వచ్చి రైతులు లాభపడుతున్నారు.

యాసంగి జోరు

- **అటవీ గ్రామాల్లో ఊపందుకున్న వరినాట్లు**
- **వ్యవసాయంలో రైతన్న బిజీబిజీ**
- **రైతుబంధుతో పంట ఖర్చుకు తొలగిన ఇబ్బందులు**





మన తెలంగాణ/మహాముత్తారం : మారుమూల అటవీ గ్రామాల్లో యాసంగి జోరందుకుంది. కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై పల్లె పాటలు పాడుకుంటున్నారు. ఏ పొలం వంక చూసినా కూలీలు, రైతులతో పంట పొలాలు నిండి ఉంటున్నాయి. హలం పట్టి అరకదున్నే రైతులు పొలాల్లోనే ఉంటున్నారు. ఎక్కడ చూసినా జనమంతా పొలాల్లోనే కనిపిస్తున్నారు. యాసంగిలో వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో పొలాలన్నీ కూలీలు, రైతులతో కళకళలాడుతున్నాయి. మహాముత్తారం మండలంలోని అటవీ గ్రామాల్లో సన్న, చిన్నకారు రైతులతోపాటు ఒకప్పుడు కూలీ పని చేసే వారు కూడా తమకున్న కొద్దిపాటి భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నారు.

వేలాది ఎకరాల్లో వరిసాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గ్రామాల్లో బోరుబావుల కింద యాసంగి సాగు చేసుకుంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద అందించిన సాయంతో ఈసారి గ్రామాల్లో వరిపంట సాగు పెరిగింది.

రైతన్నకు ప్రభుత్వ పెట్టుబడి 'సాయం'..!

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి వానాకాలంలో ఎకరానికి రూ.4వేలు పంపిణీ చేసిన ప్రభుత్వం తిరిగి యాసంగికి కూడా ఎకరానికి రూ.4వేల చొప్పున పంపిణీ చేసింది. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించడంతో గ్రామాల్లో యాసంగి జోరుగా సాగుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంమైన నిర్ణయంతో రైతన్న పెట్టుబడి సాయం ఎంతగానో ఉపయోగపడుతోంది. దీంతో ఈ ఏడాది గతంలో కంటే వరిసాగు అధికంగా సాగుచేస్తున్నారు. అటవీ గ్రామాల్లో జోరుగా నాట్లు వేస్తూ రైతన్న బిజీబిజీగా ఉన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ పద్దతులను అనుసరిస్తున్నారు. ట్రాక్టర్లతో దున్ని, వీల్స్, రోటవేటర్‌లతో దమ్ము వేసి నాట్లు వేస్తున్నారు.

వరినాట్లకు కూలీల కొరత తీవ్రం..!

రైతులకు పరిపడా కూలీలు దొరకక నాటు వేసే సమయంలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. అయితే ఈ యాసంగి సీజన్‌లో పత్తి, మిర్చి సాగు పెరగడంతో కూలీల కొరత ఏర్పడుతోంది. సన్న, చిన్న రైతుతోపాటు ఒకప్పుడు కూలీ పనులు చేసేవారు కూడా తమకున్న కొద్దిపాటి భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నారు. వరి, ఇతర పంటలు సాగు చేస్తున్న రైతులకు కూలీ కొరత ఏర్పడి ఇబ్బందుల పాలవుతున్నారు. యంత్రాల వినియోగం పెరిగినా.. నాట్లు వేసేందుకు కూలీలు అవసరం. రైతులందరూ ఒకేసారి వ్యవసాయ పనులు ప్రారంభించడంతో ఓ వైపు కూలీల కొరత, మరోవైపు వరి, పత్తి , మిర్చ పంటల సాగు వెరసి రైతుల మధ్య పోటీ తీవ్రమవుతోంది. గ్రామాల్లో గత కొన్నేండ్లుగా కూలీ కొరత మరింత పెరిగింది. నాటు వేసే సమయంలో రైతులు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను రప్పించేందుకు వారికి వాహనాలను కూడా సమకూరుస్తున్నారు. సకాలంలో నాటు వేయాలనే ఆతృతతో రైతుల మధ్య పోటీ పెరిగి కూలీ రేట్లు అధికమయ్యాయి. ప్రస్తుతం వ్యవసాయ మహిళా కూలీకి రోజుకు రూ.300నుంచి రూ.400వరకు చెల్లిస్తున్నారు. మగవారికైతే రూ.400 నుంచి రూ.500 వరకు ఇస్తున్నారు.





నకిలీ యాప్స్ బారిన పడకుండా...

మన చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే చాలు గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి రకరకాల యాప్స్ డౌన్‌లోడ్ చేస్తుంటాం. గూగుల్ ప్లేస్టోర్ నుండి యాప్స్ డౌన్లోడ్ చేసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదని చాలామంది అపోహపడుతుంటారు. వాస్తవానికి ప్లే స్టోర్ లో కూడా ప్రమాదకరమైన అనేక ఫేక్ యాప్స్ చలామణి అవుతున్నాయి. బాగా పేరున్నయాప్స్ క్లోన్‌గా ఇవి కనిపిస్తుంటాయి.ఈ నేపథ్యంలో చాలామంది ఒరిజినల్ యాప్స్ కి బదులుగా ఫేక్ అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకొని ప్రమాదం బారిన పడుతుంటారు. ఈ మధ్యకాలంలో గూగుల్ 22 నకిలీ యాప్స్‌ని తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా టెక్ గైట్ 9 మిలియన్స్ వినియోగదారులకు నష్టం కలిగించే 85 అప్లికేషన్స్‌ని ప్లే స్టోర్ నుండి తొలగించింది. ఒకసారి నకిలీ యాప్స్ మన ఫోన్ లోకి వచ్చిన తరువాత మనకు తెలియకుండానే అదనంగా కమాండ్ కంట్రోల్ సర్వర్ నుండి వివిధ రకాల అప్లికేషన్స్‌ని డౌన్లోడ్ చేసి ఇతర ప్రమాదకరమైన స్క్రిప్టులను రన్ చేస్తుంటాయి. అలాంటి నకిలీ యాప్స్ బెడదను తప్పించుకోవడానికి యాప్స్‌ని డౌన్‌లోడ్ చేసుకునే ముందు ఈ జాగ్రత్తలను పాటించండి.

నకిలీ యాప్స్ డిస్క్రిప్షన్ రాసే విధానంలో చాలా లోపాలు ఉంటాయి. స్పెల్లింగ్ లోపాలు, ఫీచర్ల గురించి సరైన వివరణ లేకపోవడం, గ్రామర్ పరంగా కూడా లోపాలను వెతికి పట్టుకోవచ్చు.

నకిలీ యాప్స్ డిస్క్రిప్షన్ రాసే విధానంలో చాలా లోపాలు ఉంటాయి. స్పెల్లింగ్ లోపాలు, ఫీచర్ల గురించి సరైన వివరణ లేకపోవడం, గ్రామర్ పరంగా కూడా లోపాలను వెతికి పట్టుకోవచ్చు. దాన్నిబట్టే అది ఫేక్ యాప్స్ అన్న విషయం సులభంగా గ్రహించవచ్చు.

సహజంగా గూగుల్ ప్లేస్టోర్ లో అప్‌లోడ్ చేయబడే ప్రతి యాప్‌ను ఎవరు డెవలప్ చేశారు అన్న విషయం డెవలపర్ పేరు స్పష్టంగా పేర్కొనబడి ఉంటుంది.

ఆ పేరుని గూగుల్‌లో వెదికి ఆ డెవలపర్‌కి చెందిన అధికారిక వెబ్‌సైట్స్ పరిశీలించడం ద్వారా పేరున్న డెవలపర్ అవునా.. అన్న విషయం అర్థం చేసుకోవచ్చు యాప్‌కు ఉన్న రేటింగ్‌పై కూడా ఓ కన్నేయండి. ఎందుకంటే నకిలీ యాప్స్‌కు రేటింగ్ చాలా తక్కువ ఉంటుంది. ఒరిజినల్ యాప్స్‌కు రేటింగ్ ఎక్కువ ఉంటుంది.సెక్యూరిటీ ఇంకా మాల్వేర్ దాడుల నుంచి రక్షించుకునేందుకు నమ్మదగిన యాంటీ వైరస్‌ను ఉపయోగించండి.



రోహిత్‌కు డ్యాన్స్ నేర్పించిన ధావన్ కూతురు

భారత స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ ఆస్ట్రేలియాతో తొలి వన్డేలో అద్భుతంగా ఆడి సెంచరీ కొట్టినప్పటికి భారత్ గెలుపొందని సంగతి తెలిసిందే. ఐతే మ్యాచ్ తర్వాత హోటల్లో భారత ఆటగాళ్లు ఒత్తిడిని ఎదుర్కొనేందుకు సరదాగా గడిపారు. మ్యాచ్‌లో 45 ఓవర్లు చేసిన రోహిత్ కొత్త స్టెప్పులు నేర్చుకున్నాడు. భారత ఓపెనర్ శిఖర్ ధావన్ కూతురు రియా.. హిట్‌మ్యాన్‌కు డ్యాన్స్ నేర్పించింది. ఫ్లాస్ డ్యాన్స్ ఎలా చేయాలో రోహిత్‌తో పాటు కేదార్ జాదవ్‌కు రియాచేసి చూపించింది. పక్కనే ధావన్ భార్య, కొడుకు వీళ్లను ఆసక్తిగా గమనించారు. ఫ్లాస్ డ్యాన్స్ మూమెంట్ ఎలా చేయాలో రోహిత్‌కు రియా నేర్పిస్తున్న వీడియోను బీసీసీఐ ట్విటర్‌లో షేర్ చేసింది. ఐతే రియాలాగా డ్యాన్స్ చేయడంలో రోహిత్ తడబడ్డాడు. హిట్ మ్యాన్ డ్యాన్స్ ఎలా నేర్చుకుంటున్నాడో చూడండి అని అంటోంది.

తీరా అడగాలనుకునేసరికి...!

ఎవరినైనా ఏమైనా ప్రశ్నించాలంటే యుక్తవయసులో ఉన్నప్పుడు ఎక్కువగా సిగ్గుపడుతుంటాం. అడగచ్చో అడక్కూడదో అనే అనుమానంతో ఉంటాం. తీరా అడగాలనే ధైర్యం వచ్చేసరికి వయసు మీదపడుతుంది.. అమితాబ్ పెట్టిన ఈ ట్వీట్‌కి నెటిజన్లు అవునవునంటూ వంత పాడారు.



దేని గురించో..

ఏదో విషయమై ఈ తండ్రీకొడుకులు తలమునకలయ్యేలా ఆలోచిస్తున్నారు. ఈ ఫొటోను అమిర్‌ఖాన్ తన ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. దీనికి విపరీతమైన లైకులు వచ్చాయి. ఇంతకీ ఏమాలోచిస్తున్నారో మాత్రం చెప్పలేదు. చెబితే మేం సాయం చేస్తాం కదా అంటున్నారు నెటిజన్లు.





ఇకచాలు ఆపు!

విరాట్‌కోహ్లీ అనుష్కాశర్మల ఫోటో ఒకటి ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ఇలాంటి పోస్టులు పెట్టేకన్నా, కనీసం రెండో ఆటలోనైనా విజయం సాధించేలా నడిపించు అంటూ నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. మొత్తానికి ఈ ఫొటో అభిమానుల ఆగ్రహానికి గురైంది. నెగిటివ్ ట్రీలింగ్స్ విపరీతంగా వస్తున్నాయి.

గుడ్డు..వెరీగుడ్డు!

ఈ గుడ్డును ఏ సెలబ్రిటీ చేత్తో పట్టుకోలేదు. వజ్రాలతో అలంకరించబడి లేదు. అయినా దీన్ని ఇన్‌స్టాలో 24 మిలియన్ల మంది చూశారు. ఇప్పటి వరకూ ఇన్‌స్టాలో ఎక్కువ మంది చూసిన పోస్ట్ ఇదేనట. ఈ గుడ్డును ఎవరు ఇన్‌స్టాలో పెట్టారో, ఎందుకు పెట్టారో పూర్తి వివరాలు తెలియనప్పటికీ నెటిజన్లు దీన్ని ఇంతగా అభిమానిస్తూ విపరీతంగా లైకులు కొట్టేస్తున్నారు.



కొత్త మెరుపు!



ఈ కొత్త సంవత్సరం నాకెంతో ప్రత్యేకమైంది. నా విజయం వెనుక చాలా మంది ఉన్నారు. వారందరికీ నా ధన్యవాదాలు అంటూ సానియా మీర్జా ట్వీట్ చేస్తూ తన ఫొటోను షేర్ చేసింది. ఈ ఫొటోకి విపరీతమైన లైకులు వచ్చి, నెట్‌లో హల్‌చల్ చేస్తుంది.



వాట్సాప్ కొత్త ఫీచర్స్

ప్రపంచ వ్యాప్తంగా మెసేజింగ్ రంగంలో దూసుకుపోతున్న ఇన్‌స్టంట్ మెసేజింగ్ దిగ్గజం వాట్సాప్ ఎప్పటికప్పుడు సరికొత్తగా ముందుకు దూసుకుపోతోంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 కోట్ల మంది యాక్టివ్ యూజర్స్ ఉంటారని అంచనా. ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లతో ఆకట్టుకుంటుంది వాట్సాప్. గతేడాది యూజర్లకు సరికొత్త ఫీచర్లతో సర్‌ప్రైజ్ ఇచ్చిన వాట్సప్ ఈ ఏడాది కూడా మరిన్ని ఫీచర్లు అందించనుంది. 2019లో వాట్సప్‌లో కొత్తగా వచ్చే ఫీచర్లు ఇవే అంటూ వాట్సాప్ యూజర్లలో తెగ ప్రచారం జరుగుతోంది. అవేంటో చూద్దాం.

కంటిచూపు మందగించడానికి మొబైల్ బ్రైట్‌నెస్ కూడా ఒక కారణం. అందుకే ఆండ్రాయిడ్, ఐఓఎస్ స్మార్ట్‌ఫోన్లల్లో వాట్సాప్ డార్క్ మోడ్ ఫీచర్ రాబోతోంది. ఇప్పటికే ట్విటర్, యూట్యూబ్ వంటి చాలా మొబైల్ అప్లికేషన్స్‌లలో డార్క్‌మోడ్ అందుబాటులో ఉంది. ఇన్నాళ్లూ వాట్సాప్‌లో ఆ లోటు ఉండేది. అయితే కొన్ని నెలలుగా డార్క్ మోడ్‌పై ప్రయోగాలు చేస్తోంది వాట్సాప్. ఇంకొన్ని రోజుల్లోనే యూజర్లకు డార్క్‌మోడ్ ఆప్షన్ అందించనుంది. డార్క్‌మోడ్‌తో చీకట్లో కళ్లను కాపాడుకోవడం మాత్రమే కాదు, బ్యాటరీ కూడా ఆదా చేసుకోవచ్చు. కంపెనీ ఈ ఏడాది జనవరిలో ఈ ఫీచర్ ను లాంచ్ చేసే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఫీచర్ ద్వారా యూజర్లు కంటి సమస్యల నుండి కొంత మేరకు గట్టెక్కే అవకాశం ఉంది. లోలైట్ కండిషన్లో కూడా ఈ ఫీచర్ సమర్థవంతంగా పనిచేస్తుందని కంపెనీ తెలిపింది.

కాన్‌సెక్యూటివ్ వాయిస్ మెసేజ్...ఈ ఫీచర్ ద్వారా యూజర్లు వాయిస్ మెసేజ్‌ని ఆటోమేటిగ్గా ప్లే చేసుకోవచ్చు. దాన్ని ట్యాప్ చేస్తే అది దానంతట అదే వాయిస్ ని వినిపిస్తుంది. ప్రస్తుతం ఇది టెస్టింగ్ దశలో ఉంది. బీటావర్షన్ లో అందుబాటులో ఉంది.

మీడియా ప్రివ్యూ... ఏ ఫీచర్ మీడియాను అయినా అల్లో చేసే విధంగా అందుబాటులోకి రానుంది. దీని ద్వారా యూజర్లు వాట్సాప్ యాప్ ఓపెన్ చేయకుండానే ఫొటోలు, వీడియో, ఆడియో వంటి వాటిని వరుస క్రమంలో చూడవచ్చు.

కాంటాక్ట్స్ ర్యాంకింగ్... ఫీచర్ చాలా ఆసక్తికరంగా ఉండనుంది. మీరు కమ్యూనికేట్ అయ్యే యూజర్లు ఎంత ర్యాంకులో ఉన్నారనే విషయం ఈ ఫీచర్ ద్వారా తెలుసుకోవచ్చు. ఇది ఈ ఏడాదే వచ్చే అవకాశం ఉంది.

ఫింగర్‌ప్రింట్ అన్‌లాక్...ఈ రోజుల్లో ప్రైవసీ చాలా ముఖ్యమైపోయింది. అందుకే మీ వాట్సాప్‌లో ఎక్స్‌ట్రా లేయర్ ప్రొటెక్షన్ అందుబాటులోకి రానుంది. ఫింగర్‌ప్రింట్ ఆథరైజేషన్ ఉంటేనే వాట్సాప్ యాప్ ఓపెన్ అవుతుంది.

స్టిక్కర్ సెర్చ్.... గతేడాది వాట్సాప్ విడుదల చేసిన స్టిక్కర్ ఫీచర్ యూజర్లు అందరినీ ఆకట్టుకుంది. కాకపోతే స్టిక్కర్ సెర్చ్ ఆప్షన్ లేదు. ఈ ఆప్షన్ ఎమోజీ, గిఫ్ ఫైల్స్‌కు ఉంది. స్టిక్కర్స్‌కి కూడా సెర్చ్ ఆప్షన్ ఇస్తే ఆ లోటు కూడా తీరినట్టే.

2019 మొబైల్స్..

భారతీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్ రోజు రోజుకు పుంజుకుంటున్న నేపథ్యంలో అత్యాధునిక ఫీచర్లతో దిగ్గజ కంపెనీలు తమ ఫోన్లను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. మధ్యతరగతి వారినే టార్గెట్ చేస్తూ ఈ కంపెనీలు అత్యంత తక్కువ ధరకే మంచి ఫీచర్లు గల ఫోన్లను అందిస్తు న్నాయి. కొన్ని కంపెనీలు బడ్జెట్ ధరలో సరికొత్త ఫీచర్లతో స్మార్ట్‌ఫోన్లను మార్కెట్లోకి తీసుకువస్తున్నాయి.. చైనా కంపెనీలు, అలాగే దేశీయ కంపెనీలు పోటీ పడుతూ వినియోగదారులను ఆకట్టుకునే ఫోన్లను మార్కెట్లోకి ప్రవేశపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు మార్కెట్లో అత్యంత తక్కువ ధరలో లభిస్తున్న బెస్ట్ ఫోన్లను మీరూ చూడండి.

షావోమి రెడ్‌మీ 6 ప్రో...

ఫీచర్లు

6.26 ఇంచ్ ఫుల్ హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే, 2280 x 1080 పిక్సల్స్ స్క్రీన్ రిజల్యూషన్, 1.8 గిగాహెడ్జ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 636 ప్రాసెసర్,



3/4 జీబీ ర్యామ్, 32/64 జీబీ స్టోరేజ్, 128 జీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 8.1 ఓరియో,, ఎంఐయూఐ 9.6, డ్యుయల్ సిమ్, 12, 5 మెగాపిక్సల్ డ్యుయల్ బ్యాక్ కెమెరాలు, 20, 2 మెగా పిక్సల్ డ్యుయల్ సెల్ఫీ కెమెరాలు, ఫింగర్ ప్రింట్ సెన్సార్, ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్, 4జీ వీవోఎల్టీఈ, బ్లూటూత్ 5.0, 4000 ఎంఏహెచ్ బ్యాటరీ.

రియల్‌మి యూ1....

ఫీచర్లు

6.3 ఇంచ్ ఫుల్ హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే, 2350 X 1080 పిక్సల్స్ స్క్రీన్ రిజల్యూషన్, గొరిల్లా గ్లాస్ 3 ప్రొటెక్షన్, ఆక్టాకోర్ ప్రాసెసర్, 3/4 జీబీ ర్యామ్, 32/64 జీబీ స్టోరేజ్, 256 జీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, డ్యుయల్ సిమ్, డెడికేటెడ్ మెమొరీ కార్డ్ స్లాట్, ఆండ్రాయిడ్ 8.1 ఓరియో, 13, 2 మెగాపిక్సల్ డ్యుయల్ బ్యాక్ కెమెరాలు, 25 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, 4జీ వీవోఎల్‌టీఈ, బ్లూటూత్ 4.2, 3500 ఎంఏహెచ్ బ్యాటరీ.

రియల్‌మి యూ2..

ఫీచర్లు

6.2 ఇంచ్ డిస్‌ప్లే, 1520 X 720 పిక్సల్స్ స్క్రీన్ రిజల్యూషన్, గొరిల్లా గ్లాస్ 3 ప్రొటెక్షన్, 1.8 గిగాహెడ్జ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 450 ప్రాసెసర్, 3/4 జీబీ ర్యామ్, 32/64 జీబీ స్టోరేజ్, 256 జీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 8.1 ఓరియో, డ్యుయల్ సిమ్, 13, 2 మెగాపిక్సల్ డ్యుయల్ బ్యాక్ కెమెరాలు, 8 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా, ఫింగర్ ప్రింట్ సెన్సార్, ఫేస్ అన్‌లాక్, డ్యుయల్ 4జీ వీవోఎల్‌టీఈ, బ్లూటూత్ 4.2, 4230 ఎంఏహెచ్ బ్యాటరీ.

నెల కనిష్టానికి రూపాయి విలువ



ముంబై : డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మళ్లీ పతనం బాటపట్టింది. సోమవారం రూపాయి విలువ 43 పైసలు క్షీణించి ఆఖరికి 70.92 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో పతనం, పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటు తగ్గడం, విదేశీ పెట్టుబడులు తరలిపోతుండడం వంటి కారణాలతో రూపాయి విలువ క్షీణిస్తోంది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్(ఫారెక్స్)లో రూపాయి 70.50 వద్ద ప్రారంభించింది. ఓ దశలో రూపాయి విలువ 71ను దాటింది. ఆఖరికి 70.95 వద్ద ముగిసింది. శుక్రవారం నాడు కూడా రూపాయి విలువ 8 పైసలు పతనమై 70.49 వద్ద ముగిసింది. పారిశ్రామికోత్పత్తి 17 నెలల కనిష్టానికి పడిపోవడంతో పాటు ఇతర అంశాల రూపాయిపై ప్రభావం చూపాయి.

ఓలాలో సచిన్ బన్సాల్ రూ.150 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: ఫ్లిప్‌కార్ట్ మాజీ వ్యవస్థాపకుడు సచిన్ బన్సాల్ తాజాగా క్యాబ్ సేవల సంస్థ ఓలాలో రూ.150 కోట్లు పెట్టుబడులు పెట్టారు. సిరీస్ జె ఫండింగ్‌లో భాగంగా ఓలా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఓలా మాతృ సంస్థ అయిన ఎఎన్‌ఐ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ 70,588 షేర్లను సచిన్ బన్సాల్‌కు కేటాయిస్తోంది. ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకులైన సచిన్ బన్సాల్ గతేడాది కంపెనీలోని తన వాటాలను వాల్‌మార్ట్‌కు విక్రయించారు. ఇప్పుడు తొలిసారి సొంతంగా ఓలాలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఓలాలోకి క్యాపిటల్ సంస్థ కాకుండా ఓ వ్యక్తి నేరుగా ఇన్ని పెట్టుబడులు పెట్టడం ఇదే తొలిసారి. వాస్తవానికి ఓలాలో సచిన్ బన్సాల్ రూ.650 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం. అయితే ప్రస్తుతానికి రూ.150 కోట్ల పెట్టుబడులు మాత్రమే పెట్టారు. సచిన్ బన్సాల్‌కు మరిన్ని కంపెనీల్లోనూ పెట్టుబడులు ఉన్నాయి. ఇక ఓలా గతేడాది అక్టోబర్‌లో చైనాకు చెందిన టెన్సెంట్ హోల్డింగ్, సాఫ్ట్‌బ్యాంక్ గ్రూప్ నుంచి 1.1 బిలియన్ డాలర్ల పెట్టుబడులు స్వీకరించింది. మరో 1 బిలియన్ డాలర్ల పెట్టుబడుల కోసం చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఓలా తన ప్రత్యర్థి అయిన ఊబెర్‌కు ఇండియాలో గట్టిపోటీ ఇస్తోంది. దాంతో పాటు ఇతర దేశాల్లోనూ కంపెనీని విస్తరిస్తోంది. వారం క్రితమే స్టెడ్‌వ్యూ క్యాపిటల్ నుంచి ఓలాలోకి రూ.500 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి.

స్టాక్ మార్కెట్

ఈ రోజు మార్కెట్ ముగింపు		మార్పు	%
సెన్సెక్స్	35,853.56	156.28	(-0.43%)
నిఫ్టీ	10,737.60	57.35	(-0.53%)

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	70.59
యూరో	81.13
బ్రిటిష్ పౌండ్	89.84
ఆస్ట్రేలియన్ డాలర్	50.68
కెనెడియన్ డాలర్	53.29
సింగపూర్ డాలర్	52.09
స్విస్ ఫ్రాంక్	71.59
చైనీస్ యువాన్	10.41
మలేషియన్ రింగిట్	17.19
న్యూజిలాండ్ డాలర్	47.86
హాంకాంగ్ డాలర్	8.98
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	232.67
సౌతాఫ్రికన్ రాండ్	5.09

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30880	33026.74	0.62%
ముంబై	31560	33754.01	0.9%
ఢిల్లీ	31350	33529.41	0.16%
కోల్‌కతా	31580	33775.40	0.54%
కేరళ	33957.22	36317.88	0%
బెంగళూరు	30140	32235.29	0.07%
హైదరాబాద్	30880	33026.74	0.62%
గల్ఫ్	137.68	147.25	0%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42700.00
ముంబై	₹ 42700.00
ఢిల్లీ	₹ 42700.00
కోల్‌కతా	₹ 42700.00
హైదరాబాద్	₹ 42700.00



రిటైల్ ద్రవ్యోల్బణం మరింత దిగొచ్చింది



డిసెంబర్‌లో 2.19 శాతం నమోదు

18 నెలల కనిష్ట స్థాయికి




న్యూఢిల్లీ: పండుగ సందర్భంగా ప్రజలకు సానుకూల అంశాల్లో ద్రవ్యోల్బణం ఒకటి.. డిసెంబర్‌లో ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయికి దిగొచ్చింది. ఓ వైపు రిటైల్ ద్రవ్యోల్బణం 18 నెలల కనిష్టానికి, మరోవైపు టోకు ద్రవ్యోల్బణం 8 నెలల కనిష్టానికి దిగొచ్చాయి. ఆహార వస్తువుల ధరలు తగ్గడం, చమురు ధరల తగ్గుదల రిటైల్ ద్రవ్యోల్బణం అత్యంత కనిష్టానికి దిగొచ్చింది.

రిటైల్ ద్రవ్యోల్బణం

డిసెంబర్‌లో వినిమయ ధరల సూచీ(సిపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 2.19 శాతం నమోదు చేసింది. అంతకుముందు నవంబర్ నెలలో ఇది 2.33 శాతంగా ఉంది. అయితే 2017 డిసెంబర్‌లో 5.21 శాతం నమోదైంది. గతంలో అత్యంత కనిష్టం 2017 జూన్‌లో 1.46 శాతం.. కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ ఈ వివరాలను వెల్లడించింది. ఆహార ద్రవ్యోల్బణం ఇప్పటికీ ప్రతిద్రవ్యోల్బణం 2.51 శాతం వద్దే ఉంది.. అంతకుముందు నవంబర్‌లోనూ మైనస్ 2.61 శాతం నమోదైంది. కూరగాయలు, పండ్లు, గుడ్లు వంటి ధరల్లో ద్రవ్యోల్బణం వరుసగా తగ్గుదల కనిపిస్తోంది. అయితే మాంసం, చేపలు, పప్పుధాన్యాల ధరల్లో స్వల్పంగా పెరుగుదల నమోదైంది. ఇంధనం ద్రవ్యోల్బణ నవంబర్‌లో 7.39 శాతం నుంచి 4.54 శాతానికి తగ్గింది. రిటైల్ ద్రవ్యోల్బణం, టోకు ద్రవ్యోల్బణం గణాంకాల ఆధారంగానే ఆర్‌బిఐ వడ్డీ రేట్లను నిర్ణయించింది. ఈ నేపథ్యంలో వచ్చే సమీక్షలో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు.

8 నెలల కనిష్టానికి టోకు ద్రవ్యోల్బణం

డిసెంబర్ నెలలో టోకు ధరల సూచీ(డబ్ల్యుపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.80 శాతం నమోదైంది. చమురు ధరలు అదుపులో ఉండడం, కొన్ని ఆహార వస్తువుల ధరలు తగ్గడంతో ఈసారి 8 నెలల కనిష్టానికి తగ్గింది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వశశాఖ సోమవారం ఈ వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం, టోకు ద్రవ్యోల్బణం తగ్గడం ఇది వరుసగా రెండో నెల.. నవంబర్‌లో 4.64 శాతంగా, అక్టోబర్‌లో 5.54 శాతంగా ఉంది. అలాగే 2017 డిసెంబర్ నెలలో టోకు ద్రవ్యోల్బణం 3.58 శాతంగా ఉంది.. అంటే ప్రస్తుతం కంటే దిగువనే ఉంది. అయితే 2018 ఏప్రిల్‌లో నమోదైన 3.62 శాతం టోకు ద్రవ్యోల్బణం తర్వాత ఇదే కనిష్ఠం కావడం గమనార్హం. డిసెంబరు నెలలో కూరగాయల ధరల ద్రవ్యోల్బణం 26.98 శాతం నుంచి 17.55 శాతానికి తగ్గింది. ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం సగం వరకు తగ్గుదలను నమోదు చేసింది. 16.28 శాతం నుంచి 8.38 శాతానికి తగ్గింది. ఇక ఆహార ఉత్పత్తుల విభాగంలో డిసెంబర్ ప్రతిద్రవ్యోల్బణం 0.07 శాతంగా ఉంది. నవంబర్‌లో ప్రతిద్రవ్యోల్బణం 3.31 శాతంగా నమోదైంది. డిసెంబరు నెలలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుముఖం పట్టడం వల్ల ద్రవ్యోల్బణం చాలా వరకు తగ్గింది. ఇక బంగాళదుంపల ధరలు చౌక కావడంతో కూరగాయల ద్రవ్యోల్బణం 86.45 శాతం నుంచి 48.68 శాతానికి చేరింది. పప్పు ధాన్యాల ధరల్లో వృద్ధి 2.11 శాతంగా ఉంది. తయారీ రంగం ఉత్పత్తుల ద్రవ్యోల్బణం నవంబర్‌లో 4.21 శాతంగా నమోదు కాగా, డిసెంబర్ నాటికి 3.59 శాతానికి దిగివచ్చింది. రెండు రోజుల క్రితం భారత పారిశ్రామికోత్పత్తి సూచీ(ఐఐపి) 17 నెలల కనిష్టానికి చేరింది. నవంబరులో 0.5 శాతంగా నమోదైంది. దీంతో ఆర్‌బిఐ ఈసారి వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.



మింత్రా- జబాంగ్ సిఇఒ అనంత్ నారాయణ్ రాజీనామా



న్యూఢిల్లీ: ఫ్యాషన్ ఇ-రిటైలర్ మింత్రా సిఇఒ అనంతర్ నారాయణ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు మింత్రా ప్రకటనలో వెల్లడించింది. మాతృ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఆయన రాజీనామా చేస్తారని ఊహాగానాలు కూడా వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మింత్రా, జబాంగ్ సిఇఒ పదవి నుంచి వైదొలగాలని నారాయణ్ నిర్ణయించుకున్నార ని మింత్రా ఓ ప్రకటనలో పేర్కొంది. నారాయ ణ్ స్థానంలో అమర్ నాగారమ్ హెడ్‌గా రానున్నారని, ఫ్లిప్ కార్ట్ సిఇఒ కళ్యాన్ కృష్ణమూర్తికి రిపోర్ట్ చేయనున్నారని సంస్థ వెల్లడించింది.

33,000 దాటిన బంగారం ధర



ముంబై: బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. దేశీయ మార్కెట్లో మళ్లీ పసిడి ధర రూ. 33వేల పైకి చేరింది. సోమవారం 10 గ్రాముల బంగారం ధర రూ. 225 పెరిగి రూ. 33,100 వద్ద ఉంది. అంతర్జాతీయ అంశాలు, దేశీయంగా డిమాండ్ వల్ల బులియన్ మార్కెట్లో బంగారం ధర పెరుగుతోందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అమెరికా కరెన్సీ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మళ్లీ బలహీనపడటంతో పసిడిలో పెట్టుబడులు పెట్టడమే మేలని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. దీంతో పాటు దేశీయంగా నగల వ్యాపారుల నుంచి కూడా కొనుగోళ్లు పెరగడంతో పసిడి ధర పెరిగిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోవైపు వెండి ధర కూడా బంగారం బాటలోనే పయనించింది. కిలో వెండి ధర రూ. 250 పెరిగి రూ. 40,100కు చేరింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో వెండి ధర పెరిగింది. అంతర్జాతీయంగానూ ఈ లోహాల ధరలు స్వల్పంగా పెరిగాయి. గ్లోబల్ మార్కెట్లో ఔన్సు పసిడి ధర 1,290.22 డాలర్లు, ఔన్సు వెండి ధర 15.73 డాలర్లుగా ఉంది.

డిమార్ట్ షేరు 11 శాతం పతనం

- లిస్టింగ్ తర్వాత అత్యంత పతనం ఇదే
- క్యూ3 ఫలితాలు బలహీనంగా ఉన్నందుకే

న్యూఢిల్లీ: డి-మార్ట్ స్టోర్ల నిర్వహణ సంస్థ ఎవెన్యూ సూపర్‌మార్ట్స్ మూడో త్రైమాసిక ఫలితాలు బలహీనంగా ఉన్నాయి. క్యూ3 (అక్టోబర్ -డిసెంబర్)లో సంస్థ నికర లాభం 2 శాతమే పెరిగి రూ. 257 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం మాత్రం 33 శాతం వృద్ధితో రూ. 5451 కోట్లను తాకింది. ఇబిటా 7 శాతం పుంజుకుని రూ. 453 కోట్లయ్యింది. ఈ నేపథ్యంలో క్రెడిట్ స్విస్ డీమార్ట్ షేరుకి రేటింగ్‌ను తగ్గించింది. ఇదే బాటలో ఎడిల్‌వీజ్, ప్రభుదాస్ లీలాధర్ తదితర బ్రోకింగ్ సంస్థలు షేరు రేటింగ్‌ను తగ్గిస్తూ.. స్టాక్‌కు రూ. 1300 టార్గెట్ ధరను ప్రకటించాయి.



వెల్లువెత్తిన అమ్మకాలు

ఫలితాలు ఆశించిన విధంగా లేకపోవడంతో షేరు విలువ 11 శాతం పతనమైంది. క్యూ3 ఫలితాలు విడుదల చేసిన తర్వాత ఎవెన్యూ విక్రయానికి బ్రోకింగ్ సంస్థలు రేటింగ్ తగ్గిస్తూ సిఫారసులు చేశాయి. దీంతో ఈ కౌంటర్లో భారీ అమ్మకాలు వెల్లువెత్తాయి. సోమవారం బిఎస్‌ఇలో స్టాక్ రూ.1454.70ల వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడేలో రూ.1,423.4 కనిష్ట స్థాయిని తాకింది. కంపెనీ మార్కెట్‌లో లిస్టైన దగ్గరి నుంచి ఒకేరోజులో ఇంత స్థాయిలో పడిపోవడం ఇదే గమనార్హం. ఆఖరికి 11 శాతం నష్టపోయి రూ.1,397 వద్ద ముగిసింది. షేరు ఏడాది కనిష్ట, గరిష్ట ధరలు వరుసగా రూ.1062.90, రూ.1696.15 లుగా నమోదయ్యాయి. క్యూ3 ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రముఖ బ్రోకరేజ్ సంస్థలైన జెప్ఫారీస్, క్రెడిట్ శాష్యూ, ఎడెల్వీజ్, మోతీలాల్ ఓస్వాల్ సర్వీసెస్‌లు షేరు ఎర్నింగ్ టార్గెట్ అంచనాలను భారీ తగ్గాయి. ఫలితాలు, బ్రోకింగ్ సంస్థల సిఫారసుల కారణగా ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు.

గ్లోబల్ ఎఫెక్ట్.. మార్కెట్లు కుదేలు

156 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్



ముంబై: దేశీయ స్టాక్‌మార్కెట్ మూడోరోజూ నష్టాలతో ముగిసింది. మెటల్, అటో, ప్రైవేట్ రంగ షేర్ల పతనంతో మార్కెట్లు కుదేలయ్యాయి. ఆఖరికి సెన్సెక్స్ 156 పాయింట్లు నష్టపోయి 35853 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 57 పాయింట్లు కోల్పోయి 10737.60 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అస్థిర పరిస్థితులు దేశీయంగా ప్రభావం చూపాయి. ఎన్‌ఎస్‌ఇలో అన్ని రంగాలూ నష్టపోగా, ఒక్క ఫార్మా సెక్టార్ 0.5 శాతం లాభపడింది. మెటల్, రియల్టీ, బ్యాంక్ నిఫ్టీ, ఐటీ 1.3 నుంచి 0.6 శాతం మధ్య బలహీనపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో విప్రో, గెయిల్, ఐబి హౌసింగ్, టెక్ మహీంద్రా, ఎల్ అండ్ టి, ఇండస్ ఇండ్, యుపిఎల్, వేదాంతా, జెఎస్‌డబ్ల్యు స్టీల్, ఎన్‌టిపిసి 5 నుంచి 1.6 శాతం మధ్య వెనకడుగు వేశాయి. యస్ బ్యాంక్ 6 శాతం పెరిగింది. ఇక ఇన్ఫోసిస్, సన్ ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, మారుతీ, టాటా మోటార్స్, ఇన్‌ఫ్రాటెల్, ఐఒసి, సిప్లా కూడా లాభపడ్డాయి. బిఎస్‌ఇలో మిడ్, స్మాల్ క్యాప్స్ కూడా నష్టపోయాయి. ట్రేడైన షేర్లలో 1,488 నష్టపోగా, 1,032 షేర్లు మాత్రమే లాభాలతో ముగిశాయి. గత వారాంతం శుక్రవారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పిఐలు) రూ. 687 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఇక దేశీ ఫండ్స్(డిఐఐలు) రూ. 123 కోట్లను ఇన్వెస్ట్ చేశాయి. అంతర్జాతీయంగా చూస్తే గత నెలలో చైనా ఎగుమతులు క్షీణించాయి. మంగళవారం బ్రెగ్జిట్ డీల్‌పై బ్రిటన్ ఓటింగ్‌ను చేపట్టనుంది. ఈ నేపథ్యంలో ఆసియా మార్కెట్లు బలహీనపడగా, యూరోపియన్ స్టాక్ మార్కెట్లు కూడా నష్టాలతో ప్రారంభమయ్యాయి.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం%
YES BANK	198.00	182.30	195.35	184.25	11.10	6.02
INFOSYS	710.20	695.95	701.90	683.50	18.40	2.69
SUN PHARMA	452.00	443.75	450.85	444.40	6.45	1.45
BAJAJ FINANCE	2,552.90	2,484.15	2,544.80	2,514.20	30.60	1.22
MARUTI SUZUKI	7,433.35	7,257.00	7,408.70	7,320.50	88.20	1.20
TATA MOTORS	198.30	177.45	182.40	180.30	2.10	1.16
BHARTI INFR	282.80	274.35	280.10	277.20	2.90	1.05
IOC	133.15	131.00	132.30	131.20	1.10	0.84
CIPLA	514.00	505.60	511.95	510.20	1.75	0.34
HPCL	236.30	232.60	233.95	233.50	0.45	0.19

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం%
Wipro	331.10	311.35	312.55	328.70	16.15	4.91
GAIL	338.30	322.15	324.90	338.60	13.70	4.05
Indiabulls Hsg	818.90	786.20	790.95	816.15	25.20	3.09
Tech Mahindra	703.10	676.90	679.85	699.20	19.35	2.77
Larsen	1,367.20	1,331.00	1,333.90	1,369.60	35.70	2.61
IndusInd Bank	1,509.00	1,471.00	1,484.05	1,515.15	31.10	2.05
Vedanta	196.00	192.00	193.05	196.60	3.55	1.81
JSW Steel	288.45	282.05	283.90	288.80	4.90	1.70
UPL	784.00	766.90	770.40	783.45	13.05	1.67
NTPC	148.35	145.20	145.55	148.00	2.45	1.66

‘ఎన్‌టిఆర్’ బయోపిక్‌లో బాలకృష్ణ అద్భుతంగా నటించారు. ఈ చిత్రాన్ని నా కుటుంబంతో కలిసి చూశాను. సినిమా పూర్తయ్యేవరకు నాకు తెరపై కనిపించింది బాలకృష్ణ కాదు ఎన్టీఆర్. నాకు, నా భార్య జీవితకు ఎన్టీఆర్‌తో ఎనలేని అనుబంధం ఉంది. ఈ సినిమా ద్వారా ఎన్టీఆర్‌తో అప్పటి మా జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాం.

– హీరో రాజశేఖర్

సినిమా




మహర్షి విడుదల వాయిదా?

వంశీ పైడిపల్లి దర్శకత్వంలో సూపర్‌స్టార్ మహేష్‌బాబు నటిస్తున్న చిత్రం‘మహర్షి’. మహేష్ కెరీర్‌లో ఇది అతని 25వ చిత్రం. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. అయితే ఈ సినిమా విడుదల వాయిదా పడిందని తెలిసింది. ఏప్రిల్ 26న ‘మహర్షి’ చిత్రాన్ని విడుదల చేస్తారని సమాచారం. ఏప్రిల్ చివరి వారం మహేష్‌బాబుకు సెంటిమెంట్‌గా నిలిచింది. ఈ వారంలోనే ఈ సూపర్‌స్టార్ బిగ్గెస్ట్ హిట్ సినిమాలు పోకిరి, భరత్ అనే నేను విడుదలయ్యాయి. అందుకే ఇదే వారంలో సినిమాను విడుదల చేయాలని అనుకుంటున్నారు. ఇక హాట్ బ్యూటీ పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని దిల్‌రాజు, అశ్వనీదత్, పివిపి కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అల్లరి నరేష్ మహేష్‌బాబు స్నేహితునిగా నటిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ త్వరలో తమిళనాడులోని పొల్లాచ్చిలో ప్రారంభం కానుంది. ఇక విజయ్ దేవరకొండతో ‘అర్జున్‌రెడ్డి’ వంటి బ్లాక్‌బస్టర్ హిట్ మూవీ చేసిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగ... మహేష్‌తో ఓ సినిమా చేసేందుకు ప్లాన్ చేసిన విషయం తెలిసిందే. గతంలోనే సందీప్ రెడ్డితో సినిమా చేసేందుకు ఈ సూపర్‌స్టార్ ఓకే చెప్పారు. మహేష్ కోసం పలు కథలు తయారు చేసి సందీప్ వినిపించాడు. ఎట్టకేలకు సందీప్ రెడ్డి చెప్పిన కథకు మహేష్‌బాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఈ సూపర్‌స్టార్ కోసం దర్శకుడు ఓ పోలీస్ స్టోరీని రూపొందించాడట. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియరానున్నాయి.

దేర్ ఈజ్ లవ్...దేర్ ఈజ్ పెయిన్

పెళ్లి తర్వాత అక్కినేని నాగచైతన్య, సమంత కలిసి నటిస్తున్న తొలి చిత్రం ‘మజిలి’. కొత్త సంవత్సరం సందర్భంగా విడుదలైన ఫస్ట్‌లుక్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇప్పుడు రెండో లుక్‌ను సంక్రాంతి సందర్భంగా విడుదల చేశారు. నాగచైతన్యతో పాటు ఈ చిత్రంలో రెండో హీరోయిన్‌గా నటిస్తున్న దివ్యాంశ కౌశిక్ ఈ లుక్‌లో ఉన్నారు. ఇది ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఫస్ట్‌లుక్‌లో గడ్డంతో కనిపించిన నాగచైతన్య ఈసారి మాత్రం క్లీన్ షేవ్‌తో ఉన్నారు. పైగా చేతిలో క్రికెట్ బ్యాట్ పట్టుకొని చాలా స్టైలిష్‌గా ఉన్నారు. దివ్యాంశ కౌశిక్ కూడా చాలా అందంగా కనిపిస్తోంది. దేర్ ఈజ్ లవ్... దేర్ ఈజ్ పెయిన్ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రాన్ని వైజాగ్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు దర్శకుడు శివ నిర్వాణ. ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మూవీ షూటింగ్ 80 శాతం పూర్తయింది. రావు రమేష్, పోసాని కృష్ణమురళి, సుబ్బరాజ్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గోపిసుందర్ సంగీతాన్ని అందిస్తుండగా విష్ణు వర్మ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ పూడి, ఆర్ట్: సాహి సురేష్.



దివ్యాంశ కౌశిక్, నాగచైతన్య

మార్చి 1న ఎబిసిడి



అల్లు శిరీష్

అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘ఎబిసిడి’. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. సీనియర్ నిర్మాత డి.సురేష్‌బాబు ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ప్రతిష్టాత్మక సురేష్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. మెగా బ్రదర్ నాగబాబు ఇందులో అల్లు శిరీష్‌కు తండ్రి పాత్రలో నటించారు. బాలనటుడిగా మనకు సుపరిచితుడైన భరత్ ఇందులో హీరో ఫ్రెండ్ పాత్రలో నటిస్తున్నాడు. రుక్సార్ ధిల్లాన్ హీరోయిన్. సంజీవ్ రెడ్డి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. బిగ్‌బెన్ సినిమాస్ యశ్ రంగినేనితో కలిసి మధుర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో మధుర శ్రీధర్ ఈ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తున్నారు. కన్నడ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ జుధా సాంధీ ఈ చిత్రానికి సంగీతాన్ని సమకూరుస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి ఈ చిత్రాన్ని మార్చి 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ ‘‘మలయాళంలో సూపర్ సక్సెస్ అందుకున్న ‘ఎబిసిడి’ చిత్రాన్ని తెలుగులో అల్లు శిరీష్‌తో నిర్మిస్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. మలయాళంలో దుల్కర్ పోషించిన పాత్రను తెలుగులో శిరీష్ పోషిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్ ద్వారా ఈ చిత్రాన్ని మార్చి 1న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నాం. దర్శకుడు సంజీవ్ రెడ్డి తెలుగు ప్రేక్షకులు మెచ్చే విధంగా ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి’’అని అన్నారు.

వాస్తవ సంఘటనల ఆధారంగా...

నిఖిల్ సిద్ధార్థ్, లావణ్య త్రిపాఠి హీరోహీరోయిన్లుగా తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ముద్ర’. టి.ఎన్.సంతోష్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. వాస్తవ సంఘటనల ఆధారంగా జర్నలిజం నేపథ్యంలో తెరకెక్కుతున్న సినిమా ఇది. షూటింగ్ చివరి దశలో ఉంది. ఐదు రోజుల టాకీ, ఓ పాటను ఈ నెలలో పూర్తిచేయనున్నారు. డబ్బింగ్ వర్క్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ను ఒకేసారి పూర్తిచేస్తున్నారు ఫిల్మ్‌మేకర్స్. ఈ చిత్రంలో అద్భుతమైన గ్రాఫిక్ వర్క్స్ కూడా ఉన్నాయి. దీంతో పాటు భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు కూడా ఉన్నాయి. అందుకే కాస్త ఎక్కువ సమయం తీసుకుంటున్నారు. ఇందులో జర్నలిస్ట్ పాత్రలో నటిస్తున్నారు నిఖిల్. ఫస్ట్‌లుక్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. త్వరలోనే టీజర్ విడుదల కానుంది. శ్యామ్ సిఎస్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. వెన్నెల కిషోర్, పోసాని కృష్ణమురళి, నాగినీడు, ప్రగతి, సత్య, తరుణ్ అరోరా, రాజా రవీంద్ర ఈ చిత్రంలో సహాయ పాత్రల్లో నటిస్తున్నారు. ఔరా సినిమాస్ పివిటి, మూవీ డైనమిక్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై కావ్య వేణుగోపాల్, రాజు కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సూర్య, ఆర్ట్: సాహి సురేష్, ఫైట్స్: వెంకట్.



క్రేజీ కాంబినేషన్‌లో హారర్ థ్రిల్లర్



మాధవన్, అనుష్క

బహుభాషా నటుడు మాధవన్, స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి, యంగ్ హీరోయిన్ షాలిని పాండే ప్రధాన తారాగణంగా ఓ హారర్ థ్రిల్లర్ తెరకెక్కనుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిలిం కార్పొరేషన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని పలు భాషలలో నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నాయి. తెలుగు, తమిళ్, హాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులతో నిర్మితమవుతున్న తొలి క్రాస్ ఓవర్ చిత్రమిది. ఇందులో అవసరాల శ్రీనివాస్, సుబ్బరాజు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తారు. హేమంత్ మధుకర్ దర్శకత్వం వహించే ఈ చిత్రానికి కోన వెంకట్, గోపి సుందర్, షనీల్ డియో, గోపి మోహన్, నీరజ కోనలు సాంకేతిక నిపుణులు. మార్చి నెలలో ఈ చిత్రం షూటింగ్ అమెరికాలో ప్రారంభమవుతుంది. ఈ ఏడాది ద్వితీయార్థంలో ఈ సినిమా విడుదలవుతుందని చిత్ర నిర్మాణ సంస్థల అధినేతలు టి.జి.విశ్వప్రసాద్, కోన వెంకట్‌లు తెలిపారు.

అలాంటి గురువు ఎలాంటి గురుదక్షిణ అడిగాడు?



సందీప్ కిషన్

యువ కథానాయకుడు సందీప్ కిషన్, ‘సుబ్రమణ్యపురం’ చిత్రంతో విమర్శకుల మెప్పు పొందిన దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కాంబినేషన్‌లో క్రీడా నేపథ్యంలో ఒక సినిమా రాబోతోంది. భారతంలో తన బొమ్మను గురువుగా భావించి విద్య నేర్చుకున్న ఏకలవ్యుడి నుంచి బొటనవేలును గురుదక్షిణగా తీసుకున్నాడు ద్రోణాచార్యులు. ఈ ఆధునిక కాలంలో అలాంటి ఒక గురువు ఎలాంటి గురుదక్షిణ అడిగాడు అనే ఉత్సుకత రేకెత్తించే కథాంశంతోఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. ‘కార్తికేయ’ లాంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన వెంకట శ్రీనివాస్ బొగ్గరమ్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.



సస్పెన్స్ థ్రిల్లర్

నాగశౌర్య, కె.ఎస్.రామారావు, శివ కంఠంనేని, శ్రీపాద విశ్వక్ తదితరులు

శివ కంఠంనేని టైటిల్ పాత్రలో రూపొందిన చిత్రం ‘అక్కడొకడుంటాడు’. రామ్‌కార్తీక్, శివ హరీష్, అలేఖ్య, రసజ్ఞ దీపిక హీరోహీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో అల్లరి రవిబాబు, వినోద్‌కుమార్, ఇంద్రజ ప్రధాన పాత్రల్లో నటించారు. శ్రీపాద విశ్వక్ దర్శకత్వంలో లైట్‌హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై కె.శివశంకర రావు, రావుల వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ సినిమా ట్రైలర్‌ను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హీరో నాగశౌర్య ఆవిష్కరించగా చిత్రంలోని ‘ఆడి పాడి గడిపేద్దాం...’ అంటూ సాగే పాటను నిర్మాత కె.ఎస్.రామారావు విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.ఎస్.రామారావు మాట్లాడుతూ ‘‘ట్రైలర్, పాట చాలా బావున్నాయి. చిత్రం విజయం సాధించాలని కోరుకుంటున్నాను’’అని అన్నారు. నాగశౌర్య మాట్లాడుతూ ‘‘సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం ట్రైలర్, పోస్టర్స్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. టైటిల్ పాత్రధారి శివ కంఠంనేని తన పాత్రలో చక్కగా ఒదిగిపోయారు’’అని తెలిపారు. శివ కంఠంనేని మాట్లాడుతూ ‘‘డ్రంకన్ డ్రైవ్ వల్ల కలిగే అనర్థాలను ఈ చిత్రంలో చూపిస్తున్నాము. అనుక్షణం ఉత్కంఠను కలిగిస్తూ ప్రేక్షకులను అలరించే చిత్రమిది’’అని పేర్కొన్నారు. దర్శకుడు శ్రీపాద విశ్వక్ మాట్లాడుతూ ‘‘అనుకోని ఆపదలో చిక్కుకున్న ప్రేమ జంటకు స్నేహితుల సహాయం అందే సమయంలో మరో ప్రమాదం ఎదుర వుతుంది. దాని నుంచి ఆ ప్రేమ జంట ఎలా బయటపడిందన్నదే ఈ చిత్ర ప్రధానాంశం’’అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలలో ఒకరైన రావుల వెంకటేశ్వర రావు, హీరోహీరోయిన్లతో పాటు చిత్ర బృందం పాల్గొంది.



దర్శకుడు కట్టా రంగారావు కన్నుమూత

ప్రముఖ దర్శకులు కట్టా రంగారావు (62) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. 1957 సంవత్సరం మే 5న తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ సర్పంచి కట్టా వెంకటరామయ్య, అనుసూర్య దంపతులకు ఆయన జన్మించారు. ‘ఇంద్రధనస్సు’ చిత్రంతో దర్శకులుగా మారిన ఆయన ఉద్యమం, అలెగ్జాండర్, నమస్తే అన్నా, బొబ్బిలి బుల్లోడు తదితర చిత్రాలను రూపొందించారు. సూర్యాపేట జిల్లాలోని మేడారం గ్రామంలో సోమవారం సాయంత్రం ఆయన అంత్యక్రియలను నిర్వహించారు.

శ్రద్ధ స్వీట్ సర్‌ప్రైజ్

బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధాకపూర్ ప్రస్తుతం ప్రభాస్ తాజా చిత్రం ‘సాహో’లో హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. తెలుగు, తమిళ్, హిందీ భాషలలో ఒకేసారి తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ చాలా రోజుల నుండి రామోజీ ఫిలిం సిటీలో జరుగుతోంది. ఇదిలాఉండగా శ్రద్ధ ప్రస్తుతం ముంబయ్‌లో తన ఇంట్లోనే సంక్రాంతి పండుగను జరుపుకుంటోంది. పండుగ సందర్భంగా ప్రభాస్‌కు, ఇతర ‘సాహో’ టీమ్ సభ్యులకు ఆమె ఒక స్వీట్ సర్‌ప్రైజ్ ఇచ్చిందట. స్వీట్ సర్‌ప్రైజ్ అంటే నిజంగా స్వీట్లతోనే సర్‌ప్రైజ్. మహారాష్ట్ర స్పెషల్ స్వీట్ అయిన తిల్ గుల్ లడ్డూల బాక్సులను ప్రభాస్, ‘సాహో’ టీమ్‌కు పండుగ స్పెషల్‌గా పంపించిందట. శ్రద్ధాకపూర్‌కు మొదటి నుంచి ‘సాహో’ టీమ్‌తో మంచి అనుబంధం ఏర్పడింది. ముఖ్యంగా ప్రభాస్ ఫ్రెండ్లీ నేచర్‌తో ఈ ముంబయ్ భామ ఫ్లాట్ అయిపోయింది. ఈ స్టార్ హీరో తన ఇంటి నుండి ప్రత్యేకంగా వంటలు చేయించి వాటిని షూటింగ్ లొకేషన్‌కు తెప్పించి శ్రద్ధాకు స్పెషల్ ట్రీట్ ఇవ్వడంతో ఆమె ఖుష్ అయింది. అప్పట్లో ఈ భామ ఆ వంటకాల ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసి అభిమానులతో ఈ విషయాన్ని పంచుకుంది. అందుకే ఇప్పుడు మహారాష్ట్ర సంప్రదాయ స్వీట్లతో ‘సాహో’ టీమ్‌కు సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఇక ‘సాహో’ చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.



శ్రద్ధాకపూర్




కియారా అద్వానీ

భారీ పారితోషికం డిమాండ్

మహేష్‌బాబు చిత్రం ‘భరత్ అనే నేను’తో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వాని టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడంతో ఈ భామకు తెలుగులో మంచి క్రేజ్ ఏర్పడింది. ఇటీవల కియారా రెండో తెలుగు సినిమా ‘వినయ విధేయ రామ’ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ భామ రెమ్యునరేషన్ ఇప్పుడు టాలీవుడ్‌లో ఓ హాట్ టాపిక్ అయింది. హీరో గోపీచంద్‌తో దర్శకుడు సంపత్‌నంది ఓ సినిమా చేసేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ జోరుగా సాగుతోంది. ఇందులో గోపీచంద్ సరసన హీరోయిన్‌గా కియారా అద్వానీని తీసుకుందామని అనుకున్నారట. ఈ విషయమై ఆమెతో చర్చలు జరిపితే రూ.1.25 కోట్ల రెమ్యునరేషన్ ఇవ్వాలని కియారా డిమాండ్ చేసిందట. మరి ఈ బ్యూటీ అడిగిన పారితోషికం ఇచ్చి ఆమెను హీరోయిన్‌గా తీసుకుంటారా లేదా మరో హీరోయిన్‌ను తీసుకుంటారా అనేది చూడాలి. కియారాకు బాలీవుడ్‌లో ప్రస్తుతం రెండు ప్రాజెక్టులు చేతిలో ఉన్నాయి. వాటిలో ఒకటి ‘అర్జున్ రెడ్డి’ హిందీ రీమేక్ ‘కబీర్ సింగ్’ కాగా రెండోది కరణ్ జోహార్ ఫిలిం. అందుకే కియారా అద్వానీ తన రెమ్యునరేషన్ విషయంలో ఏమాత్రం తగ్గడం లేదట.

పోటీ



ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య
కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202

తొలి భారతీయ మహిళా విశ్వవిద్యాలయం ఎక్కడ?

రామకృష్ణ పరమహంస (1836-86)

- ఇష్టదైవం – శారదాదేవి.
- 1836లో కలకత్తా దగ్గర గల దక్షిణేశ్వర్ వద్ద పేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు.
- ఇతడు కాళీమాత భక్తుడు.
- ప్రపంచంలో అనేక మతాలు కలవని వాటి అంతిమలక్ష్యం – మోక్షం అని పేర్కొన్నాడు.
- మోక్షం సాధించుటకు ఒక్కోక్క మతం ఒక్కో పద్ధతిని అవలంభిస్తుందని అన్నాడు.
- మానవసేవయే, మాదవసేవ అని పేర్కొన్నాడు.

స్వామి వివేకానంద (1863-1902)

- అసలు పేరు – నరేంద్రనాథ్ దత్తా.
- బిరుదులు – స్వామి, కర్మయోగి, హిందూమత ఆధ్యాత్మిక సూర్యుడు, ఆధునిక భారత జాతీయత పితామహుడు.
- నినాదంలు – దారిద్ర్య దేవోభవ, భారతదేశం భారతీయుల కోసం.
- పుస్తకాలు – రాజయోగ, కర్మయోగ, భక్తయోగ, జ్ఞానయోగ, నాగురువు.
- సంస్థ – రామకృష్ణ మిషన్ 1897లో బేలూరు దగ్గర స్థాపించబడింది.
- రామకృష్ణ మిషన్ రెండు వార్తాపత్రికలను ప్రచురించింది.

1. ప్రబుద్ధ భారత్ (ఆంగ్లం).
2. ఉద్బోధన (బెంగాలీ).

- 1886లో ఖేత్రిరాజు 'అజిత్‌సింగ్' సలహా మేరకు తన పేరు వివేకానందుడిగా మార్చుకున్నాడు.
- 1888లో సన్యాసిగా మారాడు.
- 1893 సెప్టెంబర్ 11 అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ తొలి సర్వమత సమ్మేళనంలో హిందూమతం యొక్క గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేశాడు.
- 1895 – న్యూయార్క్‌లో మొదటి వేదాంత సొసైటీని స్థాపించాడు.
- వివేకానందుడి శిష్యురాలు – మార్గరెట్ నోబుల్ / సిస్టర్ నివేదిత
- 1898లో నివేదిత ఐర్లాండ్ నుండి భారత్‌కు వచ్చింది. తన శేష జీవితాన్ని రామకృష్ణ మిషన్‌కు అంకితం చేసింది.
- మార్గరేట్ నోబుల్ రచనలు : 1) the mother 2) Kall 3) The mastera I saw him.
- ప్రాచీన భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచదేశాలకు చాటిచెప్పాడు.
- పిరికితనంను ఖండించడంతో స్వాతంత్రోద్యమ కాలంలో చాలామంది నాయకులకు ఆదర్శంగా నిలిచాడు.
- రామకృష్ణ మిషన్ ఉచిత పాఠశాలలు, వైద్యశాలలు, గ్రంథాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు ఏర్పాటు చేసింది.

వివేకానందునిపై వ్యాఖ్యలు

- ''వివేకానందుడు సృష్టికే మేధావి'' అని వర్ణించినదిరవీంద్రనాథ్ ఠాగూర్
- వివేకానందుడు భారతదేశాన్ని ఆధ్యాత్మికతతో మేల్కొల్పిన వాడు – సుభాష్ చంద్రబోస్. ''ఆధునిక భారత నిర్మాత''గా అరబిందో.
- Vivekananda Saved Hinduism – రాజాజీ

దివ్యజ్ఞాన సమాజం -నూయ్యార్క్1875

- దియోస్ – దైవ్యం, సోఫియో– జ్ఞాన అనే పదాల నుండి దివ్యజ్ఞాన సమాజం పుట్టింది.
- 1875లో H.P.బ్లావట్స్కీ (రష్యావనిత) H.S.ఆల్కాట్‌లు, విలియం క్వాన్ జడ్‌జలు న్యూయార్క్ (హడ్సన్ నదితీరం) (Newyarkఅనగా The big Apple అని అర్థం)
- దీనిని ప్రధానంగా మూడు ఉద్దేశాలతో స్థాపించారు

1) విశ్వమానవ సౌభ్రాతృత్వం
2) అన్ని మతాల అంతిమలక్ష్యం మోక్షం, ఈ మతాల తత్వంను తెలుసుకొనుటకు వాటిని అధ్యయనం చేయాలి.
3) ప్రకృతిలో మానవునిలో ఉండే అంతర్గత శక్తులను పరిశోధించాలి.

- దివ్యజ్ఞాన సమాజం ప్రధాన లక్ష్యం – 'మానవసేవ'
- 1879లో దీని ప్రధానకేంద్రంను బొంబాయికి ఆ తర్వాత 1882లో మద్రాస్‌కు సమీపాన గల అడయార్‌కు మార్చారు.
- H.P. బ్లావట్స్కీ మరణాంతరం H.S.అల్కాట్ దివ్యజ్ఞాన సమాజానికి అధ్యక్షుడైనాడు.
- H.P.బ్లావట్స్కీ యొక్క మ్యాగజైన్ – The theosophist (1879)

అనిబిసెంట్ : (1874-1933)

- అనిబిసెంట్ అసలు పేరు – అనిఉడ్
- ఐర్లాండ్ మహిళ
- **పత్రికలు- :** న్యూ ఇండదియా (Daily), కామన్‌వీల్ (Weekly)
- **బిరుదులు :** Iron lady of Irland. Diamond south, ఇండియన్ టార్గెట్ Grand old lady of india.
- **నినాదం :** England's difficulty is indians opportunity
- H.P.బ్లావట్స్కీ – 'రహస్య సిద్ధాంతం' ద్వారా ప్రభావితమైన అనిబిసెంట్ 1889 లండన్‌లో దివ్యజ్ఞాన సమాజంలో చేరింది.
- 1893లో Indiaకు వచ్చింది.
- H.P.బ్లావట్స్కీ మరణానంతరం H.S.అల్కాట్ దివ్యజ్ఞాన సమాజానికి అధ్యక్షుడు కాగా ఆ తర్వాత అనిబిసెంట్ 1907లో దివ్యజ్ఞాన సమాజానికి అధ్యక్షురాలైంది.
- 1898లో వారణాశిలో బెనారస్ కేంద్ర హిందూ కళాశాలను ఏర్పాటు చేయగా ఇది 1916లో మదన్ మోహన్‌మాలవ్య కృషి ఫలితంగా యూనివర్శిటీగా మారింది.
- 1916 మేలో మదనపల్లె (చిత్తూరు)లో ''Beasent Theosophical College (జాతీయ కళాశాలను ఆంధ్ర పర్యటనలో భాగంగా స్థాపించింది).
- దీని మొదటి ప్రిన్సిపాల్ – H.g. కజిన్స్
- ఆర్కాట్‌లో పంచమ పాఠశాలను స్థాపించినది.
- భగవద్గీతను (భగవాన్‌దాస్ సహకారంతో) ఆంగ్లంలోకి అనువదించినది.
- 1914లో INC లో చేరింది.
- Wake up india పేరుతో జనంలోకి వెళ్లినది.
- 1916లో ఐర్లాండ్ తరహాలో హోంరూల్ ఉద్యమంను ప్రారంభించగా ఊటీలో అరెస్టు చేశారు.
- భారత్‌లో తొలిసారిగా 1916 పూణెలో ప్రారంభించినారు – తిలక్ (తర్వాత ఇది All India Home Rule leagueలో విలీనం అయినది)
- All india Home Rule league యొక్క తొలి కార్యదర్శి – జార్జ్ అరుండేల్
- 1916 లక్నోలో ఎ.సి.మజుందార్ నేతృత్వంలో జరిగిన ఐఎన్‌సి సమావేశంలో మితవాదులు, అతివాదులు, ముస్లింలీగ్ విలీనం అవడంతో తిలక్, జిన్నాతో పాటు అనిబిసెంట్ కూడా కీలకపాత్ర పోషించింది.
- 1917లో కలకత్తాలో జరిగిన INC సమావేశానికి తొలి మహిళగా అధ్యక్షత వహించింది.
- లూసిఫేర్ / లిజాఫేర్ జర్నల్‌కు ఎడిటర్‌గా పనిచేసింది.
- 1918లో ''ఇండియన్ బాయ్స్ & స్కాట్స్ అసోసియేషన్''ను స్థాపించింది.
- 1921లో కాశీవిశ్వవిద్యాలయం నుండి డాక్టర్ ఆఫ్ లెటర్స్ బిరుదు పొందింది.
- 1932లో స్కాట్స్‌లోనే ఉన్నతమైన Silvor wolf మెడల్‌ను బాడెన్ ఫోవెల్ నుండి పొందింది.
- ఉమెన్స్ ఇండియా అసోసియేషన్‌కు మద్దతిచ్చి తొలి అధ్యక్షురాలైంది.
- అనిబిసెంట్ యొక్క ముఖ్య అనుచరులు (1) B.P.వాడియా (2) జార్జ్ అరుండేల్
- ఈమె 1933 సెప్టెంబర్ 20న మద్రాస్‌లో అడయార్‌లో మరణించింది.
- అనిబిసెంట్ తర్వాత దివ్యజ్ఞాన సమాజంకు – జార్జ్ అరుండేల్ (1933–45) ఆ తర్వాత – C, సినరాజదాస (1945–1953) అధ్యక్షులైయ్యారు.
- దివ్యాజ్ఞాన సమాజానికి అధ్యక్షుడైన మొదటి భారతీయుడు సినరాజదాస

జిడ్డు కృష్ణమూర్తి

- అనిబిసెంట్ దత్తపుత్రుడు – జిడ్డు కృష్ణమూర్తి
- ఇతని పుస్తకం – At the feet of the master
- సిద్ధాంతం – గురువు లేకుండా సత్యాన్ని సాధించడం – (Endeavour Alone in search of Truth)
- లీడ్‌బీటర్ ఇతన్ని – మోసస్, ప్రవక్త ''Vehicle for the expected world teacher'' అని వర్ణించాడు.
- జి.కె.మూర్తి 1921లో మదనపల్లెలో ఋషీవ్యాలీ పాఠశాలను స్థాపించాడు.
- ఇతని ప్రధాన కేంద్రాలు – 1.వసంత విహార్, 2. మజాహి (కాలిఫోర్నియా)

ప్రార్థనా సమాజం-బొంబాయి (1867)

- దీనిని బొంబాయిలో అత్మారాం పాండురంగ స్థాపించాడు.
- దీని ముఖ్యలక్ష్యాలు : సాంఘిక సంస్కరణలు, భగవంతున్ని పూజించడం
- దీనిలో ప్రముఖ సభ్యులు M.G. రణడే, పండిత రమాబాయి సరస్వతి, విఠల్ రాంజీ షిండే, N.G. చంద్రవార్కర్, బాలకృష్ణ మొదలగుఉన్నారు.
- 1906లో బాలకృష్ణ – 'భారత బడుగు జాతుల సమతి ' Depressed Classes mission of india ను స్థాపించాడు.
- కందుకూరి గారు ప్రార్థనా సమాజంను దక్షిణ భారతదేశంలో వ్యాప్తి చేశారు (1878 రాజమండ్రి)
- దీనిలోని సభ్యులంతా ఆస్తికవాదులు. దేవుడు ఒక్కడే అని పేర్కొంది.

M.G. రణడే (1842-1901)

- **బిరుదు :** మహారాష్ట్ర సోక్రటీస్
- మహారాష్ట్రలో ప్రార్థనా సమాజ స్థాపకుడు
- గణేష్ వాసుదేవ స్థాపించిన సార్వజనిక సభ కార్యక్రమాల్లో పాల్గొన్నాడు.
- హిందూ ప్రకాష్ అనే ఆంగ్ల మరాఠా పత్రికకు సంపాదకుడు.
- 1887లో భారతజాతీయ సామాజిక సమావేశాన్ని మద్రాస్‌లో ప్రారంభించాడు.
- రణడే పరిశుద్ధి ఉద్యమంను ప్రారంభించాడు.

D.K. కార్వే (1858-1961)

- 1893లో వితంతువును వివాహం చేసుకున్నాడు.
- 1896లో హిందూ వితంత భవనంను ప్రారంభించాడు.
- 1916లో భారతదేశంలోనే తొలిసారిగా మహిళల కోసం భారతీయ మహిళా విశ్వవిద్యాలయంను పూణేలో స్థాపించాడు.
- ఇతను 1955లో పద్మవిభూషణ్‌ను, 1958 భారతరత్న బిరుదులను పొందాడు.


హెచ్ఐవి సోకిన పిల్లల్లో
గ్రహణశక్తి లోపం




హ్యూమన్ ఇమ్యునోడెఫిసియెన్సీ వైరస్ (హెచ్ఐవి) సోకిన పిల్లల్లో వారి నరాల వృద్ధి, గ్రహణ శక్తిపై వ్యతిరేక ప్రభావం కనిపిస్తుందని కొత్త అధ్యయనం వెల్లడించింది. గురుగ్రామ్ లోని ఫోర్టిస్ మెమోరియల్ రీసెర్చి ఇనిస్టిట్యూట్, లక్నో లోని కింగ్‌జార్జి మెడికల్ యూనివర్సిటీ, కతర్, దోహా లోని సిద్రా మెడిసిన్‌కు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనం చేపట్టారు. మెదడు లోని చెప్పుకోదగిన చర్యలను విశ్లేషించారు. మాట్లాడడం, భాషాపరిజ్ఞానం, ఇంద్రియ పరిజ్ఞానం, ఇతర చర్యలను గమనించారు. హెచ్ఐవి బాధితులైన పెద్దల్లో మానసిక వికాసం క్షీణిస్తుండడం సర్వసాధారణం. ఈ సాధారణ పరిస్థితి పెద్దవారైన రోగుల్లో డెమెన్షియా రూపంలో తాము గుర్తించామని వారిలో జ్ఞాపక శక్తి నశించడమే కాకుండా, ఆలోచించే శక్తి కూడా కోల్పోవడమవుతుందని చెప్పారు. ఫలితంగా మెదడు పనిచేసే విధానాన్ని లేదా మెదడు ఆకృతిని దెబ్బ తీసే పరిస్థితి ఏర్పడుతుందని దానినే ఎన్‌సెఫలో పథి అంటారని పరిశోధకులు పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితే హెచ్ఐవి సోకిన పిల్లల్లో కనిపిస్తుందని కింగ్‌జార్జి మెడికల్ యూనివర్శిటీ (లక్నో)కి చెందిన న్యూరాలజిస్టు డాక్టర్ రవీంద్ర గార్గ్ చెప్పారు. తూర్పు ఉత్తర ప్రదేశ్‌లో జాతీయ హెచ్ఐవి నియంత్రణ ప్రోగ్రాం కింద చికిత్స పొందిన హెఐవి బాధితులైన 26 మంది పిల్లలను హెచ్ఐవి సోకని 20 మంది పిల్లలను సమీక్షించారు. ఈ పిల్లల వయస్సు పది సంవత్సరాలు. వీరందరికీ మెదడు ఎలా పనిచేస్తుందో మెదడులో ఎలాంటి మార్పులు కనిపించాయో వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించారు. మేగ్నటిక్ రిసొనాన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ),జెనరేటెడ్ మ్యాప్స్ ఆఫ్ యాంప్లిట్యూడ్ ఆఫ్ లో ఫ్రీక్వెన్సీ (ఎఫ్‌సి) తదితర పరీక్షలతో మెదడును విశ్లేషించారు. న్యూరోసైకలాజికల్ సమీక్ష ఫలితాలతో ఈ ఫలితాలు ఏకీభవించాయి. మొత్తం మీద ఈ అధ్యయనంలో తేలిందేమిటంటే హెచ్ఐవి పిల్లల్లో న్యూరోసైకలాజికల్ పరీక్ష ఫలితాలు తక్కువగా స్కోరు అయ్యాయి. మెదడు లోని కొన్ని నిర్దిష్ట గ్రహణ పరిజ్ఞాన శక్తికి సంబంధించిన రీజియన్ల సామర్ధ్యం తగ్గింది. హెచ్ఐవి వైరస్ వ్యాధినిరోధక శక్తిని నశింప చేస్తుంది. శరీరం లోని ప్రతి భాగాన్ని నిర్వీర్యం చేస్తుంది. భారత్ లోని దాదాపు 60,000 మంది పిల్లలు హెచ్ఐవి నివారణ కోసం యాంటీ రిట్రోవైరల్ థెరపీని ఇటీవల తీసుకున్నారు. భౌతికంగా మానసికంగా దెబ్బతిన్న వీరిని డాక్టర్లు చికిత్స చేశారు. ఈ వైరస్ రోగి రక్తంలో తిష్టవేసి ప్రతి భాగాన్ని దెబ్బతీస్తుంది. మెదడు, గుండె, మూత్రపిండాలు, కాలేయం తదితర ముఖ్యమైన భాగాలకు చేటు తెస్తుంది. రోగి వ్యాధినిరోధక శక్తితో కుమిలేలా చేస్తుంది. హెచ్ఐవి బాధిత పిల్లలను కాపాడుకోవాలంటే ముఖ్యంగా మంచి పుష్టికరమైన ఆహారం అందించాలి. నూటికి నూరు పాళ్లు మందులు నిత్యం అందుతుండాలి. రెగ్యులర్‌గా వ్యాయామం చేయాలి. దీనివల్ల వైరస్ బలం తగ్గి వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. సిడి 4 వ్యాధినిరోధక కణాల సంఖ్య పెరుగుతుంది. కానీ అత్యధిక శాతం పిల్లలు దీన్ని సాధించ లేక పోతున్నారు.

– సైన్స్ విభాగం






చంద్రుని ఉష్ణోగ్రతను కొలవనున్న చాంగ్ ఇ-4



బీజింగ్ : చంద్రుని అవతలి వైపు చీకటి ప్రదేశంలో కాలుమోపిన చాంగ్ ఇ–4 వ్యోమనౌక చంద్రుని ఉష్ణోగ్రతను కొలవనున్నది. రాత్రి పూట గడ్డ కట్టే శీతల ఉష్ణోగ్రతను కొలుస్తుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. చాంగ్ ఇ–4 జనవరి 3న చంద్రుని అవతలి వైపు చీకటి ప్రదేశంలో దిగిన సంగతి తెలిసిందే. ఇంతవరకు చంద్రుని అవతలి వైపు ఎలా ఉంటుందో ఏ దేశమూ పట్టించుకోలేదు. ఆ ఘనత చైనాకే దక్కింది. చంద్రునిపై పగలు కానీ రాత్రి రానీ భూగోళంపై 14 రోజులకు సమానం. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు మాత్రం చాలా తేడాగా ఉంటాయి. పగటి పూట చంద్రుని అత్యధిక ఉష్ణోగ్రత 127 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉంటుండగా రాత్రి మాత్రం ఉష్ణోగ్రతలు –183 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉండడం గమనార్హం. 2013 లో చైనా మొట్టమొదటి సారి చంద్రుని సున్నితమైన ఉపరితలంపైకి చాంగ్ ఇ–3 ని పంపింది. ఆ వ్యోమనౌక శాస్త్రీయ సాధనాలు ఇంచా ఇప్పటికీ అక్కడ పనిచేస్తున్నాయి. గత అయిదేళ్లలో 60 కన్నా ఎక్కువ చంద్రుని రాత్రుళ్లను ఆ వ్యోమనౌక గడిపింది. ఇప్పుడు చాంగ్ ఇ –4 చంద్రునిపై పగలురాత్రుళ్ల మధ్య ఉష్ణోగ్రతల తేడాలను లెక్క కడుతుంది. దీనివల్ల చంద్రుని ఉపరితల మట్టి లక్షణాలను అంచనా వేయడానికి శాస్త్రవేత్తలకు సహకారలం లభిస్తుంది. రాత్రుళ్లు సౌర విద్యుత్ అందనందున చాంగ్ ఇ –4 వ్యోమనౌకను నిద్రపుచ్చడమవుతుందని, రేడియో ఐసోటోప్ వేడి ఆధారంగా వేడిని కొనసాగించడానికి రష్యా, చైనా శాస్త్రవేత్తల సమష్టి కృషితో పనిచేయించడమవుతుందని చైనా న్యూస్ ఏజెన్సీ జిన్హుయా వెల్లడిందింది.


– సైన్స్ విభాగం






యాంటీ బయోటెక్‌ను ప్రతిఘటించే బ్యాక్టీరియా

యాంటీబయోటెక్‌ను ప్రతిఘటించే కొత్తరకం బ్యాక్టీరియాను చైనా లోని ఇద్దరి రోగుల రక్తంలో కనుగొన్నారు. ఎంటెరోబాక్టర్ హుయాక్సిఎన్సెస్, ఎంటెరోబాక్టెర్ చుయాండ ఎన్సిస్ అనే ఇంతవరకు ఎవరూ గుర్తించని రెండు రకాల బ్యాక్టీరియాను ఆ రోగుల రక్తంలో ఉండ డాన్ని గుర్తించారు. ఇవి పెన్సిలిన్ లేదా సిఫలో స్పోరిన్ గ్రూపు యాంటీబయోటిక్స్‌కు ఏమాత్రం స్పందించడం లేదని శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ కొత్త బ్యాక్టీరియా ప్రాణాంతక వ్యాధులను సంక్రమింప చేస్తాయని, వీటిని నయం చేయడం సాధ్యం కాదని శాస్త్రవేత్తలు వెల్లడించారు. వీటిని చికిత్స చేయడం ఆలస్యమైతే సెప్సిస్‌కు దారి తీస్తుందని చెప్పారు. – సైన్స్ విభాగం



నాళాల్లో రక్త ప్రవాహాన్ని పర్యవేక్షించే సెన్సర్

స్టాన్‌ఫర్డ్ శాస్త్రవేత్తలు బయోడిగ్రేడబుల్, బ్యాటరీ ఫ్రీ సెన్సార్‌ను కనుగొన్నారు. ధమని ద్వారా రక్తప్రవాహం సరిగ్గా ఉందా లేదా అని ఈ సెన్సార్ పర్యవేక్షిస్తుంది. రక్తనాళ సర్జరీ జయప్రదం అయ్యేలా డాక్టర్లకు సహకరిస్తుంది. రక్తప్రవాహానికి ఆటంకం ఏర్పడితే డాక్టర్‌ను ఇది హెచ్చరిస్తుంది. ఈ సాధనాన్ని తొలగించవలసిన అవసరం లేదు. ఎక్కడైతే రక్తనాళం గాయపడిందో అక్కడ దీన్ని చుట్టి వేస్తారు. అక్కడ రక్తనాళం ద్వారా రక్తప్రవాహం వేగంగా జరుగుతుంది. అప్పుడు రక్తనాళం ఆకారం మారితే ఇది సెన్సార్ కెపాసిటీని మార్చి ఎలెక్ట్రిక్ చార్జిని స్టోర్ చేస్తుంది. ఈ సాధనం ద్వారా డాక్టర్లు చర్మానికి దగ్గరలో రక్తనాళాన్ని కనుగొన గలుగుతారు. భవిష్యత్తులో ఈ సాధనం స్టిక్ ఆన్ పాచ్ రూపంలో వస్తుంది. – సైన్స్ విభాగం



నాగేశ్వరరావు నియామకంపై సుప్రీంలో పిటిషన్



న్యూఢిల్లీ : సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం. నాగేశ్వరరావు నియామకాన్ని సోమవారం సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. నాగేశ్వరరావును సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నియమిస్తూ జనవరి 10న కేంద్రం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వును రద్దు చేయాలని కోరుతూ ఎన్‌జిఓ కామన్ కాజ్ సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. ప్రజాప్రయోజన వ్యాజ్యంగా ఈ పిటిషన్ అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్ ద్వారా దాఖలైంది. 2013లో లోక్‌పాల్, లోకాయుక్త చట్టంగా సవరణ పొందిన 1946 నాటి ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంలోని సెక్షన్ 4ఏ కింద సిబిఐకి రెగ్యులర్ డైరెక్టర్‌ను నియమించమని కేంద్రాన్ని ఆదేశించాల్సిందిగా ఆయన తన పిటిషన్‌లో కోరారు.

ఇండోనేసియా విమానం బ్లాక్ బాక్స్ లభ్యం

జకార్తా: గత ఏడాది అక్టోబర్‌లో కూలిన ఇండోనేసియాకు చెందిన లయన్ ఎయిర్ జెట్ విమానం కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌ను కనుగొన్నట్టు అధికారులు సోమవారం వెల్లడించారు. జరిగిన వెంటనే ఈ సరికొత్త విమానం ఎందుకు కూలిపోయిందనే ముఖ్యమైన సమాచారం ఈ బ్లాక్ బాక్స్ వల్ల తెలుస్తుందని వారన్నారు.ఇప్పుడు దొరికింది రెండో బ్లాక్ బాక్స్. జకార్తా నుంచి బయలుదేరిన 13 నిముషాల తర్వాత 737 మాక్స్ బోయింగ్ విమానం రాడార్ తెరమీద కనిపించకుండా పోయింది. దాంతో విమానాన్ని వెనక్కు తీసుకు రమ్మని పైలట్లను ఆదేశించారు. అయితే, ఆ తర్వాత కొద్ది క్షణాలకే విమానం జావా సముద్రంలో కూలిపోయింది. అందులో ప్రయాణిస్తున్న మొత్తం 189 మందీ మరణించారు. ఇలా ఉండగా, నవంబర్‌లో ఫ్లైట్ డాటా రికార్డర్ కనిపించిన చోటే పది మీటర్ల దూరంలో నారింజ రంగులో మెరిసిపోతున్న ఈ వాయిస్ రికార్డర్ కనిపించిందని అధికారుల తెలిపారు. 'ఇది రెండు ముక్కలు విరిగిపోయింది. అయినా ఇది దర్యాప్తు చేసేవారికి ఉపయోగపడుతుందనే అనుకుంటున్నాం' అని ఇండోనేసియా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ కమిటీ (ఎన్‌టిఎస్‌సి) డిప్యూటీ హెడ్ హర్యో సాట్మికో తెలిపారు.

నేడు మాయావతి పుట్టిన రోజు



లక్నో : రాజకీయ పరిస్థితి గురించి, సమాజ్‌వాది పార్టీతో (ఎస్.పి) పొత్తు గురించి బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రి మాయావతి మంగళవారం తన 63వ పుట్టినరోజు సందర్భంగా వివరించవచ్చని భావిస్తున్నారు. ఆమె పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజధానిలో వీధుల్లోనూ, పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద, ఆమె నివాసం వద్ద పెద్ద హోర్డింగ్‌లు, పార్టీ రంగును సూచిస్తూ నీలం రంగు బ్యానర్లను కట్టారు. తన పుట్టిన రోజున మాయావతి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, తన పుస్తకం.. 'ఏ ట్రావెలోగ్ ఆఫ్ మై స్ట్రగుల్ రిడెన్ లైఫ్ లయద బిఎస్‌పి మూవ్‌మెంట్' 14వ సంపుటిని విడుదల చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. లక్నోలో వేడుకల తర్వాత మాయావతి తన కుటుంబంతో గడపడానికి ఢిల్లీ వెడతారని వారు తెలిపారు.

అయిదో రోజూ పెరిగిన పెట్రో ధరలు

ఢిల్లీలో రూ.70 మార్క్ దాటిన పెట్రోలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతుండడంతో దేశీయంగా పెట్రోలు, డీజిలు ధరలు కూడా పెరుగుతున్నాయి. వరసగా అయిదో రోజు వీటి ధరలు పెరిగాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోలు ధర మళ్లీ రూ.70 మార్క్‌ను దాటింది. ప్రధాన చమురు సంస్థలు సోమవారం పెట్రోలు ధరపై 38 పైసలు, డీజిలుపై 49 పైసలు పెంచాయి. దీంతో ఢిల్లీలో లీటరు పెట్రోలు ధర రూ. 70.13కు, డీజిలు లీటరుకు రూ. 64.18కు చేరుకుంది.ఈ నెలలో ఇంధనం ధరలు పెరగడం ఇది ఆరో సారి. మొత్తమీద కొత్తసంవత్సరంలో లీటరు పెట్రోలు ధర రూ.1.84, డీజిలు రూ.2.02 పెరిగినట్లయింది. కాగా రాష్ట్రాల్లో వ్యాట్‌తో కలుపుకొంటే ముంబయిలో లీటరు పెట్రోలు రూ.75.77 డీజిల్ రూ.67.18కు చేరుకుంది. కోల్‌కతాలో వీటి ధరలు వరసగా రూ.72.24, రూ.65.95గా, చెన్నైలో రూ.72.79, రూ.67.73గా ఉన్నాయి.

ఇరాన్ విమాన ప్రమాదంలో 15 మంది మృతి



టెహరాన్ : దశాబ్దాల నాటి ఇరాన్ బోయింగ్ 707 విమానం దేశ రాజధాని పశ్చిమ ప్రాంతంలో కిందికి దిగుతుండగా సోమవారం కూలిపోయింది. అందులో ఉన్నవారిలో 15 మంది మరణించగా, ఒకరు మాత్రం బతికిబయట పడ్డారని అధికారులు తెలిపారు.ఇరాన్‌లోని శక్తివంతమైన పారా మిలిటరీ రివల్యూషనరీ గార్డ్ నిర్వహణలో ఉన్న ఫాత్ ఎయిర్‌పోర్ట్‌లో సోమవారం ఉదయం ఎనిమిదిన్నర గంటల ప్రాంతంలో అత్యవసరంగా దిగిన ఈ విమానం రన్ వే నుంచి పక్కకు దూసుకెళ్లింది. ఈ విమానం కిర్గిజ్‌స్థాన్ నుంచి మాంసాన్ని తీసుకెడుతున్నట్టు చెబుతున్నారు. ఇటీవల ఇరాన్‌లో సంభవించిన విమాన ప్రమాదాలోల ఈ జెట్‌లైనర్ ప్రమాదం రెండోది. అగ్ర దేశాలతో 2015లో కుదుర్చుకున్న అణు ఒప్పందం ప్రకారం ఇరాన్ కాలం చెల్లిన విమానాలను తొలగిస్తుందని అనుకుంటున్న తరుణంలో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే, ఈ ఒప్పందం నుంచి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వైదొలగడంతో పరిస్థితి తారుమారైంది. కొన్ని బిలియన్ డాలర్ల వ్యయమయ్యే విమానాల్ని ఇరాన్‌కు అమ్మేందుకు సిద్ధమైన ఎయిర్ బస్, బోయింగ్ కంపెనీ వెనకడుగు వేసింది.

ఎస్‌పి, బిఎస్‌పి కూటమికి ఆర్‌జెడి మద్దతు



లక్నో: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి), బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) కూటమికి తమ పార్టీ మద్దతిస్తుందని రాష్ట్రీయ జనతాదళ్ నాయకుడు తేజస్వీ యాదవ్ సోమవారం తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా పోరాడాలన్న రెండు ప్రాంతీయ పార్టీల సంకల్పం ఒక్క ఉత్తరప్రదేశ్‌నే కాదు, దేశం మొత్తాన్నీ ఉత్తేజపరిచింది. ఎస్‌పి అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌తో సమావేశం తర్వాత తేజస్వి విలేకరులతో మాట్లాడారు. ఎస్‌పి, బిఎస్‌పి కూటమికి ముందు ముందు మరింత మద్దతు లభిస్తుందని, సాధారణ ఎన్నికల తర్వాత కేంద్రంలో ఎవరు అధికారంలోకి రావాలన్నది ఉత్తరప్రదేశ్, బీహార్ నిర్ణయిస్తాయని ఆయన అన్నారు. ఆదివారం రాత్రి ఆయన బిఎస్‌పి అధినేత్రి మాయావతితో సమావేశమయ్యారు. తేజస్వి మద్దతుతో తమ కూటమి మరింత బలపడుతుందని అఖిలేష్ చెప్పారు. ప్రజలు కేంద్రంలో బిజెపిని గద్దె దింపుతారని అఖిలేష్, తేజస్వి నమ్మకంగా చెప్పారు. దేశ ప్రజలు బిజెపి పాలనతో అసంతృప్తితో ఉన్నారని, యుపిలో ఎస్‌పి, బిఎస్‌పికి ప్రజాదరణ లభించిందని అన్నారు. బిజెపి మోసం చేసింది కాబట్టి ఢిల్లీ నుంచి కోల్‌కతా దాకా ప్రజలు ఆ పార్టీని వ్యతిరేకిస్తున్నారని చెప్పారు.

జనసంద్రం..ప్రయాగ్‌రాజ్

- పవిత్ర స్నానాల కోసం లక్షల మంది రాక
- నేటినుంచి కుంభమేళా ప్రారంభం
- విస్తృత ఏర్పాట్లు చేసిన యుపి ప్రభుత్వం





అలహాబాద్: ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో మంగళవారంనుంచి ప్రారంభం కానున్న కుంభమేళాకు ఇప్పటికే లక్షలాది మంది భక్తులు తరలి రావడంతో త్రివేణీ సంగమ ప్రాంతమంతా జనసంద్రంగా మారిపోయింది. త్రివేణీసంగమంలో పవిత్ర స్నానమాచరించడానికి కిలోమీటర్లమేర కాలినడకన సాగే భక్తకోటి నోట 'చలే కుంభ్ చలే' అన్న మాట తప్ప మరోటి వినిపించడం లేదు. వారికి అదే నినాదం.. అదే మంత్రం. ఎంత కష్టమైనా సరే భరించి అదో పవిత్ర కార్యంలాగా ముందుకు సాగిపోతూ కనిపిస్తున్నారు. గంగా, యమునా, అంతర్వాహినిగా పిలిచే సరస్వతీ నదుల సంగమమే ఈ త్రివేణీ సంగమం. మంగళవారం అధికారికంగా కుంభమేళా ప్రాంభమైనప్పుడు పవిత్ర స్నానాలు ఆచరించడం కోసం సోమవారంనుంచే భక్తులు క్యూ కట్టి నిలుచున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పవిత్ర స్నానాలకోసం రానుండడంతో అత్యవసర సేవలకు అవసరమైన వాహనాలు తప్ప మిగతా అన్ని వాహనాల రాకపోకలపై అధికారులు ఆంక్షలు విధించారు. నిజానికి తమకేమీ కష్టమనిపించడం లేదని, ఆనందం కలుగుతోందని అలహాబాద్ రైల్వే స్టేషన్‌నుంచి మూడు పెద్ద బ్యాగులతో నడుచుకుంటూ వచ్చిన కనౌజ్‌కు చెందిన 55 ఏళ్ల ప్రమోద్ ఆనంద్ చెప్పడం దీనికి అద్ద పడుతుంది. దారి పొడవునా లౌడ్ స్పీకర్లలో వినిపించే భక్తిగీతాలు, ఆనందంతో భక్తులు చేసే నృత్యాలు, నగ్న శరీరంపై బూడిద పూసుకుని గంజాయి దమ్ము లాగే నాగసాధువులు, మధ్య మధ్యలో తమ కంటికి ఇంపుగా కనిపించే దృశ్యాలను ఫోటోలు తీసుకునే విదేశీయులతో అదో వింత లోకంగా కనిపిస్తోంది. మకర సంక్రాంతినుంచి శివరాత్రి వరకు దాదాపు 50 రోజుల పాటు జరిగే ఈ కుంభమేళా సందర్భంగా దాదాపు 12 కోట్ల మంది పవిత్ర స్నానాలు ఆచరించడానికి కుంభ్ ప్రాంతాన్ని దర్శిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంతమంది ఒక చోట చేరితే సహజంగా గందరగోళం, తొక్కిసలాట ఏర్పడుతుందని, అయితే ఇక్కడ మాత్రం అంతా సాఫీగా సాగిపోవడం ఆశ్చర్య కలిగిస్తుందని ఇటలీనుంచి భార్యతో పాటు వచ్చిన అలాసియో కాంపనారో అంటున్నాడు. దాదాపు 32,000 హెక్టార్లలో విస్తరించి ఉన్న తాత్కాలిక పట్టణం 'కుంభనగరి'లో 250 కిలోమీటర్ల పొడవైన రోడ్లు, 22 పంటూన్ బ్రిడ్జిలు నిర్మించారు. అంతేకాదు, ఆస్పత్రులు, పోలీసు స్టేషన్లు బ్యాంకులు, రెస్టారెంట్లు ఇలా నగరంలో ఉండే ప్రతి సౌకర్యం ఇక్కడ ఉంది. ప్రపంచంలోనే అతి పెద్ద తాత్కాలిక నగరంగా పేర్కొంటున్న ఇక్కడ బస చేసే వారికోసం సకల సదుపాయాలతో కూడిన సూట్‌లు కూడా ఉన్నాయి. కుంభమేళా కోసం ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే దాదాపు 3,000 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది, కుంభమేళా ముగిసే నాటికి ఇది రూ.4,200 కోట్లకు చేరుకోవచ్చని అంచనా.



అగ్నిప్రమాదం



ప్రయాగ్‌రాజ్ కుంభమేళా ప్రదేశంలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. దిగంబర్ అఖాడ సమీపంలోని ఒక టెంట్‌లో గ్యాస్ సిలిండర్ పేలడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. శిబిరం పక్కనే నిలిపి ఉంచిన ఒక కారు, అక్కడి టెంట్లు కొన్నింటికి నిప్పు అంటుకోవడంతో కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే ఈ ప్రమాదం కారణంగా అక్కడి కొన్ని తాత్కాలికకిర్మాణాలు కూలిపోయాయి.అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి నష్టమూ సంభవించలేదు. మరో 24 గంటల్లో కుంభమేళా ప్రారంభం కానుండగా అగ్నిప్రమాదం సంభవించడంతో జనం భయభ్రాంతులై పరుగులు తీశారు. మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో మంటలు చెలరేగాయని, వెంటనే ఆరు ఫైరింజన్లు, ఎనిమిది అంబులెన్స్‌లను సంఘటనా స్థలానికి హుటాహుటిన పంపించినట్లు అధికారులు తెలిపారు. పది నిమిషాల్లోనే మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. భయాందోళనలకు గురయిన భక్తకోటికి పరిస్థితి అదుపులోకి వచ్చిందని, ఎవరూ భయపడాల్సిన పని లేదని అధికారులు నచ్చజెప్పారు. కాగా. నష్టం జరిగిన వారికి వెంటనే పరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా అన్ని గుడారాలను తనిఖీ చేయాలని, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కూడా సిఎం అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా మంగళవారంనుంచి కుంభమేళా ప్రారంభం కానుండడంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు ఆశ్రయం పొందేందుకు దాదాపు 3,200 ఎకరాల్లో 20 వేల శిబిరాలను ఏర్పాటు చేశారు. మేళా ప్రారంభం సందర్భంగా ఇప్పటికే దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి భక్తులు కుంభమేళా ప్రాంతానికి చేరుకున్నారు. మంగళవారం మకర సంక్రాంతిని పురస్కరించుకుని పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకోసం అధికారులు విస్తృతమైన ఏర్పాట్లు చేశారు.

గుజరాత్‌లో ఇబిసి కోటా అమలు

దేశంలో తొలి రాష్ట్రంగా రికార్డు

అహ్మదాబాద్: జనరల్ కేటగిరీలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో పది శాతం రిజర్వేషన్లను గుజరాత్‌లోని బిజెపి నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం సోమవారం అమలు చేసింది. దీంతో దేశంలో ఈ కొత్త నిబంధనను అమలు చేసిన తొలి రాష్ట్రంగా గుజరాత్ నిలిచింది. ఆర్థికంగా వెనుకబడిన ఉన్నతస్థాయి వర్గాలకు పది శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు పార్లమెంటు గత వారం ఆమోదం తెలియజేయగా, రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ శనివారం దానికి ఆమోదముద్ర వేశారు. జనవరి 14నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ రూపానీ ఆదివారం ప్రకటించారు. 'ఈ నెల 14నుంచి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పది శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి గుజరాత్ ప్రభుత్వం నిర్ణయించిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ఇప్పుడు జరుగుతున్న రిక్రూట్‌మెంట్ ప్రక్రియలన్నిటిలోను దీన్ని అమలు చేస్తాం' అని ముఖ్యమంత్రి ఒక ట్వీట్‌లో తెలిపారు. జనవరి 14న ఉత్తరాయనం ప్రారంభమైనప్పటి నుంచి జనరల్ కోటాలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు అమలు అవుతాయని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలియజేసింది. జనవరి 14కు ముందు అడ్వర్టయిజ్ చేసిన అడ్మిషన్లు, ఉద్యోగాల్లో కూడా దీన్ని అమలు చేయడం జరుగుతుందని ఆ ప్రకటన తెలిపింది. కాగా ఈ ప్రకటన వెలువడిన వెంటనే నెల 20న జరగాల్సిన అన్ని ప్రిలిమినరీ పరీక్షలను రద్దు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ దినేశ్ దాస ప్రకటించారు. అయితే సెలవు రోజున హడావుడిగా ఈ కోటాను అమలు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అమిత్ చావ్డా తీవ్రంగా తప్పుబట్టారు.

సిబిఐ విచారణాధికారి కోసం వెతుకులాట




న్యూఢిల్లీ : సిబిఐలో అత్యంత కీలకమైన ప్రాసిక్యూషన్ డైరెక్టర్ పదవి భర్తీకి కేంద్రం చర్యలు చేపట్టింది. చాలా కాలంగా ఈ స్థానం భర్తీ కాకుండా ఖాళీగా ఉంది. ఇప్పటివరకూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా ఉన్న ఒపి వర్మ పదవీ కాలం డిసెంబర్ 23తోనే పూర్తయింది. ఏకంగా సిబిఐ డైరెక్టర్ అలోక్ వర్మ పదవికే ఎసరు ఏర్పడటంతో ప్రాసిక్యూషన్ డైరెక్టర్ పదవి భర్తీ పెండింగ్‌లో పడింది. అయితే ఈ డైరెక్టర్ పదవికి తమ అభ్యర్థుల పేర్లను పంపించాలని వివిధ మంత్రిత్వశాఖలకు కేంద్ర ప్రభుత్వం పోమవారం ఆదేశాలు వెలువరించింది. వివిధ విచారణల ప్రక్రియల విధివిధానాల ఖరారులో ఈ డైరెక్టర్ కీలక పాత్ర పోషిస్తారు. సిబిఐ డైరెక్టర్ పరిధిలో ఈ విచారణాధికారి వ్యవహరించాల్సి ఉంటుంది. సంస్థ చేపట్టే కేసులపై న్యాయపరమైన సూచనలను ఈ అధికారి వెలువరిస్తారు. ఈ పదవికి అర్హులైన అభ్యర్థుల పేర్లను తమకు పంపించాలని మంత్రిత్వశాఖల అధికారులు, ప్రభుత్వ విభాగాల సెక్రెటరీలకు సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖ లేఖలు పంపించింది. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా నియామకాలకు అర్హులైన, జాయింట్ సెక్రెటరీల ర్యాంకులకు తక్కువ కాని అధికారుల నుంచి వారు ఇష్టపూర్తిగా ఉంటే అభ్యర్థిత్వాలను పంపించవచ్చునని కేంద్రం తెలిపింది. ఈ నెల 25వ తేదీలోగా ఈ పేర్లను పంపించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి) సిఫార్సుల మేరకు ప్రాసిక్యూషన్ డైరెక్టర్ పదవికి అర్హులను ఎంపిక చేస్తారని వెల్లడించారు. సిబిఐ చరిత్రలో తొలిసారిగా ఇప్పుడు పూర్తి స్థాయి డైరెక్టర్ లేరు. ఏకంగా ఇప్పుడు దీనికి తోడు ప్రాసిక్యూషన్ డైరెక్టర్ కూడా లేరు. కీలకమైన ఈ రెండు పదవులు భర్తీ కాకుండా ఉండటం పట్ల పార్లమెంటరీ కమిటీ ఒకటి ఇటీవలే ఆందోళన వ్యక్తం చేసింది. వీటిని త్వరితగతిన భర్తీ చేయాల్సి ఉందని సూచించింది. ఇంతేకాకుండా సిబిఐలో వివిధ స్థాయిలలో సిబ్బంది కొరత వీడని సమస్యగా ఉంది. పలుసార్లు పార్లమెంటరీ కమిటీలు దీనిపై ఆందోళన వ్యక్తం చేశాయి. అధికారులు ఏ స్థాయిలలో ఖాళీగా ఉన్నారు? ఎవరెవ్వరు త్వరలో పదవీ విరమణ చేస్తారు? అనే అంశాలను కేంద్రం జాగ్రత్తగా ముందే బేరీజు వేసుకుని భర్తీ చర్యలు తీసుకోవల్సి ఉంటుందని కమిటీ తెలిపింది.ఖాళీల సమస్య ముందుకు వచ్చే వరకూ వేచి ఉండటంతోనే సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవలే వివిధ పరిణామాలతో సిబిఐలో ఉన్నత స్థాయిలో కేసులు, విచారణలు, బర్తరఫ్‌లు, న్యాయస్థానాల జోక్యాలు, పునఃనియామకాలు, తిరిగి ఉద్వాసనలు తలెత్తడంతో అవినీతి అక్రమాల ఆటకట్టుల కీలక సంస్థ అంతా అస్తవ్యస్థంగా అతలకుతలం అయింది.

కంప్యూటర్లపై కన్నెందుకు?

కేంద్రానికి సుప్రీం నోటీసులు





న్యూఢిల్లీ : కంప్యూటర్లలోని సమాచార తనిఖీకి కేంద్రం వెలువరించిన స్నూపింగ్ ఆదేశాలపై సుప్రీంకోర్టు స్పందించింది. ఇవి ఆమోదయోగ్యమైనవేనా అనే విషయాన్ని పరిశీలించనుంది. ఈ స్నూపింగ్ ఉత్తర్వులపై తమకు వివరణ ఇచ్చుకోవాలని కేంద్రానికి అత్యున్నత న్యాయస్థానం సోమవారం నోటీసు వెలువరించింది. స్నూపింగ్ నోటిఫికేషన్‌ను న్యాయవాది మనోహర్ లాల్ శర్మ సవాలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నాయకత్వపు ధర్మాసనం విచారణను చేపట్టింది. కేంద్రం జవాబుకు ఆరు వారాల గడువును ఇచ్చింది. గత నెల 20వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్‌ను వెలువరించింది. దీని మేరకు దేశంలోని ఏ కంప్యూటర్ వ్యవస్థలోని డాటాను అయినా తనిఖీ చేసేందుకు, పర్యవేక్షించేందుకు, తొలిగించేందుకు, డాటా స్వాధీనానికి పది కేంద్రీయ సంస్థలకు అధికారాలను కట్టబెట్టారు. అంతేకాకుండా వివిధ కంప్యూటర్ల డాటాలపై స్నూపింగ్‌కు కూడా ఆయా సంస్థలకు అనుమతిని కల్పించారు. ఐటి చట్టం పరిధిలో కంప్యూటర్ల తనిఖీ, డాటా విశ్లేషణల ఆదేశాలను కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెలువరించింది. అయితే ఐటి చట్టం పరిధిలో సాధారణ ప్రక్రియ అని, ఇంతకు ముందు వెలువరించిన నోటిఫికేషన్ గడువు తీరిపోవడంతో ఇప్పుడు పునః జారీ జరిగిందని వెల్లడించారు. అయితే ఇటువంటి నోటిఫికేషన్ చట్టవ్యతిరేకం అని, రాజ్యాంగపరంగా చెల్లనేరదని, చట్టానికి అతీతం అని న్యాయవాది తమ పిటిషన్‌లో దీనిని సవాలు చేశారు. న్యాయస్థానంలో విచారణ ముగిసేవరకూ కేంద్ర అధీకృత సంస్థలు ఏవీ కూడా క్రిమినల్ చర్యలకు దిగకుండా అడ్డుకోవాలని పిటిషనర్ కోరారు. ఐటి చట్టం పరిధిలోని నిబంధనల పరిధిలో చర్యలు ఉంటాయని పేర్కొంటున్న నోటిఫికేషన్ ప్రాతిపదికన దర్యాప్తు లేదా విచారణలను చేపట్టరాదని అభ్యర్థించారు. కేంద్రం నోటిఫికేషన్‌తో ప్రజానీకపు సమాచార వినిమయంపై అధికార వ్యవస్థ పరిధిలోకి వచ్చే హక్కు ఏర్పడుతుంది. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లను తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు వీలేర్పడుతుంది. తాము దక్కించుకునే సమాచారంతో కేంద్రీయ సంస్థలు నిర్ధిష్ట రాజకీయ ప్రయోజనాల పరిరక్షణకు దోహదపడుతాయని, ప్రస్తుత అధికారిక రాజకీయ పార్టీ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఈ సమాచారాన్ని చేరవేసేందుకు వీలేర్పడుతుందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెలువరించిన స్నూపింగ్ ఆదేశాలపై రాజకీయ సామాజిక వర్గాల నుంచి తీవ్రస్థాయి విమర్శలు వెల్లువెత్తాయి. ఇవి చాలా అనుచిత ఆదేశాలు అని, ఇటువంటి నోషిఫికేషన్ల చర్యలు దేశంలో నిఘారాజ్య స్థాపనకు అడుగులుగా భావించాల్సి ఉంటుందని పలు పార్టీలు విమర్శించాయి. అయితే 2009లో రూపొందించిన నిబంధనల మేరకే ఇప్పటి ఉత్తర్వులను వెలువరించడం జరిగిందని, అప్పటి యుపిఎ ప్రభుత్వ హయాంలోనే వీటిని ఖరారు చేశారని, దీని మేరకు అవసరం అయితే కంప్యూటర్ డాటాల తనిఖీలకు కేంద్రీయ సంస్థలకు అనుమతిని కల్పించారని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చుకుంది. ఇప్పుడు తాము వెలువరించిన ఆదేశాలు కేవలం అధీకృత సంస్థలు చర్యలు తీసుకునేందుకు వీలు కల్పించేందుకే అని, కేంద్రంపై పనిగట్టుకుని ప్రతిపక్షాలు విమర్శలకు దిగాల్సిన పనిలేదని స్పష్టం చేశారు.

జల్లికట్టు ఆరంభం

ఇద్దరి పరిస్థితి విషమం, పలువురికి గాయాలు

చెన్నై: తమిళనాడులో సంక్రాంతి పండుగ సందర్భంగా తమిళ సంప్రదాయ క్రీడ జల్లికట్టును అన్నాడిఎంకె ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. జల్లికట్టు ఆటను నిర్వహించేందుకు పలు ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ప్రభుత్వం చేపట్టింది. ఈ క్రీడను చూసేందుకు పలు ప్రాంతాల నుంచి తమిళులు భారీగా తరలివచ్చారు. పుదుకొట్టే జిల్లా తసంగుర్చిలో జల్లికట్టు క్రీడలను ఆరోగ్య శాఖ మంత్రి విజయ భాస్కర్ ప్రారంభించారు. జల్లికట్టు క్రీడలో 300 ఎద్దులను వదలగానే 400 మంది యువకులు పట్టుకోవడానికి ప్రయత్నించారు. ఈ ఆట ఆడుతున్నప్పుడు పది మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో స్థానిక ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. తమిళనాడు సరిహద్దు జిల్లా అయిన ఎపిలోని చిత్తూరులో కూడా జల్లికట్టు ఉత్సవాలు ఘనంగా జరుపుతున్నారు. చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం అనుపల్లిలో జల్లికట్టు వేడుకులకు యువతి, యువకులు, స్థానిక ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. ఎద్దులను వదలగాను పట్టుకునేందుకు యువత ఉత్సహం చూపుతున్నారు. జల్లికట్టు క్రీడను వీక్షించేందుకు వచ్చిన ప్రజలకు రేఖలచేను గ్రామ సంబంధించిన యువత అన్నదానం కార్యక్రమం చేపట్టింది.



రెండో వన్డే మాకు చాలా కీలకం. ఇందులో గెలిస్తేనే సిరీస్‌లో నిలుస్తాం. దీంతో కాస్త ఒత్తిడి నెలకొంది. అయినా ఈ మ్యాచ్‌లో గెలిచేందుకు సర్వం ఒడ్డుతాం. ఆసీస్‌పై ప్రతీకారం తీర్చుకుంటాం.

– భారత కెప్టెన్ విరాట్ కోహ్లి

భారత్‌కు చావోరేవో

సిరీస్‌పై ఆస్ట్రేలియా కన్ను, నేడు రెండో వన్డే

అడిలైడ్: తొలి వన్డేలో ఓటమి పాలైన టీమిండియాకు మంగళవారం ఆస్ట్రేలియాతో జరిగే రెండో వన్డే చావోరేవోగా మారింది. సిరీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే భారత్ ఈ మ్యాచ్‌లో కచ్చితంగా గెలవాల్సిందే. తొలి వన్డేలో బ్యాటింగ్ వైఫల్యంతో కోహ్లి సేనకు ఓటమి తప్పలేదు. అయితే ఈసారి మాత్రం కచ్చితంగా గెలవాలనే పట్టుదలతో భారత్ ఉంది. మరోవైపు ఆస్ట్రేలియా కూడా విజయమే లక్ష్యంగా మ్యాచ్‌కు సిద్ధమైంది. తొలి వన్డేలో గెలుపు జట్టు ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ఈ మ్యాచ్‌లోనూ అదే జోరును కనబరచాలనే లక్ష్యంతో ఆస్ట్రేలియా ఉంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఆస్ట్రేలియా సమతూకంగా కనిపిస్తోంది. భారత్ కూడా సిడ్నీలో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకోవాలనే లక్ష్యంతో కనిపిస్తోంది. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి సిరీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలని తహతహలాడుతోంది. తొలి మ్యాచ్‌లో తడబడిన బ్యాట్స్‌మెన్ ఈసారి బ్యాట్‌ను ఝుళిపించేందుకు సిద్ధంగా ఉన్నారు. బౌలర్లు కూడా మరింత మెరుగైన ప్రదర్శన కనబరచాలనే ఉద్దేశంతో మ్యాచ్‌కు సిద్ధమయ్యారు. ఈ మ్యాచ్‌లో ఓడితే భారత్ సిరీస్ కోల్పోక తప్పదు. దీంతో భారత్‌పై కాస్త ఒత్తిడి కనిపిస్తోంది. కానీ, తొలి మ్యాచ్‌లో ఓటమికి బదులు తీర్చుకోవాలనే లక్ష్యంతో ఉన్న టీమిండియాను ఓడించడం ఆస్ట్రేలియాకు అనుకున్నంత తేలిక కాదనే చెప్పాలి. ఇరు జట్లు కూడా గెలుపే లక్ష్యంగా పెట్టుకోవడంతో పోరు హోరాహోరీగా సాగడం ఖాయం.



ధావన్ ఈసారైనా...

తొలి వన్డేలో ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరిన ఓపెనర్ శిఖర్ ధావన్ ఈ మ్యాచ్‌లోనైనా మెరుగైన బ్యాటింగ్‌ను కనబరచాల్సిన అవసరం ఉంది. సిడ్నీలో అతని వైఫల్యం జట్టుపై తీవ్ర ప్రభావాన్నే చూపింది. అయితే ఈసారి మాత్రం ఎలాంటి పొరపాట్లు లేకుండా భారీ స్కోరు సాధించాలనే ఉద్దేశంతో ధావన్ కనిపిస్తున్నాడు. ఇక, తొలి వన్డేలో చిరస్మరణీయ సెంచరీ సాధించిన స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ ఈసారి కూడా భారీ ఇన్నింగ్స్‌పై కన్నేశాడు. ఒంటి చేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన రోహిత్ చెలరేగితే భారత్‌కు భారీ స్కోరు సాధించడం కష్టమేమి కాదు. అయితే ధావన్ తనవంతు సహకారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే భారత్‌కు మంచి ఆరంభం లభిస్తోంది. మరోవైపు కెప్టెన్ విరాట్ కోహ్లి, అంబటి రాయుడు కూడా ఈ మ్యాచ్‌లో రాణించక తప్పదు. తొలి మ్యాచ్‌లో ఇద్దరు నిరాశ పరిచారు. వీరు తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరడంతో జట్టుపై ఒత్తిడి నెలకొంది. ఈసారి ఆ ఛాన్స్ ప్రత్యర్థి బౌలర్లకు దక్కకుండా చూడాల్సిన బాధ్యత వీరిపై ఉంది. కొంతకాలంగా ఆకాశమే హద్దుగా చెలరేగి పోతున్న కెప్టెన్ కోహ్లి సిడ్నీ వన్డేలో మాత్రం తడబడ్డాడు. ఆస్ట్రేలియా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొలేక తక్కువ స్కోరుకే ఔటయ్యాడు. కానీ, ఈ మ్యాచ్‌లో మాత్రం వారిపై బదులు తీర్చుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు. ఇదే జరిగితే ఆస్ట్రేలియా బౌలర్లకు కష్టాలు తప్పక పోవచ్చు. రాయుడు కూడా మెరుగ్గా ఆడక తప్పదు. నాలుగో నంబర్‌లో బరిలోకి దిగే రాయుడు చెలరేగితే భారత్‌కు భారీ స్కోరు ఖాయం. తొలి వన్డేలో రాణించిన సీనియర్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోని కూడా తన బ్యాట్‌కు పని చెప్పాల్సిందే. కిందటిసారి ధోని అంపైర్ తప్పుడు నిర్ణయానికి పెవిలియన్ చేరాల్సి వచ్చింది. సిడ్నీలో మెరుగైన బ్యాటింగ్ కనబరచడంతో ధోని ఆత్మవిశ్వాసం పెరిగింది. ఈ మ్యాచ్‌లో కూడా అదే జోరును కొనసాగించాల్సిన అవసరం ఉంది. రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్‌లు కూడా తమవంతు పాత్ర పోషించాలి. అప్పుడే భారత్‌కు గెలుపు అవకాశాలు మెరుగవుతాయి. ఇక, తొలి వన్డేలో బౌలర్లు మెరుగ్గానే రాణించారని చెప్పొచ్చు. షమి, జడేజా, కుల్దీప్‌లు పొదుపుగా బౌలింగ్ చేశారు. భువనేశ్వర్ కూడా ప్రారంభంలో బాగానే బౌలింగ్ చేశాడు. అయితే ఖలీల్ భారీగా పరుగులు సమర్పించుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈసారి భువనేశ్వర్, షమిలు మరింత మెరుగ్గా బౌలింగ్ చేయాల్సిన అవసరం ఉంది. జడేజా, కుల్దీప్‌లు కూడా జట్టుకు అండగా నిలువక తప్పదు. అప్పుడే ఆస్ట్రేలియాను తక్కువ స్కోరుకు పరిమితం చేయడం సాధ్యమవుతోంది.



జోరుమీదున్నారు

మరోవైపు తొలి మ్యాచ్‌లో అద్భుత విజయం సాధించిన ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు ఈ మ్యాచ్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్ సొంతం చేసుకోవాలనే పట్టుదలతో కనిపిస్తోంది. తొలి వన్డేలో అసాధారణ రీతిలో రాణించిన యువ స్పీడ్‌స్టర్లు రిచర్డ్‌సన్, బెహ్రాన్‌డార్ఫ్‌లపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. ఆస్ట్రేలియా విజయంలో వీరిద్దరూ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఇద్దరు ప్రారంభంలోనే కీలక వికెట్లు తీయడంతో భారత్ కష్టాల్లో చిక్కుకుంది. లియాన్, పీటర్ సిడిల్, స్టోయినస్ కూడా బౌలింగ్‌లో సత్తా చాటారు. ఇది ఆస్ట్రేలియాకు సానుకూల పరిణామమే. ఇక, ఉస్మాన్ ఖ్వాజా, షాన్ మార్ష్, హాండ్స్‌కొంబ్, స్టోయినస్ తదితరులు బ్యాట్‌తో చెలరేగారు. ఈ మ్యాచ్‌లోనూ అదే సంప్రదాయాన్ని కొనసాగించాలని భావిస్తున్నారు. అదే జరిగితే భారత బౌలర్లకు మరోసారి కష్టాలు తప్పక పోవచ్చు. ఇక, తొలి వన్డేలో విఫలమైన కెప్టెన్ అరోన్ ఫించ్ కూడా భారీ ఇన్నింగ్స్‌పై కన్నేశాడు. అతను చెలరేగితే భారీ స్కోరు సాధించడం ఆస్ట్రేలియాకు అసాధ్యమేమి కాదు.

అసలు సమస్య అదే

ఇక, టీమిండియాను నిలకడలేమి వెంటాడుతోంది. కీలక సమయంలో బ్యాటింగ్, బౌలింగ్‌లో తడబడడం భారత్‌కు అలవాటుగా మారింది. తొలి వన్డేలో కీలక సమయంలో బౌలర్లు భారీగా పరుగులు ఇచ్చుకున్నారు. ఒత్తిడి పెంచాల్సిన సమయంలో లయ తప్పడం ఆస్ట్రేలియాకు వరంగా మారింది. ముఖ్యంగా భువనేశ్వర్, ఖలీల్‌లు తొలి వన్డేలో గాడి తప్పారు. వీరిద్దరూ భారీగా పరుగులు సమర్పించుకోవడంతో ఆసేలియా మెరుగైన స్కోరును సాధించింది. ఇక, బ్యాటింగ్‌లోనూ నిలకడలేమి సమస్యగా మారింది. కీలక సమయంలో బ్యాట్స్‌మెన్ తడబడుతున్నారు. తొలి వన్డేలో ధావన్, రాయుడు, కోహ్లిలు ఒత్తిడికి గురయ్యారు. ధోని, రోహిత్‌లు కూడా చాలా సేపటి వరకు బ్యాట్‌ను ఝుళిపించలేక పోయారు. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా బ్యాటింగ్ గాడిలో పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే సిరీస్‌లో భారత్ అవకాశాలు సజీవంగా ఉంటాయి.



శ్రీకాంత్‌కు జాక్‌పాట్

లి నింగ్‌తో రూ.35 కోట్ల ఒప్పందం



న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్, తెలుగుతేజం కిదాంబి శ్రీకాంత్ జాక్‌పాట్ కొట్టేశాడు. చైనా బ్రాండ్ లి నింగ్‌తో శ్రీకాంత్ భారీ ఒప్పందం కుదుర్చుకున్నాడు. లి నింగ్ సంస్థకు నాలుగేళ్ల పాటు ప్రచారకర్తగా (బ్రాండ్ అంబాసిడర్)గా వ్యవహరించేందుకు ఒప్పుకున్నాడు. దీని కోసం చైనా సంస్థ లి నింగ్ శ్రీకాంత్‌కు 35 కోట్ల రూపాయలను అందించేందుకు అంగీకరించింది. చైనాలోనే లి నింగ్ సంస్థ అతిపెద్ద స్పోర్ట్స్ బ్రాండ్‌గా కొనసాగుతోంది. ఆ సంస్థతో శ్రీకాంత్ భారీ ఒప్పందం కుదుర్చుకోవడం విశేషం. అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో శ్రీకాంత్ సాధిస్తున్న విజయాలను దృష్టిలో ఉంచుకుని లి నింగ్ సంస్థకు ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 2017లో శ్రీకాంత్ వరుస టైటిల్స్‌తో పెను ప్రకంపనలు సృష్టించాడు. అంతేగాకుండా కిందటి ఏడాది పురుషుల సింగిల్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌ను సయితం అందుకున్నాడు. ఇక, భారత్‌లో లి నింగ్ సంస్థకు మంచి పేరుంది. ఇటీవల కాలంలో భారత్‌లో బ్యాడ్మింటన్‌కు అత్యంత ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో అగ్రశ్రేణి షట్లర్ శ్రీకాంత్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా తమ ఉత్పత్తుల విక్రయాన్ని మరింత పెంచుకోవాలని లి నింగ్ సంస్థ భావిస్తోంది. కాగా, చైనా, ఇండోనేషియా, సింగపూర్, ఆస్ట్రేలియాలో బ్యాడ్మింటన్ జట్లకు లి నింగ్ సంస్థ అండగా నిలుస్తోంది. జకార్తాలో జరిగిన కిందటి ఆసియా క్రీడల్లో కూడా భారత జట్టుకు అధికారిక స్పాన్సర్‌గా లి నింగ్ వ్యవహరించింది. అంతేగాక టోక్యో వేదికగా వచ్చే ఏడాది జరిగే ఒలింపిక్స్ క్రీడల వరకు భారత బ్యాడ్మింటన్ జట్లకు లి నింగ్ సంస్థ అధికారిక దుస్తుల స్పాన్సర్‌గా కొనసాగుతుంది. కాగా, లి నింగ్‌తో భారీ ఒప్పందం కుదుర్చుకోవడంపై శ్రీకాంత్ ఆనందం వ్యక్తం చేశాడు. తనకు లభించిన అవకాశాన్ని అరుదైన గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పాడు.

దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్

మూడో టెస్టులోనూ పాక్ చిత్తు



జోహెన్నస్‌బర్గ్: పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను ఆతిథ్య సౌతాఫ్రికా జట్టు క్లీన్‌స్వీప్ చేసింది. చివరి, మూడో టెస్టులో సౌతాఫ్రికా 107 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3—0తో సొంతం చేసుకుంది. పాకిస్థాన్ ముందు సౌతాఫ్రికా 381 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. అయితే పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్‌లో 273 పరుగులకే ఆలౌటైంది. మంగళవారం నాలుగో రోజు 153/3తో బ్యాటింగ్ చేపట్టిన పాకిస్థాన్ తక్కువ స్కోరుకే కుప్పకూలింది. సౌతాఫ్రికా బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ పాకిస్థాన్‌ను కుదురుకోనివ్వలేదు. ఒలివర్, రబడా మరోసారి చెలరేగి పోయారు. ఇద్దరు మూడేసి వికెట్లు తీసి పాకిస్థాన్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. స్టెయిన్ రెండు వికెట్లతో తనవంతు పాత్ర పోషించాడు. అసద్ షఫిక్ 65 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచడు. షాదాబ్ ఖాన్ 47 పరుగులతో అజేయంగా నిలిచాడు. మిగతావారు విఫలం కావడంతో పాక్‌కు మూడో ఓటమి తప్పలేదు. కాగా, సిరీస్‌లో నిలకడగా రాణించిన ఒలివర్‌కు ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్ అవార్డు లభించింది. ఇక, అద్భుత సెంచరీతో దక్షిణాఫ్రికాను ఆదుకున్న క్వింటన్ డికాక్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఇక, ఇరు జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరుగనుంది. జనవరి 19న తొలి వన్డే జరుగుతుంది. అంతేగాక మూడు మ్యాచ్‌ల ట్వంటీ—20 సిరీస్‌లో కూడా ఇరు జట్లు తలపడుతాయి.

ముర్రేకు షాక్

ఫెదరర్, వోజ్నియాకి శుభారంభం, నాదల్, షరపోవా ముందంజ, ఆస్ట్రేలియా ఓపెన్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో బ్రిటన్ స్టార్, మాజీ నంబర్‌వన్ ఆండీ ముర్రే తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్లు రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్), వోజ్నియాకి (డెన్మార్క్)లు శుభారంభం చేశారు. మాజీ చాంపియన్ రఫెల్ నాదల్ (స్పెయిన్) కూడా తొలి రౌండ్‌లో విజయం సాధించాడు. ఐదో సీడ్ కెవిన్ అండర్సన్ (సౌతాఫ్రికా), ఆరో సీడ్ మారిన్ సిలిక్ (క్రొయేషియా), దిమిత్రోవ్ (బల్గేరియా), వెర్దాస్కో (స్పెయిన్) తదితరులు రెండో రౌండ్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్‌లో అగ్రశ్రేణి క్రీడాకారిణిలు అంజెలిక్ కెర్బర్, స్లొవానే స్టిఫెన్స్ (అమెరికా), పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్) మొదటి రౌండ్‌లో విజయం సాధించారు.

ముర్రే ఔట్

కాగా, మంగళవారం జరిగిన మొదటి రౌండ్‌లో ముర్రే ఐదు సెట్ల హోరాహోరీ సమరంలో స్పెయిన్ ఆటగాడు రాబెర్టో బౌటిస్టా అగట్ చేతిలో ఓటమి పాలయ్యాడు. నువ్వానేనా అన్నట్టు సాగిన పోరులో అగట్ 6—4, 6—4, 6—7, 6—7, 6—2 తేడాతో విజయం సాధించాడు. తొలి రెండు సెట్లలో అగట్ అలవోకగా గెలుపొందాడు. అయితే తర్వాతి రెండు సెట్లలో ముర్రే అసాధారణ ఆటను కనబరిచాడు. వరుసగా రెండు సెట్లు గెలుచుకున్నాడు. కానీ, కీలకమైన ఐదో సెట్‌లో అగట్ చెలరేగి ఆడాడు. ముర్రేకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ఆస్ట్రేలియా ఓపెన్ తర్వాత అంతర్జాతీయ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తానని ముర్రే ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. మ్యాచ్ అనంతరం ముర్రే ఈ విషయంపై స్పష్టత ఇచ్చాడు. ఒకవేళ ఫిట్‌నెస్‌గా ఉంటే వింబుల్డన్ వరకు కొనసాగుతానని, అందులో విఫలమైతే మాత్రం తన కెరీర్‌లో ఇదే చివరి మ్యాచ్ అని స్పష్టం చేశాడు.

ఫెదరర్ అలవోకగా...

ఇక, డిఫెండింగ్ చాంపియన్, మూడో సీడ్ రోజర్ ఫెదరర్ తొలి రౌండ్‌లో అలవోక విజయం సాధించాడు. ఉజ్బెకిస్థాన్ ఆటగాడు డెనిస్ ఇస్టోమిన్‌తో జరిగిన మొదటి రౌండ్‌లో ఫెదరర్ 6—3, 6—4, 6—4 తేడాతో జయభేరి మోగించాడు. ప్రారంభం నుంచే చెలరేగి ఆడిన ఫెదరర్ ఏ దశలోనూ ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇవ్వలేదు. మరోవైపు మాజీ చాంపియన్, రెండో సీడ్ రఫెల్ నాదల్ (స్పెయిన్) కూడా సునాయాస విజయంతో రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. నాదల్ 6—4, 6—3, 7—5తో ఆస్ట్రేలియా ఆటగాడు జేమ్స్ డక్‌వర్త్‌ను ఓడించాడు. ఐదో సీడ్ అండర్సన్ 6—3, 5—7, 6—2, 6—2తో ఫ్రాన్స్ ఆటగాడు అడ్రియాన్ మన్నారినోపై విజయం సాధించాడు. ఆరో సీడ్ సిలిక్ 6—2, 6—4, 7—6తో ఆస్ట్రేలియా ఆటగాడు బెర్నాడ్ టొమిక్‌ను ఓడించాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ కెర్బర్ 6—2, 6—2తో స్లోవేనియా క్రీడాకారిణి పొలొనా హర్కాగ్‌పై విజయం సాధించింది. ప్రస్తుత విజేత, మూడో సీడ్ కరోలిన్ వోజ్నియాకి 6—3, 6—4 తేడాతో అలిసన్ వ్యాన్ (బెల్జియం)ను ఓడించింది.





సత్తా చాటుతా : గిల్


న్యూఢిల్లీ: భారత జట్టులో చోటు దక్కడం అరుదైన గౌరవంగా భావిస్తున్నట్టు యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ అన్నాడు. న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో గిల్‌కు చోటు లభించిన విషయం తెలిసిందే. దీనిపై గిల్ స్పందించాడు. ఇంత త్వరగా టీమిండియాలో చోటు దక్కుతుందని భావించలేదన్నాడు. ఇక, అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపాడు. రానున్న సిరీస్‌లో మెరుగైన ఆటతో అలరిస్తాననే నమ్మకాన్ని వ్యక్తం చేశాడు. జట్టు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేందుకు ప్రయత్నిస్తానన్నాడు. న్యూజిలాండ్ పిచ్‌లపై తనకు మంచి అవగాహన ఉందన్నాడు. కివీస్‌లో జరిగిన అండర్—19 వన్డే ప్రపంచకప్‌లో మెరుగైన ఆటను కనబరిచిన విషయాన్ని గిల్ గుర్తు చేశాడు. ఈసారి కూడా జట్టుకు అండగా నిలుస్తానని తెలిపాడు. తుది జట్టులో స్థానం లభిస్తే మెరుగ్గా రాణిస్తానన్నాడు. ఓపెనర్‌గా, మిడిలార్డర్ ఎక్కడైనా బ్యాటింగ్ చేసేందుకు తనకు ఇబ్బంది లేదన్నాడు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడమే తన ముందున్న ఏకైక లక్ష్యమని గిల్ స్పష్టం చేశాడు.



రిషబ్‌కు ఆ సత్తా ఉంది

ఎమ్మెస్కే ప్రసాద్

ముంబయి: యువ ఆటగాడు రిషబ్ పంత్ రానున్న రోజుల్లో టీమిండియాలో కీలకపాత్ర పోషించడం ఖాయమని బిసిసిఐ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ జోస్యం చెప్పాడు. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో రిషబ్ అద్భుతంగా రాణించాడన్నాడు. భవిష్యత్తులో పంత్ అగ్రశ్రేణి ఆటగాడిగా ఎదగడం ఖాయమన్నాడు. పరిస్థితులకు తగినట్టుగా తన ఆటను మలచు కోవడంలో పంత్‌కు మంచి ప్రావీణ్యం ఉందన్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో అతని బ్యాటింగే దానికి నిదర్శనమన్నాడు. చివరి టెస్టులో సాధించిన సెంచరీ అతని ప్రతిభకు నిదర్శనమన్నాడు. రానున్న ప్రపంచకప్‌లో రిషబ్‌పంత్‌కు చోటు లభించినా ఆశ్చర్యం లేదన్నాడు. తమ ప్రపంచకప్ ప్రణాళికలో అతడు కూడా ఉన్నాడన్నాడు. మూడు ఫార్మాట్‌ల లోనూ మెరుగైన ఆటను కనబరిచే సత్తా రిషబ్‌కు ఉందన్నాడు. కీపింగ్‌లో ఇప్పటికే సత్తా చాటిన రిషబ్ బ్యాట్‌తోనూ రాణించడం భారత్‌కు శుభపరిణామమన్నాడు. ఇక, న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లో శంకర్, శుభ్‌మన్ గిల్‌కు చోటు కల్పించడానికి ముందు కెప్టెన్‌తో, కోచ్ చర్చించామన్నాడు. అన్ని ఆలోచించాకే వారిని ఎంపిక చేశామని ప్రసాద్ తెలిపాడు.



కర్నాటకలో మళ్లీ


రాజకీయ వే(ఆ)ట!

ముంబైలో ముగ్గురు మా ఎంఎల్ఎల మకాం



కర్నాటకలో 'ఆపరేషన్ లోటస్' మొదలైందని, ముగ్గురు కాంగ్రెస్ ఎంఎల్ఎలు ముంబయిలోని ఓ హోటల్‌లో కొందరు బిజె పి ఎంఎల్ఎలతో కలిసి మకాం వేశారని కర్నాటక జలవనరుల శాఖ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత డికె శివకుమార్ అన్నారు. వారితో బిజెపి బేరసారాలు సా గిస్తోందని ఆయన ఆరోపించారు. వారి తో ఎవరెవరు మాట్లాడుతున్నారు.. వారికి ఎంత ఆఫర్ చేశారో తమకు అన్నీ తెలుసన్నారు. ముఖ్యమంత్రి కుమారస్వామి ఇలాంటివి చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని శివకుమార్ దుయ్యబట్టారు. ఆయనకు కొన్ని విషయాలను బయటికి వెల్లడించడంలేదని ఆరోపించారు. చాలా మంది ఎంఎల్ఎలు జరుగుతున్న విషయాన్ని చెబుతున్నారని, సిద్ధరామయ్యకు కూడా వాటిని చేరవేస్తున్నారని వివరించారు. ముఖ్యమంత్రి వేచి చూసే ధోరణిని అవలంభిస్తున్నారని, ఆయన స్థానంలో తాను ఉండి ఉన్నట్లయితే 24గంటల్లో బిజెపి చేస్తున్న కుట్రలను బయటికి తీసేవాడినన్నారు. ఏది ఏమైనా చివరకు ఈ విషయంలో బిజెపి ఎట్టి పరిస్థితుల్లో పైచేయి సాధించబోదని దీమా వ్యక్తం చేశారు.

కర్నాటకలో కాంగ్రెస్, జెడి(ఎస్) ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి ప్రతిపక్ష బిజెపి దాన్ని ఎప్పటికైనా కూల్చి తీర్చాలన్న పట్టుదలతో ఉంది. అప్పుడప్పుడు ఆ పార్టీ నేతలు చేస్తూ వస్తున్న ప్రకటనలు కూడా అందుకు బలం చేకూర్చుతున్నాయి. బిజెపి పాచికలు పారక ఇప్పటి వరకైతే కుమారస్వామి నాయకత్వంలోని ప్రభుత్వం పటిష్టంగా నిలబడే ఉంది. తాజాగా మళ్లీ ఈ ఊహాలకు(ఆపరేషన్ లోటస్) రెక్కలొచ్చాయి. మకర సంక్రాంతి తర్వాత కుమారస్వామి ప్రభుత్వం కుప్పకూలిపోతుందని వార్తలు గుప్పుమన్నాయి. తాజాగా గడువు 17వ తేదీగా చెప్పుకుంటున్నారు. కొంతమంది కాంగ్రెస్ ఎంఎల్ఎలు తమతో టచ్‌లో ఉన్నారని, వారి సాయంతో తిరిగి కమలం సర్కార్‌ను కొలువుదీర్చబోతున్నామని చెప్పుకుంటున్నారు. ఇప్పుడు కాంగ్రెస్-జెడి(ఎస్)లకు చెందిన 116మంది శాసనసభ్యులతో కుమారస్వామి సంకీర్ణ సర్కార్ నిలబడి ఉంది. బిజెపి 104 సంఖ్యాబలం ఉంది. ఇద్దరు స్వతంత్రులు, ఒక బిఎస్‌పి సభ్యుడున్నారు. మరొకరు కెపిజెపికి చెందిన ఎంఎల్‌ఎ. వీరిలో ముగ్గరి మద్దతు ప్రస్తుతానికైతే పాలక పక్షానికే ఉంది. అయితే బిజెపి కొత్త ప్రణాళికలు రచిస్తోంది. 224 సభ్యులున్న అసెంబ్లీ బలాన్ని 207కు తగ్గించాలని చూస్తోంది. కాంగ్రెస్, జెడిఎస్‌లలో సభ్యులలో కొందరిని తమవైపునకు తిప్పుకొని 16మంది చేత రాజీనామా చేయించాలని చూస్తోంది. తద్వారా తమకున్న 104మంది సాధారణ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇక ఇండిపెండెంట్‌లు, బిఎస్‌పి, కెపిజెపి సభ్యులు నలుగురిని తమవైపుకు తిప్పుకుంటే 10మంది రాజీనామా చేస్తే సరిపోతుందన్నది మరో ప్లాన్. బిజెపి ఎత్తుగడలను ముందే పసిగట్టిన జెడిఎస్, కాంగ్రెస్ ఎవరెవరు కమలం వైపు చూస్తున్నారో పసిగట్టింది. వారి కదలికలను నిత్యం గమనిస్తూనే ఉంది. ఇందులో ఎలాంటి అనుమానం లేదు, మాలోని నలుగురు కొన్ని కారణాలతో అసంతృప్తితో రగిలిపోతున్నారు... నలుగురిలో అది తీవ్రంగా ఉంది అని సీనియర్ కాంగ్రెస్ ఎంఎల్ఎ ఒకరు పేర్కొన్నారు. మరో వైపు కర్నాటకలో ఆపరేషన్ లోటస్‌కు హస్తిన పెద్దలు సుముఖంగా లేరని, యడ్యూరప్ప మాత్రం హైకమాండ్‌పై ఒత్తిడి తెస్తున్నారని సీనియర్ బిజెపి నాయకుడు, యెడ్డీకి సన్నిహితుడైన ఓ ఎంఎల్ఎ వ్యాఖ్యానించారు. వ్యూహాలు సక్సెస్ కాకపోతే కర్నాటకలో ఎలాగోలా రాజకీయ సంక్షోభం సృష్టించి లోక్‌సభ ఎన్నికలతో పాటు కర్నాటకలోనూ అసెంబ్లీకి తిరిగి ఎన్నికలు నిర్వహించాలన్నది మరో ఎత్తుగడ బిజెపి పెద్దల మనసుల్లో తిరుగాడుతుందని, ఇందుకు యడ్యూరప్ప ఎదురుచూస్తున్నారని కూడా ప్రచారం జరుగుతోంది.




మార్గాలేంటి..?

- బిజెపి సింపుల్ మెజారిటీ సాధించాలంటే ఇప్పుడు అసెంబ్లీ సభ్యుల సంఖ్యను 207కు పడగొట్టాలి. అధికారపార్టీ ఎంఎల్ఎలలో 16మంది చేత రాజీనామా చేయిస్తే తప్ప అది సాధ్యంకాదు.
- ఇద్దరు ఇండిపెండెంట్లు, ఒక బిఎస్‌పి సభ్యుడిని తమవైపునకు తిప్పుకుంటే అధికార పక్షంలో కనీసం 10మంది చేత రాజీనామా చేయిస్తే బిజెపికి సరిపోతుంది.
- ఒక వేళ బిజెపి 20మంది చేత రాజీనామా చేయిస్తే అప్పుడు సంఖ్యాబలం 203కు పడిపోతుంది. దాని ద్వారా బిజెపికి ఇప్పుడున్న 104 మంది సభ్యుల బలంతో సర్కార్ ఏర్పాటు చేయొచ్చు.
- ఒక వేళ 3 – 4 బిజెపి ఎంఎల్ఎలను గనుక కాంగ్రెస్ తమవైపుకు తిప్పుకుంటే కమలం పార్టీ తన కలను అక్కడితోనే ఆపేయాల్సి ఉంటుంది.

రిసార్ట్ రాజకీయం మళ్లీ మొదలు

మరోవైపు బిజెపి ఎంఎల్ఎలు నలుగురైదుగురు తమతో టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలు కాషాయకూటమిలో కలకలం రేపాయి. మరోవైపు జెడిఎస్ సైతం తమ ఎంఎల్ఎలను కొనుగోలు చేయాలని చూస్తోందని ఆ పార్టీ నేత యడ్యూరప్ప వ్యాఖ్యానించారు. పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు బీజేపీ తమ శాసనసభ్యులను గురుగావ్‌లోని రిసార్ట్స్‌కు తరలిచేందుకు ఏర్పాట్లు చేసింది.

వాళ్లు నాకు చెప్పే వెళ్లారు



ముగ్గురు కాంగ్రెస్ ఎంఎల్ఎలు ముంబైలో మకాం వేశారని వస్తున్న వార్తలు, సీనియర్ మంత్రి డికె శివకుమార్ చేసిన వ్యాఖ్యలపై సిఎం కుమారస్వామి స్పందించారు. ఆ ముగ్గురు తనకు చెప్పే అక్కడికి వెళ్లారని, వారివారి వ్యక్తిగత పనులకోసం ముంబై వెళ్లారని చెప్పారు. నిత్యం ఆ ముగ్గురు తనకు టచ్‌లో ఉన్నారని, ఈ రోజు ఉదయం ఏడున్నర గంటలకు కూడా వారితో ఫోన్‌లో మాట్లాడాడనని ఆదివారంనాడు ఆయన మీడియాకు తెలిపారు. 'ఆపరేషన్ లోటస్' మొదలైందని ఓ వర్గం మీడియాలో వార్తలు చూస్తున్నానని, ఇలాంటివి చూసినప్పుడు ఆశ్చర్యానికి గురవుతున్నానని, దుష్ప్రచారాన్ని ఎందుకు వ్యాప్తి చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఇలాంటి వ్యవహారాలతో చివరికి నష్టపోయేంది కర్నాటక ప్రజలేనని కుమారస్వామి పేర్కొన్నారు. ఆ ముగ్గురు ఎవరో చెబుతారా అన్న ప్రశ్నకు పేర్లు వెల్లడించడానికి నిరాకరించారు. ఆ ముగ్గురు తనకు మంచి మిత్రులని, విశ్వాస పాత్రులని సమాధానమిచ్చారు. ఇదిలావుండగా బిజెపి ఎంఎల్ఎలతో కాంగ్రెస్, జెడిఎస్ నేతలు బేరసారాలాడుతున్నారని యడ్యూరప్ప చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు.



ఫిలిప్ కోట్లర్ అవార్డు అందుకున్న మోడీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం ఇక్కడ మొట్టమొదటి సారి ప్రకటించిన ఫిలిప్ కోట్లర్ ప్రెసిడెన్షియల్ అవార్డును అందుకున్నారు. ప్రజలు. లాభం, ప్రపంచం కోసం కృషి చేసిన ఒక దేశ నాయకుడికి ప్రతి ఏటా ఈ అవార్డును అందజేస్తారని ప్రధాని కార్యాలయం తెలియజేసింది. దేశం కోసం ఒక తిరుగులేని నాయకత్వాన్ని అందించినందుకుగాను మోడీకి ఈ అవార్డు అందజేస్తున్నట్లు అవార్డు ప్రశంసాపత్రంలో పేర్కొన్నారు. భారత దేశం కోసం ఆయన సలిపిన నిస్వార్థ సేవ, అలుపులేని ఆయన శక్తి కలిసి దేశం ఆర్థిక, సామాజిక, టెక్నాలజీ రంగాల్లో ముందుకు వెళ్లడానికి దోహదపడ్డాయని ఆ పత్రంలో పేర్కొన్నారు. ఫిలిప్ కోట్లర్ అమెరికాలోని నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీలో మార్కెటింగ్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయన అనారోగ్యం కారణంగా ఆయన తరఫున జార్జియాలోని ఎమోరీ యూనివర్సిటీకి చెందిన జగదీష్ సేథ్ ఈ అవార్డును ప్రధానికి అందజేశారు.

రాజస్థాన్ స్పీకర్‌గా సిపి జోషి



జైపూర్ : రాజస్థాన్ అసెంబ్లీ స్పీకర్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సిపి జోషి నియామకానికి రంగం సిద్ధమైందని సోమవారం పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 16న నూతన స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. అదే రోజు రాష్ట్ర గవర్నర్ కల్యాణ్‌సింగ్ ఆయనచేత ప్రమాణ స్వీకారం చేయిస్తారు. 68 సంవత్సరాల జోషీ రాజస్థాన్‌లో నాథ్‌ద్వారా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. 15వ లోక్‌సభలో జోషీ భిల్వా రా నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. 2009 నుంచి 2013 వరకు ఆయన రోడ్డు రవాణా, జాతీయ రహదారుల కేంద్ర మంత్రిగా పనిచేశారు. ప్రోటెం స్పీకర్‌గా బిజెపి సీనియర్ ఎంఎల్ఎ గులాబ్ చంద్ కటారియా సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. మంగళవారం ప్రారంభమయ్యే 15వ శాసనసభ మొదటి సమావేశాన్ని ప్రోటెం స్పీకర్ నిర్వహిస్తారు. కొత్త స్పీకర్ ఎన్నిక తర్వాత కటారియా ప్రోటెం స్పీకర్ బాధ్యతల నుంచి వైదొలగి, ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరిస్తారు.


పాక్ వల్లే కశ్మీర్ సవాల్ : రాజ్‌నాథ్



లఖింపూర్ ఖేరీ (యుపి): రాష్ట్రాన్ని అస్థిరపరుస్తూ పాకిస్థాన్ కొనసాగిస్తున్న కార్యకలాపాల వల్ల కశ్మీర్ ఇప్పటికీ మనకు సవాల్ విసురుతోందని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం చెప్పారు. ఇక్కడ ఎస్ఎస్‌బి సెక్టార్ హెడ్ క్వార్టర్స్‌లో అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, రెసిడెన్షియల్ బ్లాక్, ఆఫీసర్స్ మెస్‌లను ప్రారంభించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. 'పాకిస్థాన్ అస్థిరత్వాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. కానీ, సైన్యం, సిఆర్‌పిఎఫ్, జమ్ము-కశ్మీర్ పోలీస్, ఇంటెలిజెన్స్ బ్యూరో బృందాలు మరింత సమన్వయంతో వ్యవహరించి పాక్ ప్రయత్నాలను ప్రతిఘటిస్తున్నాయని హోంమంత్రి చెప్పారు. నక్సల్స్ హింసాత్మక సంఘటనలగురించి చెబుతూ... గత నాలుగేళ్లలో ఈ సంఘటనలు 50 శాతం తగ్గాయని తెలిపారు. వాయవ్య ప్రాంతాల్లో తీవ్రవాదుల హింస 80 శాతం తగ్గిందన్నారు.

మా ఎంఎల్‌ఏలకు కుమారస్వామి ఎర

కర్నాటక బిజెపి అధ్యక్షుడు యడ్యూరప్ప ఆరోపణ



న్యూఢిల్లీ: కర్ణాటకలో అధికారంలో ఉన్న జనతాదళ్ (ఎస్)...కాంగ్రెస్ సంకీర్ణప్రభుత్వం తమ పార్టీ ఎంఎల్‌ఏలకు ఎర వేస్తోందని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బిఎస్ యడ్యూరప్ప సోమవారం ఆరోపించారు. తమ పార్టీకి చెందిన 104 మంది శాసన సభ్యులు కలిసికట్టుగా ఉన్నారని, దేశ రాజధానిలో వారు మకాం చేస్తారని యడ్డీ తెలిపారు. అధికార సంకీర్ణంలోని ఎంఎల్‌ఏలను ఆకట్టుకునేందుకు భారతీయ జనతాపార్టీ ఆశలు కల్పిస్తోందని కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి ఆరోపించిన కొన్ని గంటల తర్వాత యడ్యూరప్ప ఈ ప్రకటన చేశారు. 'ఆ పని మేం చేయడంలేదు. వాళ్లే (జెడి..ఎస్– కాంగ్రెస్) బేరసారాలు మొదలు పెట్టారు. మా ఎంఎల్‌ఏలను సంప్రదించేందుకు కుమారస్వామి అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. కనుక మేం మా వాళ్లను ఒకటి రెండు రోజులపాటు ఢిల్లీలో ఉంచుతాం' అని ఇక్కడ రాష్ట్ర బిజెపి ఎంఎల్‌ఏలు, ఎంపీలతో సమావేశమైన తర్వాత యడ్యూరప్ప చెప్పారు. అధికార సంకీర్ణానికి తగినంత మెజారిటీ ఉన్నా అధికారం, డబ్బు ఆశ చూపి, ముఖ్యమంత్రి కుమారస్వామి మా ఎంఎల్‌ఏలకు ఎరవేస్తున్నారని యడ్యూరప్ప అన్నారు. ఢిల్లీలో శనివారంతో ముగిసిన రెండు రోజుల బిజెపి జాతీయ సదస్సుకు హాజరైన కర్నాటక బిజెపి ఎంఎల్‌ఏలు రాష్ట్రంలో రాజకీయ పరిణామాల దృష్ట్యా ఇక్కడే ఉండిపోయారు.

కన్హయ్యపై 1200 పేజీల చార్జిషీట్

దేశద్రోహం కేసులో ఢిల్లీ పోలీసుల చర్యలు



న్యూఢిల్లీ: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయ్యకుమార్ తదితరులపై ఢిల్లీ పోలీసులు సోమవారం అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. 2016లో నమోదయిన దేశద్రోహం కేసులో కన్హయ్యకుమార్, ఉమర్ ఖాలిద్, అనిర్బన్ భట్టాచార్య, కాశ్మీరీ విద్యార్థులు ఆకిబ్ హుస్సేన్, ముజీబ్ హుస్సేన్, మునీబ్‌హుస్సేన్, ఉమర్‌గుల్, రయీయా రసూల్, బషీర్ భట్, బషరత్ తదితరులపై ఆరోపణలు నమోదయ్యాయి. పార్లమెంటుపై దాడి కుట్రదారు అఫ్జల్‌గురుకు ఉరిశిక్షను అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ 2016 ఫిబ్రవరి 9న వర్శిటీ క్యాం పస్‌లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారని వీరిపై ఆరోపణలు నమోదయ్యాయి. దేశద్రోహం నేరం కింద కన్హయ్యకుమార్, ఉమర్ ఖాలిద్, అనిర్బన్ భట్టాచార్యలను 2016లో అరెస్టు చేశారు. కాగా, సోమవారం దాఖలయిన అభియోగపత్రంపై మంగళవారం విచారణ జరుగుతుందని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సుమిత్ ఆనంద్ ప్రకటించారు. భారత దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన వారిలో కన్హయ్యకుమార్ కూడా ఉన్నాడని పోలీసులు పూర్కొన్నారు. దీనికి సంబంధించి రికార్డు చేసిన వీడియో కూడా సరయినదేనని ధ్రువీకరణ అయినట్లు వారు అభియోగపత్రంలో పేర్కొన్నారు.

మహాకూటమి సంగతేందీ?

- మోడీ నమో యాప్‌తో ప్రీ పోల్ సర్వే
- డజన్ ప్రశ్నలు సంధించి పిఎం



న్యూఢిల్లీ : దేశంలో ప్రతిపక్షాల ప్రతిపాదిత కూటమి మహా ఘట్‌బంధన్ ప్రభావంపై ప్రధాని మోడీ పేరిట ఉన్న నమో యాప్ ఆరా తీసింది. దీనిని ప్రీ పోల్ సర్వేగా భావిస్తున్నారు. జనం నాడీని పసికట్టే దిశలో చేపట్టిన చర్యగా విశ్లేషిస్తున్నారు. బిజెపి వ్యతిరేక కూటమి గురించి ఏమనుకుంటున్నారు? దీని ప్రభావం మీ నియోజకవర్గంలో ఉంటుందా? బలం పుంజుకుంటుందా? వంటి అంశాలపై దేశంలోని ఓటర్ల నుంచి అభిప్రాయాలను కోరారు. నమోయాప్‌లో మొత్తం డజన్ ప్రశ్నలు వేశారు. ప్రతిపక్షాల మహాకూటమి గురించి తాము ప్రజల నాడిని తెలుసుకునేందుకు ఈ యాప్ ద్వారా యత్నిస్తున్నామని,

ఈ సర్వేలో ప్రజలంతా విరివిగా పాల్గొనాలని ప్రధాని మోడీ సోమవారం తమ ట్విట్టర్‌లో సంక్షిప్త వీడియోను పొందుపర్చారు. పలు ప్రశ్నలు ఈ యాప్ ద్వారా సంధించారు. ఇందులో మహాఘట్ బంధన్ ప్రశ్న కూడా వేశారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మహా ఘట్‌బంధన్ గురించి ప్రధాని ఆరా తీయడం కీలకంగా మారింది. ఇక కేంద్ర ప్రభు త్వం వివిధ రంగాలలో చేపట్టిన పలు పథకాలు ఏ విధంగా ఉన్నాయి? వీటి అమలు తీరుతెన్నులు ఏమిటీ? తమ రాష్ట్రాలు, ప్రత్యేకించి తమతమ నియోజకవర్గాలలో మోడీ పథకాలపై ఏమనుకుంటున్నారు? వంటి పలు అంశాలను ఇందులో ప్రస్తావించారు. చవకైన ఆరోగ్య పరిరక్షణ, రైతుల సౌభాగ్యం, వారి పరిస్థితి, అవినీతి రహిత పాలన, సుపరిపాలన, ఉపాధి ఉద్యోగాలు, మౌలిక వ్యవస్థ నిర్మాణ ప్రక్రియ, గ్రామీణ విద్యుద్దీకరణ వంటి అంశాల గురించి కూడా పలు ప్రశ్నలు సంధించారు. ప్రభుత్వ గమనం, తీసుకుంటున్న చర్యల గురించి తాము ఈ ముందస్తు ఎన్నికల సర్వేను చేపట్టినట్లు, జనం అంతా ఈ సర్వేలో పాల్గొని తమ స్పందనను తెలియచేయాల్సి ఉందని ప్రధాని స్వయంగా తమ వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఈ సర్వే నిర్వహణ బిజెపికి చాలా ఉపకరిస్తుందని, ప్రత్యేకించి విజయావకాశాలను మెరుగుపర్చుకోవచ్చునని , ఓటర్లు దీనిలో పాల్గొనేలా చేయడంలో కార్యకర్తలు తమ వంతు పాత్ర పోషించాలని ప్రధాని అభ్యర్థించారు. వైఫల్యాలను తెలుసుకుని, తద్వారా వాటిని నివారించుకునేందుకు వీలేర్పడతుందని ప్రధాని అభిప్రాయపడ్డారు.

ఎన్నికల నిర్వహణకు ఇంకా కొంత గడువు ఉన్నందున తగు విధంగా లోపాలను సవరించుకుని మరింత సమర్థవంతంగా, ఆత్మ విశ్వాసంతో ప్రజల వద్దకు బ్యాలెట్ పోరు కోసం వెళ్లేందుకు వీలుంటుందని ప్రధాని తెలిపారు. నమోయాప్‌లో మహాఘట్‌బంధన్ అంశం చివరి ప్రశ్నగా ఉంది. దేశ సార్వత్రిక ఎన్నికలకు ముందు బిజెపితో సరైన విధంగా తలపడేందుకు ప్రతిపక్షాలు సంఘటితం కావాలని యత్నిస్తున్నాయి. కర్నాటక తరహాలో అన్ని పార్టీలు కలిసి మహాఘట్ బంధన్ ఏర్పాటుకు రంగం సిద్ధం అవుతోంది. అయితే ప్రతిపక్ష కూటమి ఒక భ్రాంతి దీని వల్ల ఎటువంటి ఫలితం ఉండదని, తమకు వచ్చే నష్టం అణువంతైనా లేదని బిజెపి నేతలు చెపుతూ వస్తున్నారు. కానీ నమోయాప్ ద్వారా మహాఘట్ బంధన్ గురించి ప్రధాని ఆసక్తి చూపడం కీలక అంశంగా మారింది. మహాఘట్‌బంధన్ ప్రభావం ఉంటుందా? ఉండదా? కేవలం ఉంటుంది లేదా ఉండదు అనే జవాబులు ఇస్తే సరిపోతుందని యాప్‌లో తెలిపారు.

నమో యాప్ సర్వేలోని కీలక ప్రశ్నలు

- ప్రభుత్వ పనితీరుపై మీ స్పందన ఏమిటీ?
- ఓటు వేయడానికి వెళ్లే ముందు మీరు దేనికి ప్రాధాన్యతను ఇస్తారు?
- ఏఏ పథకం ఏ తీరున అమలు అవుతోంది?
- సుపరిపాలన సరైన దిశలో సాగుతోందా?
- మీమీ నియోజకవర్గాలలోని ముగ్గురు ప్రముఖ బిజెపి నేతల పేర్లు తెలుపండి
- మీ ఎంపిలు మీకు అందుబాటులో ఉంటున్నారా? లేదా?
- మీ ఎంపికి మంచి పేరుందా? ఏదైనా మంచి పనిచేశారా? స్పందన ఏ విధంగా ఉంది?
- సౌకర్యాలు సమకూరాయా? వాటితో సంతృప్తి చెందారా?
- కరెంటు సరిగ్గా ఉంటున్నదా? పోతున్నదా?
- మంచినీళ్లు దక్కుతున్నాయా? ఆరోగ్య చికిత్సలు అందుతున్నాయా?
- విద్యా ఉద్యోగ అవకాశాలు ఏ విధంగా ఉన్నాయి?
- బిజెపికి ఏమైనా విరాళాలు ఇచ్చారా? ఇచ్చే ఆసక్తి ఉందా?
- ప్రభుత్వ పనితీరు మెరుగు పడిందా? లేదా?
- గతంతో పోలిస్తే దేశ భవిత పట్ల ఇప్పుడు ఆశాభావంగా ఉన్నారా? లేదా?

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666